# కోవిద్-౧౯

## పేరడీలు - కవితలు





Dr. Lanka Siva Rama Prasad

డాక్టర్ లంకా శివరామప్రసాద్

# కోవిడ్-౧౯

## పేరడీలు - కవితలు



# COVID - 19

Parodies and Free Verse Poems

డాక్టర్ లంకా శివరామప్రసాద్

**Dr. Lanka Siva Rama Prasad**

# కోవిడ్-19
# COVID-19
## Parodies and Free Verse Poems

by

**Dr. Lanka Siva Rama Prasad**

July 2020

All rights reserved

Copyright @ 2020

**Dr. Lanka Siva Rama Prasad**

For Copies:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442, 6305677926
Email: lankasrprasad@gmail.com
**www.anuvaadham.com**

Price : ₹ **200** **$ 4**

Cover Design & Post Script :

**Prakash Pula**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

# ప్రస్తావన

అడుగిడె కోవిదు డడిగెద
కడువడి నడిగిన మగుడు నుడగడు యడుగున్
వెడవెడ గాడుపు తడబడ
నడుగిడు నడుగిడడు జడిమ జ్వరముడుగు మడుగున్.

కలయో! వైరస మాయయో! యితర సంకల్పార్థమో! జ్వరమో!
తలపన్నేరకయున్న వాడినో? యల్ యస్ ఆర్ ప్రసాదు గానో, పర
స్థలమో! కోవిదుడెంత? యాతని యాతనంబడి యజాండంబు ప్ర
జ్జ్వలమై యుండుట కేమి హేతువో? మహాశ్చర్యంబు శోధించగన్

అమ్మలగన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల బె
ద్దమ్మ సురారులమ్మ కడుపారడి బుచ్చిన యమ్మ దన్ను లో
నమ్మిన యీ ప్రసాదు మనమ్మున నుండెడి యమ్మ దుర్గ మా
యమ్మ కృపాబ్ధి యిచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్

ఎందరు కవి రాజులేలిరి కవితా మహావిభవంబు తోడ ము
న్నెందరు కవులేలుదురో యేరికి శాశ్వతమొక్కో, దీనికై, ని
బంధనలు లేని చందోరహిత కవితా పాటవమున యీ కరోనా
గ్రంథ ముగ్గడించ తలపోసిన యంత మా యమ్మ కరుణించెన్

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**

***(మార్చి, ఏప్రిల్, మే, జూన్ 2020 – కరోనా క్వారంటెయిను కాలపు వందరోజుల కవితావర్షధార)***

# విషయసూచిక


1. విశ్వనాథ సత్యనారాయణ ...... 7
2. బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు... 8
3. అల్లసాని పెద్దన–మనుచరిత్ర ..... 8
4. శ్రీనాథుడు ...................... 9
5. తిరుపతి వెంకటకవులు....... 10
6. తిక్కన సోమయాజి............ 11
7. బలిజేపల్లి లక్ష్మీకాంతం ....... 13
8. బమ్మెర పోతన................ 14
9. గుర్రం జాషువా ............... 15
10. కందుకూరి జనార్ధన కవి..... 16
11. అల్లసాని పెద్దన ............... 17
12. కంచర్ల గోపన్న................ 18
13. ధర్మపురి శేషప్ప ............... 19
14. నంది (ముక్కు) తిమ్మన....... 20
15. నన్నయ ....................... 21
16. భర్తృహరి ...................... 22
17. మారవి వెంకయ్య ............ 23
18. తెనాలి రామకృష్ణ............. 24
19. తాళ్ళపాక అన్నమాచార్య ..... 25
20. ధూర్జటి........................ 26
21. చేమకూరి వెంకటకవి......... 27
22. నన్నెచోడుడు ................... 28
23. ఎర్రా ప్రెగ్గడ ................... 29
24. మారన ......................... 30
25. నాచన సోమన ................ 31
26. అనంతామాత్యుడు............. 32
27. ఆతుకూరి మొల్ల............... 33
28. శ్రీకృష్ణదేవరాయలు............ 34
29. పింగళి సూరన ................ 35
30. రామరాజభూషణుడు ......... 36
31. పొన్నెగంటి తెలగన్న .......... 37
32. కంకంటి పాపరాజు ........... 38
33. వేమన .......................... 39
34. బద్దెన.......................... 40
35. శ్రీశ్రీ ........................... 41
36. దాశరథి ........................ 41
37. కాళోజీ నారాయణరావు ...... 41

## అనుబంధం

# చీకటి చెట్టుమీద వెలుతురు పిట్టలు


1. మధ్యందిన మార్తాండులు ........ 45
2. అర్థమవుతుందా నీకు! ........ 46
3. కోటి పాతాలు ........ 48
4. ఆటస్థలాల్లో అగ్ని పర్వతాలు ........ 49
5. విరామ చిహ్నాలు ........ 50
6. తాగుడు మూతలు ........ 51
7. కరోనా మందు కాలము ........ 53
8. మధ్య మార్గము ........ 56
9. వలస చేపలు ........ 57
10. పెట్టు బడు-ద్దాయి-లు ........ 59
11. కరోనా, యల్. జి గయా, క్యా కియా! ........ 60
12. లాక్‌డౌన్ నుంచి లాకప్పులోకి – అప్పగింతలు ........ 61
13. ఇక్కడ ఖాళీ లేదు ........ 62
14. చీకటి చెట్టు మీద వెలుతురు పిట్ట ........ 63
15. మనసారా మన సారా! ........ 64
16. ట్రెయినుకూ ట్రెయినుకూ మధ్య దూరం ........ 65
17. మూడు కోతులు... ........ 66
18. ఎందుకయ్యా వలసపోవడం? ........ 67
19. పునర్నిర్మాణం ........ 69
20. ఈ చదువుల్ని తగలెయ్య ........ 71
21. ఇంకా తెలవారలేదు... ........ 73
22. పనికి రాని వాళ్ళు... ........ 75
23. విరోధ భారతం... ........ 77
24. అవుటర్ రింగు రోడ్లు... ........ 79
25. బీరు గంధము తెచ్చినారము... ........ 80
26. చైనా పిల్లి... ........ 81
27. రావడానికీ పోవడానికీ మధ్య... ........ 82
28. ఆలయాల్లో నాకూ నీకూ మధ్య దూరం... ........ 83
29. ఎక్కడి మిడతలు అక్కడే గప్‌చుప్ సాంబార్ బుడ్డీ! ........ 85
30. ఒక నీటి కల ........ 86

31. రెండు వాన చినుకులు... ................................................ 88
32. అతడింకా చనిపోలేదు... ................................................ 89
33. గోస యాత్రలు... ................................................ 90
34. వసుదేవుడు కూడా గాడిద కాళ్ళు పట్టుకున్నాడు, కానీ... ................ 92
35. ఎక్స్-పైరీ డేట్ ................................................ 95
36. తిండిపోతు లెక్కలు... ................................................ 97
37. గోడల యుద్ధాలు... ................................................ 99
38. మనసన్నది... వెళ్ళి ఆ మేఘ శకలాన్ని కోసుకురా... ................. 101
39. అలిగిన వేళనె చూడాలీ... ................................................ 103
40. వేలి మీద గోరు మొలిచింది... ................................................ 105
41. సబ్బు నీటి బుడగలు... ................................................ 106
42. అవునూ మీకేమని అనిపిస్తుంది?... ................................................ 108
43. ఎనిమిది కాళ్ళ పల్లకెక్కి యేడబోతివి నాయనా... ................................ 110
44. పట్టుకుంటే పదివేలు... ................................................ 112
45. ఒక ఫ్యానూ ఒక తాడూ ఒక మెడా ................................................ 113
46. ...వెళ్ళిపోయాక నీవు అడుగుతావు... ................................................ 115
47. కా కస్య పరివేదనా? ఎవరయ్యా బాధపడేది? ................................ 116
48. లావొక్కింతయు లేదు... ................................................ 118
49. పాములూ-నిచ్చెనలూ... ................................................ 120
50. ఇంద్ర గర్వభంగం... ................................................ 122
51. నియోబి కన్నీళ్ళు... ................................................ 124
52. గర్వము సర్వము చెరుచును... ................................................ 126
53. సిసిఫస్ మరియు శిశుపాలుడూ... ................................................ 128
54. నాలుగు పాదాల నడుస్తున్న పశువు... ................................................ 131
55. ఈ దారి నీకు నచ్చుతుందా-1 ................................................ 133
56. నైమిశారణ్యంలో వ్యాస, శుక, సూత, శౌనకులు... ................................ 135
57. స్విచ్చి అక్కడ చీకటి ఇక్కడ...! ................................................ 137
58. అన్నీ ప్రత్యేకతలే ఈ అర్ధరాత్రి స్వతంత్ర దేశానికి ................................ 139
59. ఏడుగురు అక్కాచెల్లెళ్ళూ-అయిదు వేళ్ళూ-ఒక కోడి మెడా... ......... 143
60. నాడుల కథా-కమామీషూ... ................................................ 145
61. రేపటి గ్రహణాలు-రాబోయే రణాలూ... ................................................ 147
62. తమను నమ్మిన భార్యలనమ్మిన వాళ్ళు... ................................................ 149
63. షడ్భిః కర్ణో నిపాతితః... ................................................ 153
64. బర్బరీకుడి ఖండిత శిరస్సు... ................................................ 156
యజుర్వేదం-శాంతిమంత్రము ................................................ 159

మరల నిదేల కరోనాయణమన్నచో నీ ప్రపంచమెల్ల నెల్ల వేళ
తినుచున్నదే తినుచున్న దిన్నాళ్ళు తన వ్యాధి బ్రదుకులు తనవి గాన
చేసిన ఉద్యోగములే చేయుచున్నది తనదైన బాధ్యత తనది గాన
అందరు తలచిన వైరస కోవిదునే తలచెద నేనును నా కథ నాది గాన

వైరస శక్తి లోన, పఠనాసక్తి లోన,
వ్యాధి తీరుతెన్నులున్న సంవిధాన
దేహ సందేహాదుల దేహియై తీర్చ
కొలది చెప్పితి నీ కోవిదు గాథ

**(విశ్వనాథ సత్యనారాయణ - శ్రీమద్రామాయణ కల్పవృక్షము)**

# వైరస అకాల చక్రము

కాలరథమ్ము మీదనె వైరసాధిపతి నిత్యము స్వారి చేయునో?
కాలరథమ్ము చక్రముల ఘట్టన పుట్టుచు రాలుచుండు కెం
ధూళి కణమ్ములే అగునో తోచెడి ఈ సకలవైరసాళియున్
కాల రహస్యము తెలియ గల్గుటె వీటి పుట్టుకకున్ ఫలమ్మొకో

**(బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు)**

అచటి విజ్ఞులు గెల్చి రఖిల దేశాల నాగరికతా
విజయాల నవలీలగా విస్తృత శాస్త్రజ్ఞానమున
అచటి ప్రజలు ఎటువంటి విపత్తులోనైన
గుండె ధైర్యము గూడి మెలగు చుంద్రు,
అచటి శ్రామికులన్ని దినముల యందు
పనినె దైవముగా ఫలము నొందెదరు,
అచటి విద్యార్థులు అన్ని దేశములలోన
తమ జ్ఞాన తృష్ణతో తగు కీర్తి నొందెదరు,

అచటి కర్షకు లారుగాలము శ్రమించి
అన్నపూర్ణగ దేశమునలర జేయుదురు
అట్టి దేశమందరికి నదిని దాటించెడి నావ,
అచట బుట్టిన చిగురు కొమ్మైన చేవ

(అల్లసాని పెద్దన-మను చరిత్ర)

# వైరసిక గీతాలు

వైరసికుడు పోడిక చైనా
పైరసీకైనా, డూప్లికేట్ వస్తు వరసలకైనా,
విరిసిన వైరసు జ్వాలా
విరిలో జీవాశ్వరథము విరిగి క్రుంగిన వేళన్...

అంగడి తెరవ లేదు, లాక్‌డౌన్ ఆగలేదు, కాస్తంత రాగి
సంగటి కూడా లేదు, ప్రియాంగనా వీడియోలు లేవు, విస్కీ
సంగతి వినబడనే లేదు, పేకాట కిక్కు లేదు, క్రికెట్టూ లేదు,
బంగరు కిళ్ళీ లేదు, సిగరెట్టూ లేదు, లంగరు వేసిన ఈ నావలో!

వోసి కోవిది! యార్భటిన్ మెరవకుమీ, వైద్యంబు లేదే నిను
చూసీ చూడక పోదుమన్న, అంటుకుని జుమ్మని వస్తుంటివేమి?
మూసీ ఏట్లో నిను ముంచ, బ్లీచింగు నీ ముహాన జల్ల, నీ మీద
రాసీభూత వ్యాక్సీను విరజిమ్మ, నిను రాళ్ళతో కొట్టవలెనే వైరసా!

(మహాకవి శ్రీనాథుడు)

# వైరసోద్యోగ విజయాలు

జెండాపై హెచ్ఐవి రాజు, ముందు సార్సు శ్రేణియుం గూర్చి నే
దండంబున్ కొని హృదయ స్పందనము మీదన్ నారి సారించుచున్
గాండీవమ్ము ధరించి కోవిదుండు మీ మూకం జెండుచున్న పుడు వా
క్కుండును నీ మొరాలకింపడు న్యూయార్కు పురనాథ సంధింపగన్...

అదుగో వుహాను, వైరసు మందలవిగో, అందందు గోరాడు అ
య్యదియే కోట, అదే ల్యాబు, అదే మార్కెటు, వారలే చైనీయుల్,
అది గబ్బిలాలు వసించు గుహ, అదిగో పంగోలిను, అదే కోవిదా
భ్యుదయంబై వైరస హృదయాంతర తరంగోచ్చండమై పర్వెడున్...

ఎక్కడి నుంచి రాక యిట కెల్లరున్ సుఖులే కదా? యశో
భాక్కులు నీదు అక్కలును, రోగ మనస్కులు నీదు అన్నలున్
చక్కగ నున్న వారె, శక్తిశాలి కోవిదు కన్య అగ్రజాజ్ఞకున్,
చిక్కక నిల్చి జనాల అంతున్ చూడ తా చరించునే తెల్పు కరోనా!

మావా ఎప్పుడు వచ్చితీవు? సుఖులే సార్సుల్, మెర్సుల్ చుట్టముల్,
నీవా లభ్యము కావు నియమిత టెస్టులందు ఎంతెంత వెదికినన్
మీ వంశోన్నతి కోరు మిత్రులున్, మీ మేల్గోరు హెర్పిసాది వైరస
దేవుల్ సేమము మై నెసంగుదురే, నీ తేజంబు హెచ్చించుచున్

ముందుగ వచ్చితీవు, మున్ముందుగ ఈ మానవు నేను చూచితిన్,
బంధుగులము మనము, నంచుకు తిందెదమీ నరార్భకున్, వృధ
చెందుట వాని వంతు, మీకు నే సాయము చేసెద వీడు నశించగా
విందులు గైకొనుడు విహంగ వాహినులై వేడ్కగా విహరించుచున్...

చెల్లియొ చెల్లకొ తమరు వాడిన మందులు చూచిరందరున్,
తొల్లి గతించె నను డ్యూటీకి పంపిరి రంధి సేయ, నీ యిల్లాలు
పిల్లలు పాపలున్ ప్రజలు పెంపు వహింపగ లాక్ డౌనందువా
యెల్లి దారుణంబు చూసెదవా యెర్పడ చెప్పుము నరేశ్వరా!

**(తిరుపతి వెంకట కవులు)**

# వైరస భారతము

తెల్ల ఏనుంగుపై నెక్కి పెక్కేనుంగులిరుగడ
        రా విశ్వ బుర వీధుల గ్రాలగలడె,
అణు మణిమయంబైన భూషణ జాలముల నొప్పి
        వైట్ హైస్ యొడ్డోలగంబున నుండ గలడె,
వాక్సీను కర్పూర చందన క్లోరోక్వీను కస్తూరికాదుల
        నింపు సొంపార ట్రంపాడి భోగింపగలడె,
యఫ్ డి యే యతి మనోహరలగు చతుర్బలాంగనల గూడి
        కోవిద్యుద్ధ సంగతి వేడ్కలు సలుపగలడె,

కయ్యమునకు కాలు దువ్వి ఓడిన అమెరికౌరవేంద్ర,
వినుము నా బుద్ధి మరలి ఈ యెగో తనువు విడిచి
సుగతి వడయుము తొల్లింటి గొప్పలు చూరగలదె
అగ్ర రాజ్యపు జూదమిచ్చుట నాడంగరాదు సుమ్ము-

ఎవ్వాని వాకిట కరోనా పదపంకంబు
        వైరసు భూషణ రజో రాసియై నొప్పు,
ఎవ్వాని చరిత్రమెల్ల దేశాలలో నిగూఢ
        రహస్యమై విస్మితంబు నొరపు గరపు
ఎవ్వాని కంటబడకుండ ఇందరిందరు
        మాస్కుల వెనక ఆగమాగమవుతుండ్రు,
ఎవ్వాని జన్యు పరీక్షలు ఎక్కువగ జేయ
        పాజిటివ్ రావద్దని ప్రజలు మొక్కుతుండ్రు,

అతడు భూరి ప్రతాప వైరస ప్రదీప
సామాజిక దూర ఘటనా ఘటిత వీర
కరోనా కోటీర మణి స్పైకు శుభ వస్త్రాంగి
తలుడు కేవల మమరుడే కోవిదుండు.

సింగంబది చీకటిలో బిలాంతరమునం చరించు గబ్బిలాలనా షి
జెంగ్లి పరిశోధనకై బంధించి తెచ్చి వుహాన్ ల్యాబులందుంచి
అంగాంగంబు శోధించి, యునికికై జన్యు పరీక్షలనేకము జే
యంగ తేజము వృద్ధి నొంద వచ్చెం కోవిదుండు భీకరాకృతిన్

వైరసులశాంత శూరులు, రోగి ఊపిరితిత్తులందు చేరి ఉక్కిరి బి
క్కిరి చేసి, ఊపిరినొక్కి, వెంటిలేటరుకు తొక్కి, దీపమార్పి,
వారసులకు కబురందించులోపే గగనసీమల కాత్మను సాగనంపి
సరసముగ చూచుచునున్న వారికిన్ సోకు ఈ వైరసెప్పుడు చచ్చునో

**(ఉభయకవి మిత్రుడు తిక్కన సోమయాజికి వందనాలర్పిస్తూ...)**

# సత్య కోవిదేంద్రీయము

మాయామేయ వైరసే సత్యమని సంభావించి నిగ్రహంబునన్,
ఆయా వ్యాక్సీనులు, ప్లాస్మాలతో ప్రాణంబుండు దాక పోరాడి, యెం
తోయల్లాడిన యీ శరీరమిప్పుడీ వెంటిలేటర్లలో చిక్కుకుని కాలుచో
ఆయా డాక్టర్లు, నర్సులెంత శ్రమించినన్ కాలుని ఆపగలరే యోచింపగన్...

చతురంబోధీ పరీత భూవలయ మెల్ల కోవిద్ వైరసు ధాటికి నియ
మిత లాక్ డౌను కేగెను, నిశ్శబ్దమే ఆహా కమ్ముకొనెను వాడలంతటన్;
సతతము రణగొణ ధ్వనులు రాజ్యమేలు మృత్యు రహదారులన్నియు
మూతబడగా, ప్రశాంత కాంతి నృత్య మాడె నెల్లెడల మహాశ్చర్యంబుగన్..

దళమో సింహదంతిదో, తులసీ దళమో, అల్లమో, పసుపు వెల్లుల్లి మిశ్రమ
ఫలమో, అజిథ్రోమైసినో, క్లోరోక్విన్నో, ట్రంపాడిన అల్ట్రా వయొలెట్ కిరణ
జాలమో జాలము సేయక ఇచ్చి, ఆ యాంటీబాడీలో వ్యాక్సీనులో దెచ్చి,
కాలమోడ్చిన గాలమీ కోవిదు నుంచి కాపాడరయ్య సకల శాస్త్రార్థ కోవిదుల్

**(బలిజేపల్లి లక్ష్మీకాంతం కవివర్యులను స్మరిస్తూ...)**

# కోవిదు-19 ఏ విధంబుగా చెలరేగినదనిన...

చలచలనై తుమ్ముల, తుంపరనై
కలకలమై, కరడు కట్టిన తెమడల తుఫాను వానై,
తల బరువై, ఊపిరి కరవై, కండ
రాలు మండిన నెగడై, ఆయాసమునైనదీ వైరసాగ్ని!

నవనవలాడుతు నవంబరులో
నవనవోన్మేషముగ నవ శాస్త్రజ్ఞుల ద్రోసెనగ్నులన్
నవ రూపముతో డిశంబరు లోన
నవ లోకాల నడిచి నవ్వుల పాల్జేసె నవ శాస్త్రములన్

మార్చిలో మొదలైన జ్వాల
మార్చి, మార్చి, వచ్చి, సర్వ జనులనేమార్చి, మార్చి,
మిర్చి మంటలను మించి కాల్చి,
కార్చిచ్చు వోలె విశ్వమంత తెగ కాల్చుతు తిరిగెన్

ఊపిరి తిత్తుల నూపి ఊపి
చీపురుతో ఊడ్చిన చెత్తవోలె లోచేరిన కఫమంతయు
కాపు సారా వోలె కారిన భంగిన్
రేపీ దేహభాండమే రీతి పగులునో ఊహింప శక్యమే

**(సహజకవి బమ్మెర పోతనకు వందనాలు సమర్పిస్తూ...)**

# వైరస చంద్రహాసము

ఇచ్చోటనే ట్రంపునరేంద్రుని ప్రెసిడెంటు కలలు
కరోనా నిప్పులలోన కరిగిపోయె,
ఇచ్చోటనే రోము, లొంబార్డీ ఇటలీ ప్రజల కేకలు
మృత్యుఘోషలోన మునిగిపోయె,
ఇచ్చోటనే ఇరాను, స్పెయిను, బ్రెజిల్ తళతళలు
విస్తృత విషగంగలో విరిగిపోయె,
ఇచ్చోటనే యెట్టి పేరెన్నికన్ గన్న బ్రిటన్ జర్మనీలు
అంబులెన్స్ శబ్దాల హడలి పోయె,

ఇది వైరసాసురులతో మానవమాత్రుండు
మాస్కులు ధరించి నడుచు రంగ స్థలము,
ఇది కోవిదు వైరసు తీక్షణమౌ దృష్టులరయ
అవని పాలించు కరోనా సింహాసనమ్ము...

ఎన్నో రోజులు గతించిపోయినవి కానీ ఈ క్వారంటైను స్థలిన్
అన్నార్తుండైన వలస కూలీల గోస ఆలకించ నొక్కండును రాడు
ఎన్నాళ్ళీ చలనంబు లేని సామాజిక దూరంబు, యే తల్లు లల్లాడిరో,
కన్నీటంబడి క్రాగి పొయినవి నిక్కంబీ వైరస బిందు పాషాణముల్...

**(నవయుగ కవితాచక్రవర్తి జాషువా గారిని స్మరిస్తూ...)**

# వైరస జనార్ధనీయం

నిన్న రాతిరి మాస్కు లేకెటు నీవు పోతున్నావురా,
ఉన్న మార్గము లన్ని మూసినా నీకిదేంపోయే బుద్ధిరా,
విన్న వార్తలలోన బాగా వీధిపోలీసులు తన్నిరా
కన్నులార చూచినోళ్ళు కడుపుబ్బ నవ్విరి జనార్ధనా...

సిరులు తెచ్చిన గట్టి పొగరుతో శ్రీ వూహాను, చూడగ పోతివా
తరులలోన గబ్బిలాలతో కాస్త తగని దారులు చూస్తివా,
మురుపు చూపుతు దగ్గినావా, మూడుసార్లు తుమ్మినావా,
జ్వరపు రాకతో ఆస్పత్రికెల్తే జరా భద్రమె జనార్ధనా...

ఆనపెట్టిన రాకపోయెను పాజిటివ్ అటు మొన్ననూ,
పూనిపిల్వగ మాట రాక పూడె గొంతు నిన్ననూ,
మేను చూడగ కాలుతున్నది మే ఎండ లా నేడునూ,
నేను ఇప్పుడు భయపడేది ఏ కోవిదో అని జనార్ధనా!

**(కందుకూరి జనార్ధన కవిని స్మరిస్తూ...)**

# వైరస మను చరిత్ర

అట జని గాంచె షి జెంగ్లి గుహాంతరమందున్న అనేక తైలపాయులన్,
చిటపటల హ్రీంకారాలతో తలక్రిందుల వేలాడు గబ్బిలాలన్, వి
స్ఫుట నటనానుకూల విహంగ భుజంగ తరంగ పంగోలినాదులన్ ఆ
ఘటములందు ఆశ్రయమొంది సుఖించుచునున్న కరోనా వైరసులన్...

ఎవ్వతెవీవు స్పైకు కిరణేక్షణ? యొంటి జరించెదవీ గబ్బిలాలలో
ఎవ్వరికిం గానరాని గుహలలోనుండనేల, రా! మా హైటెక్కు ల్యాబులో ఇం
కెవ్వరికీ లేని శక్తులనిచ్చి విశ్వ వ్యాప్తిం జేసి పేరు గడింప జేసెద
మివ్వన విహారములు మాని జీవాయుధంబువైన మాకున్నీకు శుభంబు కలుగున్

నిరుపహతి స్తలంబు, మానవ ఊపిరితిత్తులు, గుండె, ప్రేవులు, మూత్ర పిండము
లు రక్తనాళములందున్న ఏస్-టూ రిసెప్టారులుండు దారి చూపింపుము ఈ చరా
చర జగత్తును శోధించు శాస్త్రజ్ఞులు మా జన్యుశోధన చేసి వ్యాక్సీనులతో మము
మారణహోమమ సేయక మునుపే; లేకున్న ఊరక ల్యాబులో నుండుట మాకు శక్యమే?

**(ఆంధ్ర కవితా పితామహుడు అల్లసాని పెద్దనను స్మరిస్తూ...)**

# వైరసథీ శతకము

ఎక్కడిదీ వైరసు, దీని చుట్టములు మెర్సులు, సార్సు లందురు,
ఎక్కడ దీని నివాసమన్న బిలాలలోని గబ్బిలాలందురు, మరి
అక్కడ నున్న వానినిక్కడకున్ దెచ్చి యింత కల్లోలమున్ జేసి
తక్కెడ నున్న కప్పల వోలె కలహింతురదేల కరుణాపయోనిధీ...

సిరిగలనాడు మైమరచి మరింత సిరికై గుహల్ వనముల్ జొచ్చి, ఊ
పిరి ఆగిననాడు ఎందుకు సేతినీపని యని పొక్కిన గల్గునె? గాలి దు
మారము కార్చిచ్చుగా మారి మహమ్మారి యై మాడ్చు వేళలందు త
త్తరమున వ్యాక్సీనుకై తవ్విననన్ కల్లోలము తగ్గునే కరుణాపయోనిధీ...

సలలిత వైరస నామ జపమే సలిల ఫేస్బుక్కు స్నానమై సొబగునొప్ప,
నిలయ మీడియా విద్వాంసులెల్ల నిత్య మరణ పట్టికల్ వల్లె వేయ,
తెలియ నశల్య వైద్యులు రోజుకో తెరువు జెప్పి మరల ఖండించు వేళ,
తలపగ దేశాధీశులందరూ వాదులాటల తరుణోపాయము మరచుచుండ
తలచి జీవింప నా తరమే వైరసు కోవిదుకున్ తలవంచక కరుణాపయోనిధీ...

**(భక్తకవి కంచర్ల గోపన్నను స్మరిస్తూ...)**

# నర వైరస శతకము

ఇంట్లో ఉండక వెళ్ళి వీధుల్లో తిరిగిన
వెంటబడి వచ్చు వెర్రి జ్వరము,
బిలియనీరైనా పారాసిటమాలే గాని
మెరుగు బంగారమ్ము మింగబోడు,
విత్తమార్జన చేసి విర్రవీగిన వాళ్లూ
క్వారంటైను లోన కుమలక తప్పదు,
పొందుగా షోకుల్తో ఫోజులు కొట్టాలన్నా
సామాజిక దూరపు షాకు కొట్టును నీకు-

ఐసోలేషనో, మందులో, వెంటిలేటరో
ఏది రాసిపెట్టుందో ఎవరి కెరుక?
శాస్త్రజ్ఞానాల్ప విచారా! శాసన వీర!
అహంకారీ! నరా! బుద్ధితో మెలగుమురా!

అన్ని విద్యలు నేర్చి అణ్వాయుధములు బట్టి
ప్రపంచ యుద్ధముల్ పోరవచ్చు,
అగ్ర రాజై పెరిగి ఉగ్రంగా రాజ్యమేలి,
డాలర్లు, యువాన్లు ధార పోయవచ్చు,
గగనమందు స్పేసుషిప్పుల గతిని మార్చ గలిగి
యెల్ల జంతువుల బట్టి మెనూలో మెక్కవచ్చు,
దిక్కులను క్షిపణులతో దిగ్బంధనము సేసి
మేక రీతిగా సకల దేశాలు మేయ వచ్చు,

ఇన్ని తెలిసి కూడ ఇంత చిన్న వైరసు దెబ్బకు
కూలబడి నీవింత వింతగా కుములుతున్నావు,
శాస్త్రజ్ఞానాల్ప విచారా! బహు శాసన వీర!
అహంకారీ! నరా! అణకువగా మెలగుమురా!

**(ధర్మపురి శేషప్పకవిని స్మరిస్తూ...)**

# వైరస ముక్కు తిమ్మిరి పద్యాలు

నానా సూన వితాన వాసనల నానందించు నా నాసిక నేడే
లా నాకే వాసనన్ తెలియనీకున్నది, అది చల్ది వైరసో యేమో
తానే ముక్కుల్ దిబ్బడ పడజేసి, జ్వరమది జ్వలించగా, పెను తు
ఫానై తుమ్ముల తుంపర ఏర్లయి పారెను నాసికా గుహ లిర్వంకలన్

తనువున వైరసాంధకారపు మదంబలమిన్నగా సోలిన కాంతితో
కనుమూసిరి వందల వేల మానవులీ భయంకర ఉత్పాతమందు,
అనుమానములన్ని దిక్కులా ఒక అణుదేశపు దాహము పై నిలువ,
కనుబొమల్ ముడివేసెనా దేశము కనులెర్రబడగా సాంధ్యరాగమ్మునన్...

కార్మొన్న కటిక చీకటి వలస కూలీలపై మబ్బు కమ్మ
కురిసన లాఠీ దెబ్బలు వడగండ్ల కడగండ్లు కాగా,
కలుషిత నీళ్ళు త్రాగ గవదలు వాయ కంఠ నాళములందు
పేరుకున్న కఫము ఖళ్ ఖళ్ మంటూ బయటకు రాగా,
నుదుటబెట్టిన థర్మల్ ప్రోబు నూరు డిగ్రీలను దాటిపోవ
గొర్రెల మంద బెట్టినట్లు గొడ్ల చావిడి యందు,
ఐసోలేషను పేర సామాజికై దూరముంచిరి గాని
కాళ్ళ కింద చక్రాలు కట్టుకు తిరిగే నేటి యువతను,

జగము గెల్వంగ దండెత్తిన కరోనా వైరసు నుంచి
ఏ రీతి కావగ వలెనొ ఎరుక పడక దీన వదనాల
ప్రభుత్వాలన్ని పరేషానులో బడి పడి పలవరించ
పక పకా నవ్వె కోవిదు పంథొమ్మిదీ ప్రళయమందు

**(కవి నంది (ముక్కు) తిమ్మనను స్మరిస్తూ...)**

# వైరసాస్త్ర ప్రదర్శన

వైరుల జన్మంబు, వైరసుల జన్మంబు
ఏరుల జన్మంబు నెరుగ నగునే,
మొదటి మహమ్మారి మశూచి మోహరింప
మొదలు కూలిన గతి మరువ తగునే,
డెంగు, చికనుగున్యా విష జ్వరాలు సోక
డంగై పోయిన ఊళ్ళు ఖంగు తినెనే,
టైఫసు, హెర్పిసు, హెపటైటిస్, దెబ్బలకు
తూలి సోలిన తీరు తెలియ తరమే-

ఎబోలా ఘాతాలకు లబో దొబోమని ఏడ్చి,
హెచ్ ఐ వి కౌగిలిలో హరియించుకుపోయి,
సార్సు, మెర్సు పాదాల సాగిలపడి మొక్కి,
కరోనా మృత్యు కిరణాల కదిరి పోయిరి గాదె!

వైరస సాలప్రాంశు, నిజోజ్జ్వల త్రవచు సస్వత్ స్పైకుహోలోద్భాసితున్,
వైరిగణ వీర బాలార్క ప్రతిమున్, గబ్బిల వాహినున్, బద్ధోగ్ర మతిన్
వైరసు పరిశోధనల పరీక్షింపబడిన కరోనా వైరసనవ కుటుంబీకుడున్,
వైరి దరిచేరినంతనే దావానలము సృష్టించు అరివీర భయంకరుడున్

ఈ కోవిదుండు సహజ కవచ స్పైకులాంగుడు
ఏక ఆర్ యన్ ఏ తీగెలో జన్యురాశిని కలిగి
మనిషి లంగు కణజాలమందు మంట రగిల్చి
దగ్గు కలిగించి, ఊపిరి నార్పు దనుజ గుణుడు.

**(వాగనుభూషణుడు నన్నయ భట్టారకుని స్మరిస్తూ...)**

# వైరస భర్తృహరీయం

ఒకచో ఒంటెలలోన తిరుగు, ఒకచో నొప్పారు నడవిపిల్లులందు,
నొకచో గబ్బిలాల నధిరోహించు, నొకచో నుత్కృష్ట ల్యాబులనుండు,
నొకచో అమెరికా జెండానెత్తు, మరొకచోట చైనా ఎజెండా ననుసరించు,
నొకచోట గమ్ముననుండి బయటపడు మార్గమ్ము వెదకు నీ కోవిదుండు,

మకర రాశిని జేరిన సూర్యునికున్నట్లు మంచి స్పైకుల హాలో వర్చస్సున్, బా
యక కణజాలమున్ చీరి లోనకు జేరి, యజ్జీవరస జలధి లోని రైబోజోములన్ క
టికపు మైకమునందుంచి, నమ్మించి, తన వృద్ధి ప్రొటీన్ల నుత్పత్తి జేసి, మ
చ్చిక ఘటియించి మూర్ఖ మానవ శ్రేణిన్ న్యుమోనియాలో ముంచు నీ వైరసున్

ఆరంభింపరు నరహంకారులు మాస్కులు సామాజిక దూరమాది సులభ తీరులన్,
ఆరంభించి పరిత్యజింతురు మద్యమత్తులు అందోళన బడి ఆగమాగమైన రీతులన్,
ఆరంభించి తమని తాము రక్షించుకొని ఇతరుల కాపాడెదరు విజ్ఞులు మాటల్చేతలన్,
ఆరంభశూరులు కొందరు ప్రారంభము గొప్ప, ముగింపు ముంపుల వెతలన్...

**(భర్తృహరి కవిని స్మరిస్తూ...)**

# వైరస కరోనా భాస్కర శతకము

ఆపదలందు ధైర్యపు వ్యాక్సీను, జ్వర సంపదలందు పారసిటమాలున్,
భూప సభాంతరాళమున పొందుగ మాస్కు తొడిగి, సామాజిక దూరమున్,
రేపటి రేసులందు శక్తియు, బతుకునందేమరుపాటు లేని అనురక్తియున్
జూపని మానవుని జేరును, అవాంఛిత జన్యు వైరసులు, కరోనా భాస్కరా!

పండితులైన వారు పరిశోధన శాలలందుండగ, రాజకీయ నాయకుండొక్కడు
ద్ధండత పీఠమెక్కి చేయు అణ్వాయుధ ప్రకటనంబులకేమి యెగ్గగున్
కొండొక కిమ్ముత్తర కొరియాను కొరివిగా మార్చగ కింద జపానమెరికాదుల
గుండెలు గుభిల్లుమనియె కదా వుహాను వ్యూహ చైనా కోవిదు కరోనా భాస్కరా!

వైరసాంగన నమ్మరాదు, తన యంకెకు రాదన్న అగ్రభ్రాతు డమెరికానే
వైరి శాస్త్రముల నూడ్చి గర్వ భంగము జేసి చెరిపి, బహు వివేకియైన సింగ
పూరునే పోరునందు భోరుమని ఏడ్పించి ఇటలీ, ఇరాను, కరచరణముల్గోసి,
తారునేవిధంబున దారులబోయ నెండకు క్రాగి కాల్చినభంగినో కరోనా భాస్కరా!

**(మారవి వెంకయ్య కవిని స్మరిస్తూ...)**

# వైరస హాస్యము

తృవ్వట తుమ్ముల తుంపరల
రివ్వున దూసుకుపోయి పరిక్షీణము జేసి
దవ్వున ఊపిరి తిత్తుల
కవ్వముగాగ తిప్పెడు కోవిదునకు జే జే!

గంజాయి యెంజాయి చేసెడి
సంజాతుల గూడి సక్కగ తిన్నావా గబ్బిలాలన్,
పింజారీ వెధవా, చవటా,
కుంజర వైరసుడీనాడే నీ కుత్తుక జొచ్చెన్ ?

ఇంజను చెడి దేశపు బండి
భంజనమై వైద్యపు షెడ్డులోన బడి యున్నది,
మంజరీ రోజుల కొరకున్,
అంజనమేసి అర చేతిన ఆర్తితో జూచుచున్...

సార్సు తోకకు మెర్సు, మెర్సు తోకకు కోవిదు
కోవిదు తోకకు సార్సు, మెర్సు,
మెర్సు తోకకు సార్సు, సార్సు తోకకు కోవిదు
కోవిదు తోకకు మెర్సు, సార్సు,
సార్సు తోకకు మెర్సు, మెర్సు తోకకు కోవిదు
కోవిదుతోకకు సార్సు, మెర్సు,
మెర్సు తోకకు సార్సు, సార్సు తోకకు కోవిదు
కోవిదు తోకకు మెర్సు, సార్సు,

సార్సు తోక మెర్సు, మెర్సు తోక కోవిదు,
కోవిదు తోక సార్సు, సార్సు తోక మెర్సు,
మెర్సు తోక కోవిదు, కోవిదు తోక సార్సు,
సార్సు తోక మెర్సు, మెర్సు తోకే కోవిదుండు,

**(వికటకవి తెనాలి రామకృష్ణ కవిని స్మరిస్తూ...)**

# వైరస రాశి

యిన్ని వైరసుల యునికి- యింతి చెలువపు రాశి
అన్ని తలరాతలు రాసి - అలిగిన రాశి

కలికి వదనగర్తముల గర్త - చిన్నమ్మ రాశి,
వెలయు మీనాక్షికిని - హెర్పిసు రాశి,
పెంపు లావణ్యముల హరించు - పెద్దమ్మ రాశి,
చిన్ని పిల్లల నేడ్పించు చెడు- రోటా రాశి

విష జ్వరమును కలిగించు- వినాశ డెంగూ రాశి,
కీళ్ళ నొప్పుల కూల్చు - చికనుగున్యా రాశి,
లబో దిబో మని మొత్తించు- ఎబోలా రాశి,
కళ్ళు పచ్చగ జేయు- హెపటైటిసు రాశి,

ఆముకొను మెరుపుల మెరయు- ఆ యెన్ కెఫలైటిసు రాశి,
జమిలి గుట్టుగ జవము హరించు- హెచ్ ఐ వి రాశి,
సార్సు, మెర్సుల కూడిన - సాక్షి కరోనా రాశి,
అన్ని రాశుల లోకెల్ల భయము దెచ్చిన - కొత్త కోవిదు రాశి!

**(ఆంధ్ర పదకవితాపితామహుడు -**
**తాళ్ళపాక అన్నమాచార్యులను స్మరిస్తూ...)**

# వుహాన్ కాల హస్తీయం

కోటి జనాభా తోటి మధ్య చైనా లోన
మణి కోటీరమై నొప్పు మహిత నగరమ్ము,
వుహాను, హాంకోయు, హాన్యాంగులు కలిసిన
సౌభాగ్యవంతమైన సుందర త్రి నగరమ్ము,
యాంగ్ షి నదీ స్వర్ణజల రహదారి సొబగుల
ఆకుపచ్చని పొలాలున్న అందమైన నగరమ్ము,
భూప్రపంచాన అతి పెద్దైన మూడు గోర్జెసు ఆనకట్ట
భవిష్యత్ చైనాకు భాగ్యరేఖగు యున్నతి నగరమ్ము,

సాటిలేని బయోటెక్నాలజీ, సాఫ్ట్-వేర్, సంస్థలతో
ప్రతిరోజూ కొత్తగ నుండు ప్రఖ్యాత నగరమ్ము,
హువనాన్ వెట్ మార్కెట్టు వైరాలజీ ల్యాబులున్న
ఆర్థిక క్షేత్రమీ ఊహలకందని వుహాను నగరమ్ము.

ఎదరో విదేశీ విద్యార్థులు ఇటకేతెంచెదరు జ్ఞాన సముపార్జనకై,
ఎందరో పారిశ్రామికులిచ్చట ఎన్నెన్నో సంస్థల భాగస్వాములైరి,
ఎందరో శాస్త్రజ్ఞు లిచట నెరవేర్చుకొనిరి లెక్క కందని స్వప్నాలు,
ఎందరో కవులు స్ఫూర్తి పొందిరి ఎల్లో క్రేన్ టవర్ ప్రాంతమందు.

చదువుల్నేర్చిన ఈ శాస్త్రార్థములు స్వేచ్ఛా భాషణ క్రీడలన్
వదరన్ సోషల్ మీడియాలలో ఈ కోవిదువైరసు ల్యాబులనుంచి
చెదిరెన్ మార్కెటు వేపని వ్రాసి దేశప్రాభిన్ మంటల గూల్చినన్
బెదిరెన్ విశ్వమంత ఇది చైనా వుహాను వైరసన చిత్తగింప గదవే

అయ్యవారిని జేయబోతె కోతైన చందాన పరిశోధన వికటించి
దయలేని వైరసొకటి రయరయ మని దేశదేశాల్ వ్యాపించన్
భయమొక్కటి తాళపు చెవిగానై, లాక్‌డౌను గ విస్తరింప ని
ష్క్రియతన్ ఉండలేని జనులందరు నిను మొక్కిరి గదా కరోనా!

**(ధూర్జటి కవిని స్మరిస్తూ....)**

# వైరస విజయ విలాపం

కణ కేళికా సరసిలో దేలియాడుటజేసి
జీవ ప్రవాల లత కొంత జేర వచ్చు,
రైబోజోము మాలికలతో చెలిమి సల్పుట జేసి
ప్రొటీన్లనన్నిటిని మరికొంత పొందవచ్చు
జీవికింపగు ఆర్ యన్ ఏ రేఖ యుండుట జేసి
కొత్త జాతిని మరింత వేగంగ పెంచవచ్చు
తన వైరస సైన్యము నమితముగ వృద్ధి జేసి
మనిషి ఊపిరితిత్తుల మున్నీట ముంచవచ్చు,

గాక వాయు, రక్త నాళములు, గుండె కిడ్నీలందు
నెరి గలిగి యొక్క మొత్తమై, విడుదలై, మహా ద
ళమ్మై, మెరుపులై, కారు చీకటి క్రమ్ముచున్నపుడు
వైరస విషదృష్టి వృష్టి సోక క్రుంగి కూలె మానవుండు

వైరవ రవ రవలూరి
వైరి వీర రివ రివ లై భవ భవనముల్ గూలి,
భైరవ ఆర్తరావ రవము
లరివీర హృదయ కవాటముల్ కవకవ లాడెన్

మును విన్నది తానప్పుడు
గనుగొన్నది యొక్కతీరుగా దార్కాణై,
పెనుగొన్న మహాశ్చర్యం
బున నన్నరుండిట్టు కోవిదుం బొగడం దొడగెన్

**(చేమకూరి వెంకట కవిని స్మరిస్తూ...)**

# వైరస కుమారసంభవము

పవడంపు తలమీద పి పి యి పటలంబు
పర్వెనా చెయి నింద శానిటైజరు జల్లి,
లాలితంబగు వదనము మీద పల్లవించెనా
గమనీయ మాస్కు వస్త్రములు గట్టి,
మాధవీలత వంటి కరములకు మంచి నిఖార్సైన
రక్షణకై గ్లవుసు రకరకాల గట్టిజూసి,
మీనాలవంటి నేత్ర మెరుపుల మేల్గోరి
సన్నుతంబగు కళ్ళజోడును చక్కగా నమర్చి

వైద్యవరుడు గ్రహాంతరవాసి రూపు దాల్చి
వ్యాధిగ్రస్తులు మరింత వ్యాకులత నొంద
గురుతరమైన బాధ్యత మరి గురుతెరింగి,
మరణ దూతల నెదిరించ మనోస్థిరుడై నిల్చె

గత సంతాపము శీతలీకృత ఐసిసియూ కంతంత సోకి తత్ పరి
మిత మందహాసముల్ మాయమై మరి వందలు వేలై వచ్చుచున్న పరా
జిత వేదనా ప్రకారంబుల జూసి వర్జిత శ్రేణీ ప్రమాదంబు లూహించి గ
మ్యత గానరాక, నేలన్ గూలు రోగులంజూచి ఖిన్నులైరి వైద్య శిఖామణుల్

చలిగాడ్పుల దేహమెల్ల
వలిగొని ధాత్రి వణికిన తీరైన వలిబచ్చని కం
బళి గవిచి కొన్న విధమున
బొలువుగ పేషంట్లు మునిగిరి బ్లాంకెట్లలో నప్పుడున్

**(నన్నెచోడుడు కవిని స్మరిస్తూ...)**

# వైరస జీవకణ సంవాదము

అలయక వ్యాక్సీను వివిధౌషధభంగుల జేసి ఎంతటి వ్యా
ధులనిలా గెలిచెదరు మానవులో వైరసా, కడు బేలతనంబు నేడు
గలిగిన నయ్యది తాత్కాలికమే, శ్రమయుంబొలియు చికిత్సల సిద్ధిన్
కలవరముడిగి రోగనిదానమున నిను కట్టడి చేయుట నిక్కము కరోనా!

కావున నరుల నెప్పుడు
గావింపదగదు కపట వైరస ధర్మంబులు
భావమెరిగి అనువర్తిని
వైవసింపుము కల్లోల సృజనమాని కరోనా!

కడు మృదువులనుచు లోకువ
తడి యారకమున్నె తగు వైరస నాశినులతో
వడి వడిగా నిన్ను సుడిగొని
వడుపున మడియింతురు గాన సడిసేయకు కరోనా!

మనిషి యొనర్చు వైరసవశ్యవిధి మందులు ప్రచండమై
మనిషికి దెచ్చును కొన్ని దుష్ఫలితములు కాని నిను నిర్వీ
ర్యుని గ జేసి స్వస్థత నొందెదరు యాంటీ బాడీలతో, నీ
యునికి కి చేటు దెచ్చి నిను శాశ్వత నిద్ర పుచ్చెదరు కరోనా!

**(కవి ఎర్రాప్రెగ్గడను స్తుతిస్తూ...)**

# వైరూధిని ప్రవరం

నిత్య నైమిత్తికములైన నిఖిల జ్వర
ములకు నారడి యిట్టులపుట్టె వ్యాధి
పాలైతి, నింటికి పోదుమన్న జి పి యస్సు లేదు,
అడుగుదు మన్న నొక్క స్మార్ట్ట ఫోనుధనుండు లేదే!

అని కడువంత గూరుచు వుహాన్ గుహలందున్ సంచరించు షిజెం
ఘ్లి చిరు గబ్బిలాల పరిశోధకురాలికి, వైరూధిని యను నొక్క
ఘన బుడిపెల లతాంగి కాంతి జిత కరోనా వైరసాంగి విభ్రమంపాలో
చన కలిగించి ఆమెతో ల్యాబున కేగె తన వాహన తైలపాయి తోడన్,

ఈ కణజాలము మీద నా కిరణాలొప్పార
అధిక రాగ రసోద్రిక్తమై మాడ్చి మాడ్చి
కణములందు నా క్లోనుల పెంచి పెంచి
నా కాలనీల వృద్ధి జేయుదునీ నాటినుంచి

అని మనమున దలపోయుచు
మనసిజ వైరస శర నికర మానస యగుచున్
జని తన స్పైకుల నిలిపెను
ఘన నాసికా కణజాలముపై కన్న కూతురు వోలెన్

దయలేని కూతురీ దుష్ట కన్య
దయచూడదు తనకింత దారిచ్చిన కణమున్
దయలేకను దండెత్తి నిర్
దయగా తా జేరిన ఇంటిని గూల్చి తా వెడలున్

**(కవి మారన – మార్కండేయ పురాణము)**

# వైరసోత్తర హరి వంశం

నర కుమార ప్రాణ నాళొత్తరణ కేళి
రణకేళి లయకేళి నూపిరార్పి,
కంసాలి కొలిమిలో నిప్పుల సెగ వోలె
కణజాలములన్నిటిని కలయ మాడ్చి
యేస్ టూ రిసెప్టారుల ఏర్పడ జూసి
జీవ కణములోజొచ్చి చిచ్చు రగిల్చి
రైబోజోములనెల్ల ఇంద్రజాలమున నిల్పి
మానవాళిని జ్వర మరణాల పాల్జేసి

వైరస విష రస సార వ్యర్థ కాసారముగ
శ్వాసకోశముల నీ్నట సాంతమున్ ముంచి
వెంటిలేటర్లతో వంటి ఇంటిని వంటిల్లు జేసి
మరణాల పాల్జేసె మనుషుల నిపుడు

నిలువంజాలుదురే జీవ ప్రాంగణములో ఈ కరోనా విక్రమో
జ్జ్వల విషంబు హాలాహలమైన శ్వాస స్థల హృదయ వ్యాపార
ముల విలయమొనర్చ మహారవము నొప్పన్ దర్పమే కూలి దు
ర్బలభద్రుడై దరిద్రుడై కదిపినంత నేడ్చు నీ నరార్భకుండున్

వికలవ్యూహ క్వారంటైను విధాభంగమై, ఐసోలేషను అపహాస్యమై,
శకలీ భూత శతాంగమై సామాజిక దూరము సహస్ర ఘటామానమై
సికతా వైద్య సేతువు విచ్చిన్న వలయమై చిందు చిందైన చందాన
వికటించగ కళదప్పిన నరుల గాంచి వికటాట్టహాసము జేసెనా కరోనా!

**(నాచన సోమన – ఉత్తర హరివంశము)**

# వైరస రాజీయము

గంగా వైరస విషవతీ తరంగిణులతి ఘోరంగా బారుచును(గంగా
బొంగుచు, న్యూయార్కున్ (గ్రొచ్చి (గుచ్చి భారంగా బాధించుచున్
సాంగత్యం నొనరింపు జూచు తీరంగా బార్శ్వ వ్యాపకంబై, బృహద్
భంగ(శేణి పరంపరా(క్రమణ భంగిన్ బారె నక్కోవిదు వైరస విషంబున్

ఆన వైచినట్లు పూని విష మం(త (ప్రయో
గంబు చేసినట్లు, మృత్యువు దడి కట్టి నట్లు,
నిట్టవొడిచి యిరాను, యిటలీ, స్పెయిన్
(బ్రిటను, (బెజిల్, యిత్యాది దేశాలు మట్టి గరచె

అనియె చైనా మా వుహాను కావచ్చును
జన్మస్థానమీ దుష్ట కరోనా వైరసుకు, కాని
మాకే దురుద్దేశము లేదు, మీ వైఫల్యము
మాపై నెట్ట మేము సహించమెన్నటికిన్

**(అనంతామాత్యుడు – భోజరాజీయము నుంచి)**

# వైరస మొల్ల రామాయణము

కరొనా వైరసులు కాంతియందు, విలయ వైరసులు విధి చేష్టలందు,
కరుణే లేని వైరసులు కాలమందు, వాహినీ వైరసులు వ్యాప్తి యందు
మరణా యుత వైరసులు మారుతమందు, రవిరాజ వైరసులు రణమందు,
తరుణమే లేని వైరసులు తాపమందు, ఏ మందూ లేని వైరసుల నేమందురో!

సుడిగొని కరోనాపాదములు సోకిన ధూళి వహించి సార్సు వచ్చె, నది మా
ర్పడ నొక మెర్సు రుగ్మత యయ్యెనట పన్నుగ నీతని విషపద రేణువు లి
య్యెద వడి మానవ నోడ సోక నిది ఎట్లగునో యని పరిశోధకుల్ సంశయాత్ములై
అడుగిడిరి గుహలందు గబ్బిలాల నాశ్రయించి చరించు కోవిదు భయంబునన్

గుహ బాసినయట్టి గుబులు కంటె
వివిధ ల్యాబులలోన వేగి వేగి,
వీర శాస్త్రజ్ఞుల వివిధ టెస్టుల
విసిగిన చిత్తంబు వీగి వీగి
తన దిక్కు లేమికై తల్లడిల్లుచు
లోలోపల మిక్కిలి లోగి లోగి,
జన్యు మార్పులు జేయగ జేయగ
జీవాయుధముగా దోగి దోగి,

వైరస దలచు కొంచు, వైరసుల మించు,
కోవిదునకై కొండలు లోయల నధిగమించు,
మానవ మాత్రుల అల్ప మనసు నెరిగి
కరోనా వైరసు దాల్చెను కోవిదు రూపున్

కంటిరి కరోనా స్పైకు వదనుని గబ్బిలాల పెంక, స్రవమ్ములన్,
కంటిరి పాజిటివు సెన్సు సింగిల్ స్ట్రాండెడు ఆర్ యన్ ఏ లను
కంటిరి క్యాప్సిడు ప్రొటీను కోటు, లిపిడు ఎన్వలపులన్ అచ్చెరువుగ
కంటిరి అత్యుగ్రోష్ణ రూపున్, జగమొండి, కఠినాత్ముడైన కోవిదున్

**(ఆతుకూరి మొల్ల – రామాయణము)**

# వైరసాముక్త మాల్యద

కాంచెన్ వైరసుడు తలక్రిందులనున్న శ్వాసా వృక్ష శాఖోపశా
ఖాంచజ్ఝట జీవ కణజాలమున్ యేస్ రిసెప్టారులున్న చోటులున్
దంచత్కీటకములిష్టపడు రక్త పత్రావళి ఆల్వియోలున్ ధ్వన్య ని
స్థంచారాత్త మహాశబ్దోపమ ఫల స్ఫాయత్వత్ శ్వాసవృక్షాజమున్

వంటి తొంటి నొప్పుల తో ఒడలు నిరుగ జేసి
        కుటిల వృత్తిని కూల్చు కుంతలంబు,
ధమనులు సిరలను ధగ ధగ దగ్దమొనరించి
        వడిలించి సడలించు వదన వైఖరులను,
కనుబొమలను రెప్పలను కలత పరచి
        పాణి పాదములను బహు ఎర్రగా జేయు,
శ్వాసకోశములనిండ స్రావముల నింపి
        వెంటిలేటరు కొరకు వెర్రెత్త జేయు,

న్యుమోనియాతో క్షణక్షణము నుసురు దీసి,
రోగి నానాటికీ పెంజీకటి రేయిని జేరి
చవుకయైనట్టి చావు చచ్చు దాక
అగ్ని గా దహించి అణు బూదియై చల్లారు.

అహితుడుగా దేహము జొచ్చి
మహిని బోలు అతిథిని మరణ శయ్య నెక్కించి
యహి భయము వోలె జుట్టి
బహువిధముల బాధ బెట్టు కోవిదు భూతమిదె

త్రివిధోత్పాతము లొదవిన
నవని విభుడు విడువ వలయు నధిక ద్రవ్యం
బవని జన సుఖము కొరకు
పవన జనిత వైరస బలి హెూమ విధులకెప్పుడున్

**(శ్రీకృష్ణ దేవరాయలు-ఆముక్తమాల్యద)**

# వైరస యాంటీబాడీయము

కొందరు వైరసు వార్త కొనసోకినంతనే
    కొందరు కాస్తంత గురుతు తెలిసి,
కొందరు వైరస నిర్ఘోషంబు లాలించి
    కొందరు కరోనా బృందమరసి,
కొందరు నాసికా కోలాహలంబున
    కొందరు తుమ్ముల కోటి దీక్షన,
కొందరు దగ్గుతో గుణటంకృతులు విన
    కొందరు ఆయాస హుంక్రియాకులత జెంద,

కొందరికి రెండు వేటుల వొళ్ళు చల్లబడి
కోవిదు నిర్దేశ రక్తము కొంత విరిగిపార
ఐ సి సి యూ లోన ఐసోలేషను లోన
మార్పు లేకయె మడిసిరి మనుజ విభులు.

తలపంజొప్పెడి యొప్పెనప్పుడు కోవిదు వైరస జైత్రయాత్రాసము
త్కలికారింఖ దసంఖ్య సంఖ్య జయవత్కంఖాణ రింఖావిశృం
ఖల సంఘట యాంటీబాడీ పరాగ పరాగపటలాక్రాంతంబుమిన్నేరన
ర్గళ ఖేరీరవ నిర్గళత్ గగనరేఖాలేప పంకాకృతిన్ మెరసె కరోనా!

జవవద్ఘోటక జీవ కణములన్ రజస్సంక్రాంతిచే నింకించి బహు సిం
ధువులన్ గ్రమ్మర శ్వాసనాపి నుర్వికిన్, దివికిన్ మధ్య బతుకు నిల్పి
నవ నిర్యాణము వెంటిలేటరు గొట్టాలలో కొట్టుకుపోవునపుడు, ఊర్ధ్వ ప్రాణా
ర్ష విధిన్ జీవ దానము జేయ యే మందులాక్సిజనులీ జనులను రక్షించునో!

(పింగళి సూరన– రాఘవ పాండవీయము)

# వైరస వసు చరిత్ర

అందరికి అందుబాటులోనున్న అజిత్రోమైసిను
అజిత జిత విజిత జడ్ పతాక కాగ కాగ,
మలేరియా చలిజ్వరానికి భలేగా పనిజేయు
క్లోరోక్విను క్వీనుగా కోలాటమాట ఆట,
ఎయిడ్సు వ్యాధికి వాడు యాంటీ వైరసు
మందులు మందులుగ పనిచేయు ఆశ ఆశ,
రక్త నాళముల గడ్డ కట్టిన రక్తమును కరిగించు
హెపారినుపై హెచ్చిన చూపు చూపు

అన్ని జ్వర వేదనల కా పారాసిటమాలు,
ధమాలుమనె గుండెకు, మూత్రపిండాలకు,
యాస్ప్రిను, స్టెరాయిడ్లు, ప్లాస్మా, యాంటీబాడీలు
ఏదీ కుదరకబోతే యెక్కును వెంటిలేటర్లు!

ఆ నగజాత ఈ కరోనా, యా గబ్బిల దేవత లీమె వాహినులా
మానవనాథ శ్వాసకోశమీ కోవిదు నివాసమిప్పుడు యీ జీవ
కణము వైరసమౌళి సంచరించు మణి గృహము ఈ కొలంకు లీ
కోనలు, ఈ రైబోజోములు కరోనా ప్రతిసృష్టికి విహారరంగముల్

గుహరాజ తనయుడు కోవిదు
దూహల కాలమున్ దాటి యూడిపడెన్ నిజరూపాన
గుహలు విడిచి గృహముల
ఊహాతీతముగా గృహస్థుల వ్యాధి గ్రస్తుల గావించెన్

**(రామరాజభూషణుడు – వసుచరిత్ర)**

# వైరస యయాతి చరితము

ఇది కోవిదు చెలరేగగ క్వారంటైనులో
          నిర్మానుష్యమైన నగర వీధి,
వీరలు ఉదయాననే లేచి వీధులన్నియు ఊడ్చి
          నగర మద్దముగ జేయు నారీమణులు,
ఇచట శ్రమించు వీరె పారిశుధ్ధ్య కార్మికులు
          చెత్త నంతయు నెత్తి చెడును తొలగింతురు,
కాయగూరలు దెచ్చి కాళ్ళరుగుతూ తిరిగి
          జీవనము సాగించు వీళ్ళు చిరు బేహారులు,

ఆరుగాలము శ్రమించు రైతులు వీరు,
వృత్తి నైపుణ్యమున్న వివిధ పనులవారు,
వలస కార్మికులు ఎల్లలు దాటిటు వచ్చినారు,
అందరి వదనాల నున్నది నవైరసాందోళన!

తనదగు తెల్ల వర్ణమున్, ఫినాయిలు పరిమళాలున్న గంభీర భ
వనమందు తెల్ల కోటు ధారులు, మెడలొ స్టెతస్కోపున్న పన్నగధరులు
జెనకగ వచ్చి వైద్యపు కోటలోన వైవిధ్య చికిత్సలన్ నివారణలన్
గనుగొని రోగి జరా మరణ భయంబు నుడిగించెదరు ధన్వంతరులై....

పలుకుల పాలక దొరలన
నలు మొగములు పూని కరోనా నాట కట్టించుటకై
దొలుచు మినుకులు తెలిపిరి
వెలయగు ప్రాణముల గాచి ప్రజల వేదన తీర్చుచున్

**(పొన్నెగంటి తెలగన్న - యయాతి చరిత్రము)**

# వైరస ఉత్తరాయణం

ఐనను జనులాడెడి కరో
నానోక్తులు వినదలంచి నన్నడిగిన మీ
యానకు వెరచి గణించెద
వినుము పౌరుల పలుకుల్ వైరస భయమునన్

వినివిని నే వేసరితి వీధుల వీధుల నిట్టి దృశ్యమానములే
యనుకొనువారలు ఐసోలేషను వద్దను వారు, ఆర్థిక శాస్త్రజ్ఞులు
మనము మనూళ్ళకుంబోయి పస్తులుండెదమను వలస కార్మికులు
విని విని విసిగెత్తి నీ వివిధ స్వార్థ ప్రేలాపనలెల్ల వీనుల బడంగన్

ఈ దుర్ని మిత్తముల ఫల
మీ దుఃఖము సేయకున్నె యీ దుఃఖములా
పాదింప కోవిదు తలంచి
కాదే యా కరోనా వ్యాధి గలిగించుటయున్

**(కంకంటి పాపరాజు - ఉత్తర రామాయణము)**

# వైరస వేమన శతకము

రానిది కోరిన రాదది
రానున్నది కోరకున్న రానేవచ్చున్
తానెంత చింత జేసిన
కానున్నది కాకపోదు కదరా కరోనా!

కరోనా వైరసులన్ని నొక్క పోలిక నుండు
చూడ చూడ రోగాల జాడ వేరు
వైరసులందు విష వైరసులు వేరయా
విశ్వకోవిదు నామ వినుము కరోనా!

కరోనా యనెడు మంత్రము
మారకమని యెరిగి యాంటీ వైరస మందుల
సారము గ్రోలని నరునకు
చేరువగును పరమపదము వేగమె కరోనా!

**(వేమన - వేమన శతకము)**

# వైరసుమతీ శతకము

వైరసు తా వచ్చిన వచ్చు
వైర వైతాళికునివోలె, నొక మారు మారుతమువలెన్
వైరసు తాపోయిన పోవు
వైరి వైతరణిలో నిను ముంచు వైఖరిని కరోనా!

తన వైరసే తన శత్రువు,
తన యాంటీబాడీలు తనకు రక్ష, డోలో చుట్టంబౌ
తన గృహమె తన స్వర్గము
తన నిర్లక్ష్య మశుభ్రతలు నరకమండ్రు కరోనా!

ఎప్పటికెయ్యది ప్రస్తుత
మప్పటికా మందులేసి వ్యాక్సీనుల బుచ్చుకొని,
నొప్పించక తా నొవ్వక
తప్పించుకు తిరుగు వాడిని తన్నుము కరోనా!

**(బుద్దెన భూపాలుడు – సుమతీ శతకము)**

# వైరస కవిత

వైరసు ఎక్కువా లేక బాక్టీరియా
ఎక్కువా అనే సమస్య అభేద్యం
అయినా మందూ వ్యాక్సీను పరంగా
నేనంటా రెండూ నీకే సరైన వైద్యం

**(శ్రీశ్రీ)**

# వైరసు పిశాచము

ఓ కోవిదు పిశాచమా! కానరాదు
నిన్ను బోలిన వైరసు మాకెన్నడేని
జన్యువుల దెంపి జ్వరమును నింపినావు
నా దేహప్రాంగణమే కోటి వైరస కరోనా

**(దాశరథి – అగ్నిధార)**

# వైరసాస్తమయం

వైరసాస్తమయం కానే కాదనుకోడం నిరాశ
ఉదయించి అలానే వుంటే మృత్యు గోస,
ఈ చీకటి వుండదు, ఆ వెలుతురూ నిలవదు
చీకటిలో కను విప్పని వారికి వెలుతురంటే బూచి
వెలుగులో కను తెరిచిన వారికి చీకటంటె పిశాచి
ఇదే జరుగుతూ వచ్చింది, ఇంతకు ముందూ వచ్చింది
వైరసు ఇకముందూ వస్తుంది, వచ్చి అలానే పోతుంది

**(కాళోజీ నారాయణరావు)**

అనుబంధం

# చీకటి చెట్టు మీద వెలుతురు పిట్టలు



డాక్టర్ లంకా శివరామప్రసాద్

**Dr. Lanka Siva Rama Prasad**

# 1. మద్యందిన మార్తాండులు

బారులుతీరితిమి బారులముందు బహు సౌమ్యముగ సామాజిక
దూరము పాటించుచున్, బీరులకు మేము భక్త కబీరులము
సారము నిండిన సారాయే త్రావెదమీ నిస్సార లాక్ డౌనులో
భారము మాది మీ ఋణముల్ తీర్చగ ఎక్సైజు ఖజానా నింపుచున్

కరోనాకు విరుగుడు తెలియదు
భరోసాలేమి యివ్వలేదు మీరు భయముతో చంపిరి గాని,
తరుణోపాయము తెల్వనపుడు
తెలిసిన మా మందునేల తగదంద్రు తెలియజెప్పుడీ వేళన్

మద్యం ధరెంతైతే నేమయ్యా?
మద్యందిన మార్తాండులము మద్యప్రదేశు మాది
మధ్యంతర యెన్నికలొస్తె
మద్యమోద్యమ సారథి మద్యాధీశున కే మా వోటు సుమీ!

బారులు తెరిచినవాడే బీరులు పోయును సారా సారములెరిగినవాడికి
దారులు తెలియును సామ్రాజ్యపు పోరులో గెలియు తీరులు తెన్నులున్,
సారులు, బాటసారులు, అర్థ శాస్త్రజ్ఞులు, రాజకీయులు కాల తత్త్వ వి
చారులు యిచ్చిన డబ్బు తిరిగి పుచ్చుకొను మార్గము కనుగొంటిరి గాదె!

✧✧✧✧✧

# 2. అర్థమవుతుందా నీకు!

అల వెంకటాపురంలో వైజాగ్ నగరిలో నామూల యల్ జీ ఫ్యాక్టరీలో
పల బాయిలరాంతర్వాయు సరః ప్రాంతేందు పీడనాధిక చక్ర విషఫలో
త్పల పర్యంతబాధిత విషాదమున గ్రుందు ఆపన్నులన్ గాంచి వి
హ్వాలులైరి మానవేంద్రులు రానున్న బహు దుర్ఘటనలనూహించుచున్

గోరుచుట్టపై రోకటిపోటు
తీరున వినవచ్చెనో దుఃఖ వార్త రైలు పట్టాలపై మృత్యు
కరవాలముత్తరించిన జీవ
దారముల కండెలు కానవచ్చె దారుణ రణస్థలిం బోల్చుచున్

పిరికిం జెప్పరు లాక్‌డౌనులో బంధింపబడుదుమన్న భయ భ్రాంతులై
పరివారంబున జేర కటిక చీకటింబడి పారిపోదురీ వలస ప్రాణులు మార్గాం
తరమేమియు తోచక సొంతూరికి పోవు వివాదప్రోత్థితాభిలాష విస్తరించగాన్ జా
తర ముగిసిన క్షణమే జాగుసేయక పోవు జానపదులవోలె అత్యుత్సాహులై!

మనల్ని మనం బాగుచెయ్యక
మనకేవో యితర దేశ పెట్టుబడులొస్తే మన గమనం సాగేనా?
మనల్ని బాగు చేసేందుకు
మనవూరొస్తాడా ఎవడన్నా మందబుద్ధి మనుగడ కోసం?

పనిచెయ్యక తిని కూర్చును
పనిదొంగల కాలమిది పరికించంగన్, పైరాబడి లేకుండా
పనిచెయ్యని పాపాత్ములకు
పనిష్మెంటిచ్చెడి కాలమెప్పుడు వచ్చునొ కదా కరోనా!

లాభాపేక్షతోనె నడుచును
ప్రభాతమునుండి ప్రజల పలుద్యోగ విజయముల్, చట్ట
సభాంగణమునె వెలుగును
శోభాయమానముగా బడ్జెట్టును సౌఖ్యముగ పంచుకొను రీతుల్

అవినీతున్నంతకాలము త
ప్పవీ యాకస్మిక ప్రమాదముల్, పైన నిర్లక్ష్యము తోడైనపు
డవి చవిచూపుమనకత్యం
త వినాశకర విపత్తుల ప్రమత్తులమైన మరు క్షణములోనన్

✧✧✧✧✧

# 3. కోటి పాతాలు

ఆకాశంలో అష్టగ్రహ కూటమి
ట్రంపియాంగుపుతినుకిముదుతెర్తేమోడీమారిస్సనుబోరిస్సిత్యాది
నర పాలక గ్రహాలు కోవిదు మంటలో చింతకాయలు జల్లుతున్నాయి
వీపులమీద అణు కొరువుల్ని కనబడనీయకుండా మోస్తూ...
గులాబీ తోటలో ముళ్ళేరడానికి
కాషాయమ్మోడు రంగులూ వృధా కసరత్తులు జేస్తున్నారక్కడ-

చంద్రుడు గ్రహణం కొరికిన పచ్చ పువ్వులా
చెల్లాచెదురైన మబ్బులగడ్డం మధ్య చిన్నబోయి ఉన్నాడు...
పనిజేయకుండా పైసలొచ్చే పథకాల్తో
జాతిలో సగమ్మందిని హైటెక్కు బిచ్చగాళ్ళని చేసిన
పాలసీ మేకర్లు నైతిక విలువల్ని ఉగ్గుపాలతోనే చంపేసి
ధనమూలం ఇదం జగత్ మంత్రాన్ని చెవుల్లో నింపుతున్నారు

బుద్ధ పూర్ణిమ రోజునో, సునామీ సందర్భాలలోనో
నిర్లక్ష్య ప్రబుద్ధుల నిర్వాకాలు కక్కుర్తి యాజమాన్యాల కలవరాలు
కుమ్మక్కైన గాలి పుణ్యానికి పాపమమాయకులు నిద్రలో కన్నుమూస్తే
కోట్ల రూపాయలు మోహనంగానే కానవస్తాయి
గుమ్మడి కాయల దొంగలందరూ భుజాలు తడుముకునేప్పుడు
తిలా పాలం తలా పిడికెడు అన్న చిదంబర రహస్యము పకపకా నవ్వుతుంది

యీలోగా మరిన్ని కొత్తవైరసులు, డర్టీ బాంబులు, అగ్ని పర్వతాలు విస్ఫోటిస్తాయి.
మొసళ్ళు కన్నీరు కారుస్తుంటే నేపథ్యంలో మృత్యు గంట మొత్తుతూ మోగుతుంది...

✧✧✧✧✧

# 4. ఆటస్థలాల్లో అగ్ని పర్వతాలు

సముద్ర తీరాన నత్తగుల్లలు, శంఖాలు, ఆల్చిప్పలు
ఇసుకరేణువులపై తల వాల్చి తరంగాలు మోసుకువచ్చిన కథల్ని,
వాయు మార్గాన మైదానాల్లోకి పంపుతుంటాయి
తిరుగుప్రయాణంలో గాలి తెచ్చే సమాచారాన్ని వింటాయి

చెట్లూ, పశువులూ, పక్షులూ, గాలి కబుర్ల తీవ్రతను బట్టి
సంతోషాన్ని, దుఃఖాన్ని తెలుసుకుని చలిస్తాయి...
చెర్నోబిల్, ఫుకుసిమా దైచి, భోపాల్ పాఠాల తరువాత కూడా
మానవుడేమన్నా నేర్చుకున్నాడా అని గుసగుసలాడుకుంటున్నపుడు
తెలతెల్లవారకముందే వైజాగు-వెంకటాపురంలో అగ్నిపర్వతమొక్కటి...

చెట్లూ, పశువులూ, పక్షులూ, మనుషులూ ఊపిరందక....
కోవిదు లాక్‌డౌనును మించిన కల్లోలం...
స్టైయిరీను గ్యాసు కలిగించిన విషాదం...
కాగితాలమీద సేఫ్టీ మెజర్సు కవాతు చేస్తుంటాయి,
ఏం కాదులే అన్న నిర్లక్ష్యం ఎక్కడో నొక్కకూడని స్విచ్చి నొక్కుతుంది

ఆటస్థలాల్లో జనావాసాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా అగ్నిపర్వతాలే
ఒక్కసారి మాస్కు తీసేసి చూడు-వైరసో, విషవాయువో ఏది చంపుతుందో నేడు!

✧✧✧✧✧

# 5. విరామ చిహ్నాలు

ప్రజలపై ప్రేమతోనో, ప్రపంచ పటంలో పరువు కోసమో,
అరిచీ అరిచీ అలిసిపోయింది ప్రభుత్వం
ప్రతిఘటించి, అంజలి ఘటించి, జ్యోతులు వెలిగించి,
అవన్నీ గతించాక ఇప్పుడు చేతులు గేటులు ఎత్తేసింది
ఎంచక్కా వ్యాపారం చేసుకోవాల్సిన వ్యాధిని
చప్పట్ల తాళాల లాక్‌డౌనుతో చల్లబరుద్దామనుకున్నా
కౌపీన సం రక్షణార్థం పడ్డ కష్టాలకు
చేతిలో ఖాళీ బొచ్చె మిగిలింది
ఇవ్వాళో, రేపో మళ్ళీ వ్యాపారాలు మొదలవుతాయి
వలస కూలీలు, కాందిశీకులూ మళ్ళా కాళ్ళకు బలపాలు కట్టుకుంటారు

అవినీతి జీరో స్థాయి నుంచి సెన్సెక్సు రేఖలా ఆకాశాన్నంటుకుంటుంది
నష్టపోయిందంతా భర్తీ చేసుకునే ప్రణాళికలు నవ్వుతూ పలకరిస్తాయి
ఉద్యోగ సంఘాలు యధావిధిగా సమ్మె నోటీసులిస్తాయి
మీడియా ఆగిపోయిన నేరాలు-ఘోరాలను మరింత దృశ్యమానం చేస్తుంది
బల్లల కింద చేతులు ఆక్టోపసులై కార్యార్థుల జేబుల్ని ఖాళీ జేస్తాయి
రాజకీయులు రేపటి ఎలక్షనుల కోసం ఇవ్వాల్టినుంచి కలెక్షనులు మొదలెడ్తారు
మళ్ళా లాక్‌డౌన్ వైరసు ఇంకోటి రాదన్న గ్యారంటీ ఎవ్వరూ ఇవ్వరు,
ప్రజలంతా జనధనులౌతారన్న నమ్మకం కంటికి కానరాదు
రహదారులమీద భయ నిర్భయాలు చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుంటాయి,

ఏమొచ్చినా ఆగని సతత మందు ప్రవాహంలో జనత కొట్టుకుపోతుంది
రేపటి రహదారిలో- ట్రాఫిక్ సిగ్నల్సుండవు, టోల్ గేట్లుండవు
ఉన్నవాళ్ళు-లేనివాళ్ళ మధ్య మళ్ళీ యుద్ధం మొదలయ్యేది
ఇటువంటి ఉత్పాతాలొచ్చినాకే, అంతం ఆరంభమయ్యింది
జోంబీలు నడిచే దారిలో విరామ చిహ్నాలుండవు...

✧✧✧✧✧

# 6. తాగుడు మూతలు

నువ్వు పనిజేసే నేల నీది కాదు,
నువ్వుండే కొంప గబ్బిలాల గుహ కంటే పెద్దదేం కాదు
అరేబియా ఎడారైనా, ముంబాయి ధారవైనా, బొగ్గుబాయి లోనైనా
ఒంటెల వొంటేలో, గబ్బిలాల పెంటికలో
చీకట్లో తినేప్పుడు ఆకలికేదీ అడ్డం రాదు...
సార్సో, మెర్సో నీకు తెలీని పేరేదో నీ గుండెల మీద
కూర్చున్నపుడు యిల్లు గుర్తుకొస్తుంది కాని
దార్లు బందైనాక కడసారి చూపులు కూడా వాట్సాప్పు వీడియోనే కదా,
కళ్ళల్లో సముద్రాలు కల్లోలమవుతాయి కాసేపు...

బంధాలూ, అనుబంధాలూ, అణు బంధాలయ్యాక
ఎవరికీ తెలియని వైరసేదో ఎవరికో పెంపుడు జంతువై
నిశ్శబ్ద యుద్ధంలో ఎవరి పొట్టనో కొట్టబోయి నీ పొట్టనూ కొడ్తుంది...
నీ ఊహకే అందని వూహాను వైరసేదో తాయెత్తుకు పైయెత్తులు వేస్తుంటే
దిగులుపడ్డ ఆలోచనాపరులు చప్పట్లుకొట్టి, దీపాలు వెలిగించినా
వేసిన తాళాలన్నీ వేసినట్లేవున్నాయి గాని దేహగృహంలోకి దెయ్యం
రానే వచ్చింది పూల దారుల్లో పూనకమొచ్చినట్లు నడుస్తూ...

మండలం పాటు చదివిన మంత్రాలకు చింతకాయలు రాలకపోగా
ఇదిగో క్లోరోక్విను, అదుగో వ్యాక్సీనంటూ
మధ్య మధ్యలో కోవిదు నామస్మరణ
అంతులేని కథకు వింత ముగింపుగా
ఆరిపోబోతున్న ఆర్థిక దీపానికి ఆయిలు కోసం
ఆడక తప్పని తాగుడు మూతల జూదము...
రండోయ్ రారండోయ్! భలే మంచి చావు బేరము!
మనసారా మన సారా!

ఒక వైరసుని ప్రపంచీకరణ చేసి
వ్యాధిని వర్గీకరించినపుడు
ఆలోచనలెలా లాక్ డౌన్ చేయబడతాయో
గబ్బిలాలక్కూడా అర్థమయ్యిందిప్పుడు...
జీవాయుధపు ధూళి మేఘాలు భవిష్యత్ బతుకు సూర్యుడిని
కమ్ముకుంటూ పోతున్నపుడు
పెంజీకటి కావల కనిపించిన ఆశారేఖ
కరోనా మబ్బుల అంచునుంచి కనబడకుండా పోయింది...
కొత్త వ్యాధిని కనిపెట్టి ప్రజలపై నెట్టి
విరుగుడు మందుల్తో విపరీతంగా సంపాదిద్దామనే శాస్త్రపుంగవులొచ్చాక
విష వ్యాధులు, జబ్బులు నాలుగైదేళ్ళకోసారి నామరూపాలు మార్చుకుని వచ్చి
ప్లేట్‌లెట్ల నిండా డబ్బులు కురిసాక ఫేడయిపోతాయి...

రాజకీయ నాయకుల మేకపోతు గాంభీర్యం
ఖజానా ఖాళీ అయ్యేసరికి కుదేలయ్యి
కుబేరుడి వాహనమైన మానవుడి బలహీనతలమీద కొట్టే యజ్ఞంలో
డివైను షాపులూ, వైను షాపులూ బార్లా తెరుచుకుంటుంటే
ఆరడుగుల భౌతిక దూరం పాటిస్తూ
ఆల్కహాలికులు ఆనంద వదనాలతో సాకీ లేని పానశాలల ముందు
ఏ చీకూ చింతా లేకుండా జేజేలు కొడ్తూ నిలబడినప్పుడు
అనిపిస్తుంది ఇంతకాలం వీళ్ళు చూపించిన నిగ్రహానికి
ఇంటింటికి ఉచిత సారా సరఫరా చేసుంటే
ఈ ప్రభుత్వాలకింకా గుర్తింపు వచ్చేది కదా...

✧✧✧✧✧

# 7. కరోనా మందు కాలము

ఎప్పటికెయ్యది దొరికిన
అప్పటికా మందు గొట్టి లాక్‌డౌను ఎత్తిన వెంటనే
నొప్పింపక లైన్లొ నిలవక
తెప్పించుకు తాగువాడు ధన్యుడు సుమతీ!

చెల్లియొ చెల్లకొ తమరు తాగిన సీసాలు జూచిరందరున్
లొల్లి గతించు నేడు, నను డ్యూటీకి పంపిరి నిను స్ట్రెయిటు సేయ, నీ
వొళ్ళును కళ్ళునుం కుళ్ళ పొడిపించు కుందువొ బిల్లిచ్చు కొందువొ
వెళ్లి లైనులొ నిలబడుదువొ ఏర్పడ జెప్పుము మంద్భాగ్యేశ్వరా

కమ్మని బీరందించు కరములు కరములు
            జిన్నును వర్ణించు జిహ్వా జిహ్వా,
సురషాపును జూచు చూడ్కులు చూడ్కులు
            సీసాకాయికి మొక్కు శిరము శిరము,
విస్కీ నాకర్ణించు వీనులు వీనులు
            మధుపాత్ర దవిలిన మనము మనము,
బారునకు నడిపించు పదములు పదములు
            ఇప్ప సారాయి మీది బుద్ధి బుద్ధి,

రమ్ము రమ్మని చింతించు రోజు రోజు,
సారా రహస్యము చెప్పు చదువు చదువు,
చీర్సు చీర్సు చెప్పెడి గురుడు గురుడు,
తనకు కంపెనీ యిమ్మనెడి తండ్రి తండ్రి.

ఎంత తాటికల్లు వృథా అయ్యెనో కదా
        చిమ్మచీకటి లాకుడౌను చిక్కులందు,
ఎన్ని కాక్‌టెయిల్ పార్టీలింకిపోయెనోగదా
        క్వారంటెయిను ఐసోలేషను కాలమందు,
ఎన్ని బీరు బాటిల్సు ఈడేరెనోగదా
        దొంగచాటు వ్యాపార ద్రోణులందు,
ఎన్ని సారా పాకెట్లు ఎండిపోయెనొగదా
        కరోనా కష్ట కలి కాలమందు,

ఎంత బ్రాంది, వోడ్కా, ఎంత ఫారిను సరుకు
ఎంత గోవా ఫెని, ఎంత రమ్మెంత తాటికల్లు
ఒక్క వైరసు దెబ్బకు వొదిలెననుకుంటె
షాపులోపెను జేయ ప్రభుతకు షాకు గొట్టె;

పంచ మకారములతో ప్రపంచము పరిగెత్తుచునున్నది నిజము కావున
పంచుడు జనులకు వీలైతే మాంస, మత్స్య, ముద్రా, మైథునముల్ కాకున్న
పంచేంద్రియాది వశీకరణ మద్యమును పారించుడు తక్కినవన్ని తామే వచ్చును
పంచత్వము ప్రసాదించు ప్రజలకు; నింపును ప్రభుత్వ ఖజానాల నిశ్చయముగాన్

మందున్నవాడు మందు భాగ్యుడు
మందు దొరకనివాడు మందభాగ్యుడు గావున
మందోరాజా భవిష్యత్తనిరి
మందహాసము కన్న మందుహాసమె మిన్న గాగన్

ఎవ్వనిచే జనించు ఈ మందెవ్వని లోపలనుండు సంలీనమై,
ఎవ్వడు రెడ్‌జోనులో వోపెను జేసిన వీరుడు, మందేశ్వరుడెవ్వడు,
ఎవ్వడుద్దర మద్యము పోయునెవ్వడు, ధర పెంచునెవ్వడు, వా
డెవ్వడు సర్వము కరోనా కాలమందు, వాడినే శరణంబు వేడెదన్

మందున్నది కులమందు, మతమందు, వర్గమందు, నిజమందు, అబద్ధ
మందన్నిటియందున్, మందులోనున్న వాడికి క్వారంటెయినైసోలేషను లోక
మందున్న భ్రమలో వశించునుగాన సంసారమందీదును సౌలభ్యముతోన్, ఆ
మందునిచ్చి ఆదుకున్న ప్రభుత్వ తత్త్వ విచారము బహు దొడ్డది చింతింపగన్

సిగరొత్తుల ధర పెంచిరి
అగరొత్తులవలె నూదు ఆకతాయిలు తగ్గిరే జగాన?
నగరములూళ్ళు నేడు సారా
సాగరములాయె సకల బ్రాండ్ల మకర తరంగములై-

భయ కరోనా నేడుభయ ఫల ప్రసాదమైనది మందులకు కామందులకు,
దయతొ దక్షిణ హస్తాన ధనమునిచ్చి, చక్ర వడ్డీతో సహా వసూలు చేయ
నయమున వామ హస్తాన; ఒక చక్కని యూహ ఇది, మీరివ్వని కరుణా
మయ మనశ్శాంతిని తానిచ్చినది మాకు, మీకు ధనమున్ ఉభయతారకమై-

✧✧✧✧✧

# 8. మద్య మార్గము

అది కాకులు దూరని కారడివి,
ఆ చీమలు దూరని చిట్టడివిలోకి
ఏడుగురో ఇంకా ఎక్కువో అరాజక కుమారులు వేటకెళ్ళారు యెలా?
కాకులు చీమలు పోవుగానీ కార్లూ డ్రోన్లూ పోతాయిలే
వేటకెళ్ళిన వాళ్ళు ఏడో ఇంకెన్నో గబ్బిలాలను తెచ్చి ల్యాబుల్లో ఎండ బెట్టారు
ఓ ఆరు ఎండిపోయాక మాంసాలమ్మే మార్కెట్లో మారు బేరానికమ్మేసారు,
ఏడో చేప ఎండలేదు ఎందుకంటే
అక్కడ గద్ద, ఎలుగుబంటి ఒక లోపాయికారీ ఒప్పందానికొచ్చి
అణు గొడుగుల్ని అడ్డం పెట్టడం మొదలెట్టాయి

అందుకని తెల్ల గద్దకు, ఎర్ర డ్రాగనుకూ మధ్య చలికాలం మొదలయ్యింది
చలికాచుకోడానికని సిరియా, కొరియాలలో గడ్డిమోపు అడ్డంబెట్టి
కొరివితో తల గోక్కున్నాయి గద్ద, ఎలుగుబంటి, డ్రాగనూ...
దగ్గర్లో ఆవు ఉంది కానీ గడ్డి తినదు అది
అందుకని గబ్బిలం ఎండలేదు...

ఈలోగా ఆకుపచ్చటి పిలగాళ్ళు అందరినీ బెదిరిస్తుంటే
ఏంచైనా అనుకుని డ్రాగనుచైనా
కరోనా పుట్టలో వేలు పెడితే కోవిద్ చీమ కుట్టింది...
నిన్ను కుడితే మాకెందుకు చెప్పలేదని అడిగేలోగానే
చీమలు పెనుబాములై జగన్నాటకానికి తాళం పడినాక
పుట్టలో ధనమంతా పొట్టల్లోకి పోయాక
అక్రమార్కుడూ, భేతాళుడూ ఏకమై
నీళ్లు దొరక్క ఎండుతున్న గబ్బిలాలకు చూపించారు
మద్యమార్గం...
అందుకని గబ్బిలం ఎండలేదు,
ఈ కథకు ఎండ్ లేదు...

✧✧✧✧✧

# 9. వలస చేపలు

ఇరవై మిలియను సంవత్సరాల క్రితం నుంచే ఆ సాల్మను చేపలు
మంచినీళ్ళలో పుట్టి ఉప్పునీళ్ళలో పెరిగి
మంచినీళ్ళలో పొదిగి మంచినీళ్ళలో చచ్చిపోవడానికి అలవాటుపడ్డాయి
బతుక్కీ చావుకీ మధ్య వందలాది మైళ్ళు యేటికి ఎదురీదుతాయి
ఆ తీరానికి ఈ తీరానికీ మధ్య.....
దారిలొ షార్కు చేపలూ, తిమింగిలాలూ, పక్షులూ, ఎలుగుబంట్లూ
తినగా మిగిలినవి పుట్టిన చోటుకు చేరుకుని ఆడ చేప గుడ్లు పెట్టినాక
ఆ గుడ్లపై మగచేప తన శుక్రస్రవాన్ని స్పానింగు చేస్తుంది
ఆ తరువాత ఆ రెండూ చచ్చిపోతాయి
తాము వచ్చిన పని అయిపోయిందన్నట్టుగా...

రెండు లక్షల సంవత్సరాల క్రితం ఒక తెలివైన ద్విపాద జాతి
ఆఫ్రికా నుంచి వలస మొదలెట్టింది- ఆసియా, ఐరోపా, అమెరికా,
ఆస్ట్రేలియా - అలా అలలుగా కొందరి స్థిర జీవనం, కొందరి వలస-
ఖండాల్ని దాటి పదివేలేళ్ళ క్రితం ఆఖరి మంచు యుగం
తరువాత స్థిరపడడం ప్రారంభమై, చదవడం, వ్రాయడంతో పాటు
ధనం అనే మోహినిని సృష్టించి దాని ప్రేమలొ చీలికలై
ఆయుధాల్నీ, యుద్ధాల్నీ ఆవిష్కరించిందా మానవ గణం;
నేల మీద అశాశ్వత సరిహద్దు రేఖల్ని రాస్తూ చెరుపుతూ
మరణ మృదంగ ధ్వనుల మధ్య... పరాజితుల్ని బానిసలుగా
బలవంతపు వలసలు...

రెండువేలేళ్ళ నుంచి కొత్త కన్నీళ్ళ దారులు, కొత్త బతుకు నావలు, నల్ల బానిసలు
నాగరికతా రేఖల మీద ప్రపంచయుద్ధాల రక్త చారికలు...
కొత్త విజ్ఞాన ఆవిష్కరణలతో పేద దేశాల్నుంచి
ధనికదేశాలకు గ్రీన్‌కార్డు వలసలు
అటునుంచి ఇటు, ఇటునుంచి అటు

మంచినీళ్ళలోంచి ఉప్పునీళ్ళలోకి, మళ్ళీ మంచినీళ్ళలోకి...
డెబ్భై మూడేళ్ళ దేశంలో రాష్ట్రాల మధ్య, ప్రాంతాల మధ్య వలసలు...
పల్లెటూర్ల నుంచి పట్టణాల్లోకి ఆగని కన్నీటి వలసలు
మంచినీళ్ళలోంచి ఉప్పునీళ్ళలోకి...

ఇరవై యేళ్ళ నుంచీ కొత్త విష వాయువులు అగ్ర కొలుముల్నుంచీ-
గరుడ పక్షీ, డ్రాగనూ, ఎలుగుబంటీ, సింహమూ ఇత్యాది మాయావులూ
రకరకాల రంగుల పతాకలూ, మూడుతున్న ఆయువులూ...
ఎవెర్నెవరూ నమ్మని రోజుల్లో ఎవరు సృష్టించారో ఇంకా తెలియని
మహమ్మారి రాగా, నెలా రెండు నెలలు తాళాలేసి తీయగానే
ఉప్పునీళ్ళ లోంచి, మళ్ళీ మంచినీళ్ళలోకి...

ఇరవై గంటల్నుంచీ చేపల వలస-
సాల్మొన్ కావచ్చు, హిల్సా-పులస చేప కావచ్చు
పుస్తెలమ్మి తిమింగలాలు, ఎలుగుబంట్లు, డేగలూ రెడీగా ఉన్నాయి
రహదారి యేర్లపై సంసారమీదేప్పుడు జాగ్రత్త, బిడ్డల్లారా!
రాజులు సింహాసనాల మీద నుంచీ
ఇరవై లక్షల కోట్లు విసుర్తున్నారు-
డబ్బులు తగిలితే కాళ్ళ బొబ్బల్కి పట్టీలు కట్టుకొండి...
కళ్ళలో నీళ్ళని కాస్త పొదుపుగా వాడుకొండి...
రేపు నాయకుల కాళ్ళు కడగడానికి చాల్తాయో లేవో...!

✧✧✧✧✧

# 10. పెట్టు బడు-ద్ధాయి-లు

ప్రతి ముఖ్యమంత్రీ, ప్రధానమంత్రి పీఠం దగ్గర
అడుక్కోడానికో బొచ్చె ఉంటుంది...
దానిపైన కామధేనువు, కల్పవృక్షపు చిత్రాలుంటాయి,
దాన్నొక అక్షయపాత్రగానో, కార్నుకోపియా గానో
పట్టుకుని పదవిలోకి రాగానే
కొత్త బిచ్చగాడు పదూళ్ళు తిరిగినట్లు
ప్రజల ఖర్చుతో పదో వందో దేశాలు తిరిగి
వీలైతే స్వయంపాకాలు స్విస్సు బ్యాంకు నంబర్లిచ్చి
(లోకులు పలుగాకులు కదా పట్టించుకోకు ఈ మాటలు)
ఇంటికి రాగానే వందిమాగధ బాకామీడియాలు స్తోత్రాలు పఠిస్తుంటే
మైమరచి అప్పు తెచ్చిన ఆనందంతో తప్పు చేసిన సంగతి మర్చిపోతారు;

అవునూ లాభం లేకుండా ఊరు గాని ఊళ్ళో పెట్టుబడులు పెట్టడానికి
వాళ్ళేమన్నా బడులు పాఠశాలలూ నెలకొల్పే తెలివితక్కువ వాజమ్మలా?
స్వయంసమృద్ధి ఆలోచనలు మానేసి అనుకరణలు అలంకారమయ్యాక
అవినీతి లేని చోటు దాదాపు అదృశ్యమయ్యాక
పనిజేసి 'సారా జహాన్ సె అచ్చా హిందూస్థాన్ హమారా' అన్న మాటను
సార్థకం చెయ్యడం మరిచి
సారా తాగి పనిజేసే స్థాయి కెదిగినాము కాదా మనం!

ఇరవై లక్షల కోట్లైనా నాలుగు ట్రిలియన్ల స్వప్నమైనా
పంపకాల దగ్గర కొట్టుకుంటున్న తీరు చూస్తుంటే
మనోస్మృతీ మారలేదు, మను స్మృతీ మారేట్లు లేదు,
ఆయన తాంబూలాలిచ్చేసాడు తన్నుకు చావండి!
నిర్భరమైనా, దుర్భరమైనా మొక్కు బడుల్లోనో, పెట్టు బడుల్లోనో...

✧✧✧✧✧

# 11. కరోనా, యల్. జి గయా, క్యా కియా!

ఆగష్టు పదిహేను మీకూ మాకూ స్వాతంత్ర్యం వచ్చిన రోజు
మీ చౌపార్ ఆట మా యుట్ గా మాకెంతో మోజు...
మీ శ్రీరత్న రెండువేలేళ్ళ క్రితం అయోధ్య నుంచి వచ్చి
మా రాణిగా మమ్ము లనేలింది...

మీ బుద్ధ గయ లా మాకూ ఉన్నదో గయ
మీ వంటకాలకూ మా రుచులకూ లేదు పెద్ద తేడా
మా సాంసంగ్ మీ సాంగత్యంలో మురుస్తోంది కాదా
మా హ్యుండాయి మీ రోడ్లపై నడిచే రథం అవునా
మా కియా కార్లు మీకై ఎదురు చూస్తున్నవి మిత్రమా మీ ముంగిట్లో...

మా పెట్టుబడుల కోసం అప్పుడు కలవరించారు,
ఇప్పుడు మెడబెట్టుకు గెంటేస్తున్నారా
కరోనా పొగల్లో యల్.జి లో పనిచేస్తున్న దెవరు?
ఇరవై బిలియన్ రూపాయల వ్యాపారంలో ముందున్నది ముసళ్ళ పండగ...
జగనుకూ జగానికీ తెలుసు కొరియాతో తల గోక్కోకూడదనీ...
ఇతర దేశాల కాళ్ళూ చేతులూ పట్టుకుని పెట్టుబడులుకి
రాయితీలిచ్చేప్పుడు లీకులగురించీ మాట్లాడుకోవాలి...

✧✧✧✧✧

# 12. లాక్‌డౌన్ నుంచి లాకప్పులోకి - అప్పగింతలు

మాకు కట్నమక్కరలేదండీ! మీ అమ్మాయి మాస్కులకీ,
హాండ్‌వాష్ శానిటైజర్లకీ, ఓ యిరవై, ముప్పై యేళ్ళకు సరిపడా...
అలాగే భౌతిక దూరం పాటించేందుకు ఓ విశాలమైన ఫ్లాటూ
సామాజికదూరం కోసం ఓ ఇన్నోవా లాంటి చిన్న కారూ చాలండీ!

అమ్మాయీ! అత్తగారింట్లో కాస్త అణకువగా ఉండాలి తల్లీ-
ఎంత కోపమొచ్చినా ఆమె మొహంలో మొహం బెట్టి మాట్లాడకు-
ఏ నోట్లో ఏ కరోనా వుంటదో ఎవరికెరుక, జాగ్రత్త కూతురా?
భర్త బయటకెళ్ళి రాగానే కాస్త భౌతికదూరం పాటించమ్మా!

వలస ప్రజలు దారమ్మట వచ్చేప్పుడు ఆధార్ కార్డులు తెచ్చుకోండి
నాయనలారా! లేకుంటే పట్టాల పక్కన గుర్తుపట్టడం కష్టమై
ఖర్చు స్టేట్ ఖాతాలోనా సెంట్రల్ భరించాలా తెలవడం లేదయ్యా...
ఓ రకంగా చూస్తే అందరం వలసొచ్చినోళ్ళమే బిడ్డలారా!

ఫ్యాక్టరీల పక్కనే ఇల్లు కట్టుకున్నావా కన్నతండ్రీ!
నీ అలారం నీవే పెట్టుకో బాబూ, అణుబాంబులు తట్టుకోడానికి
అమెరికాలోలా భూగర్భ గృహమొక్కటి కట్టుకో
ఎప్పుడే అవసరమొస్తదో ఎవరికెరుక చినబాబూ-

పదండి ముందుకు భక్త కబీరుల్లారా!
మీకోసం వాళ్ళ తలుపులు బార్లా తెరిచున్నాయి,
పదండి ముందుకు ప్రభుత్వ వీరుల్లారా!
ఆఫీసులకెళ్ళండి అంతకింతా వసూల్ చెయ్యండి

సహజీవనం, సహగమనం, శాంతీ-సహనం సందేశాలై
రాష్ట్రాలూ-కేంద్రమూ; దేశాలూ-అంతర్జాతీయమూ
అందరూ కరోనాదెబ్బకు కలిసి పనిజేస్తారట, సృష్టిస్తారట
అదిగో, ఆ భూతల స్వర్గమూ, అతి చక్కని స్వప్నమూ-

✧✧✧✧✧

# 13. ఇక్కడ ఖాళీ లేదు

సంజీవినీ మందులూ, వెంటిలేటర్లూ చతికిలబడ్డాక,
శీతల కరవాలం చివరి నరాన్ని కత్తిరించినాక ఇంకేముంటుంది,
అంతా అయిపోయిందని ధన్వంతరీ ముద్ర వేసాక
చుట్టుకున్న ధవళ వస్త్రపు ప్యాకేజీ, పైన ఐడెంటిఫికేషను నంబరూ...

తీరా అక్కడికెళ్తే ఇక్కడ ఖాళీ లేదు
ఆతడు కానీ, ఆమె కానీ మా వాళ్ళయితేనే ఇక్కడ
...అయితే ఏంటి, కరోనా అందరికీ సమానమే...
దహనమయితే భస్మసింహాసనం, ఖననమయితే అస్థి పంజరం...

చుట్టపు చూపుగా ఇంగ్లాండో, న్యూజెర్సీ–న్యూయార్కో వెళ్ళాక
అదే ఆఖరిచూపయితే జమ్మిచెట్టు మీది ఆయుధాల మూటలా
అంత దూరం నుంచి వాట్సప్పులో చూసి దుఃఖాన్నాపుకోడమే
ఆనకట్ట పగిలినాక ఎటుచూసినా శోకసముద్రమే!

బలుసాకు తిని బట్ట కట్టి బయట పడి స్వదేశం వస్తే
ఇక్కడ క్వారంటెయిను ఒంటరితనం వెక్కిరిస్తుంది ఇంట్లోనూ బయటా,
తగ్గినట్లే తగ్గి, మహమ్మారి కరొనా మళ్ళీ వచ్చినా
ఎంప్లాయ్మెంటు బోర్డు కనిపిస్తుందేమో–– "ఇక్కడ ఖాళీ లేదు"

✧✧✧✧✧

# 14. చీకటి చెట్టు మీద వెలుతురు పిట్ట

తాళాలు తీసేసి తలుపులు తెరిచాక
మాస్కుల వెనకాల మరో ప్రపంచం మళ్ళీ పరుగు మొదలెట్టింది...
సామాజిక దూరాల్లో పెద్ద మార్పేమీలేదు
దడులూ, గోడలేమీ కూలిపోయిన దాఖలాలు లేవు.

అగ్ర సింహాసనం మీద కూర్చున్న అమెరికా కృష్ణుడు
చైనా శిశుపాలుడి తప్పులు లెక్కెట్టే పనిలో అంకెలు మార్చిపోయి
రాజకీయ యాగంలో రంకెలు బెడ్తూ చేతులు కాలాక ఆకులూ
మందూ మాస్కులకు మారుబేరాలాడ్తున్నాడు

ఏదీ జరగనిచోట, జరుగుబాటులేని చోట, ఏమీ జరగలేదు
ఏదో జరుగుతుందని అన్నీ మూసుకున్నాక ఏదీ జరక్కపోయేసరికి
డిల్లీలో లేచిన గాలిదుమ్మూ, రాష్ట్రాల అల్ప పీడనాన్నీ తట్టుకోడానికి
గొడుగుల కింద డబ్బు షాపుల్ని తెరిచి జేబుదొంగలకు లైసెన్సు లిచ్చారు...

కాలిపోయిన బూడిదలోంచి వివేకమనే ఫీనిక్సు పక్షిని
ఇంకా రెక్కలు విప్పకముందే అహంకారపు బూట్లతో తొక్కి చంపేసి
కొద్దిరోజుల గడబిడల తర్వాత శాంతి కోసం శిఖరాగ్ర సమావేశాలు జరుపుతారు;
అందరికీ తెలిసీ, తెలియనట్లు నటించేచోట అర్థరాత్రి స్టైరీన్ విషవాయువేదో...

...నిశ్శబ్ద దాడి చేసినపుడు
న్యూయార్కు, వెంకటాపురమాది వీధుల్లో
విగతజీవాల మధ్య స్పృహ తప్పి పడి ఉంటుంది
చీకటి చెట్టు మీది వెలుతురు పిట్ట.

✧✧✧✧✧

# 15. మనసారా మన సారా!

ఒక వైరసుని ప్రపంచీకరణ చేసి
వ్యాధిని వర్గీకరించినపుడు
ఆలోచనలెలా లాక్‌డౌన్ చేయబడతాయో
గబ్బిలాలక్కూడా అర్థమయ్యిందిప్పుడు...

జీవాయుధపు ధూళిమేఘాలు భవిష్యత్ బతుకు సూర్యుడిని
కమ్ముకుంటూ పోతున్నపుడు
పెంజీకటి కావల కనిపించిన ఆశారేఖ
కరోనా మబ్బుల అంచునుంచి కనబడకుండా పోయింది...

కొత్త వ్యాధిని కనిపెట్టి ప్రజలపై నెట్టి
విరుగుడు మందుల్తో విపరీతంగా సంపాదిద్దామనే శాస్త్ర పుంగవులొచ్చాక
విష వ్యాధులు, జబ్బులు నాలుగైదేళ్ళకోసారి నామరూపాలు మార్చుకుని వచ్చి
ప్లేట్‌లెట్ల నిండా డబ్బులు కురిసాక ఫేడయిపోతాయి...

రాజకీయనాయకుల మేకపోతు గాంభీర్యం
ఖజానా ఖాళీ అయ్యేసరికి కుదేలయ్యి
కుబేరుడి వాహనమైన మానవుడి బలహీనతలమీద కొట్టే యజ్ఞంలో
డివైను షాపులూ, వైను షాపులూ బార్లా తెరుచుకుంటుంటే

ఆరడుగుల భౌతిక దూరం పాటిస్తూ
ఆల్కహాలికులు ఆనంద వదనాలతో సాకీ లేని పానశాలల ముందు
ఏ చీకూ చింతా లేకుండా జేజేలు కొడ్తూ నిలబడినప్పుడు
ఇంతకాలం వీళ్ళు చూపించిన నిగ్రహానికి ఇంటింటికి ఉచిత సారా
సరఫరా చేసుంటే ఈ ప్రభుత్వాలకింకా గుర్తింపు వచ్చేది కదా...

✧✧✧✧✧

# 16. ట్రెయినుకూ ట్రెయినుకూ మధ్య దూరం

అరిగిపోయిన పాదాలకూ పట్టాలకూ మధ్య అలిసిపోయిన ఊపిరి,
కంపార్ట్‌మెంట్‌కూ కంపార్ట్‌మెంట్‌కూ మధ్య కప్లింగు మీద కూడా ఖాళీ లేదు,
దూరం బాగా మెయింటైను చెయ్యాలి ఆకలికీ నిద్రకూ మధ్య...
ఎందుకు వచ్చామో ఎందుకు ఎక్కడకు వెళ్తున్నామో ఏదీ గుర్తుకురాదు
అక్కడేదో మనదనేది ఉందన్న మరీచికా దృశ్యం కనిపించి అదృశ్యమవుతున్నది...

ఈ నగర ఎడారుల్లో జనమెక్కువ, దాహం తీర్చే ఒయాసిస్సులు తక్కువ,
నడువు, నడువు నాగరీకులు వాళ్ళ ఇబ్బందుల్లో వాళ్ళున్నారు
కరెంటుపోతే సీరియల్ మిస్సవుతారు... ఇటు రా త్వరగా... ఈ కెమేరా కన్ను ముందు
-నీ తెగిపోయిన చెప్పునీ, పగిలి రక్తం కారుతున్న అరిపాదాల్నీ, బొబ్బల్నీ జూంచేయనీ
సీరియల్‌కీ సీరియల్‌కీ మధ్య వాడుకుంటారు సీక్వెన్సులో టీఆర్‌పీ పెంచుకోడానికి...

నడువు, నడువు నువ్వే కదా కన్నది పిల్లల్ని, నువ్వే మొయ్యాలి
ఈ మూటా ముల్లే నేను మోస్తా, అవునూ, ఇంతకీ మనం ఈ పరాయి చోటుకెందుకొచ్చాము
వెలివాడలు, మురికివాడలు ఒరిస్సా, బీహారు, పాలమూరు, ఏమిటీ కూలి బతుకులు?
పేరేదయినా మాయానగరుల్లో వొళ్ళమ్ముకోడానికి సరిహద్దులు దాటించేది పేదరికమేనా?
శ్రమని గౌరవించని నాగరికత ఓ నాగరికతేనా?

నడవడం మర్చిపోయిన వాళ్ళకు నడక కొత్తగానే కనపడుతుంది
సమూహంలో ఒంటరై నడుస్తున్న పాదాలకు చెప్పులుగా,
సామాజిక దూరాలింకా పాటిస్తున్న పాత కొత్త విష వైరసులకు విరుగుడుగా
కొత్త తరుణోపాయాల్ని వెదకాల్సిన సమయం వచ్చింది
ట్రెయినుకూ ట్రెయినుకూ మధ్య, వాళ్ళకూ నీకూ మధ్య దూరం తగ్గి తీర్తుంది...

✧✧✧✧✧

# 17. మూడు కోతులు...

మృత్యువు ముంచుకొచ్చాక ఆ రహస్యం అర్ధమయ్యింది
విష వాయువులు వీస్తున్నపుడు వివాదం ప్రమాదం సుమా...
మాస్కు కట్టుకో, చేతులు కడుక్కో, నోరు మూస్కో,
లేకుంటే నడిరోడ్డు మీద మోకాళ్ళమీద అర్ధనగ్నాసనమే గతి;
ఏ లారీ ఎక్కడ తగుల్తుందో ఏ లారీ ఎక్కడ బోల్తా పడుతుందో,
నీలాగే ప్రశ్నలడిగి అడిగీ న్యాయదేవత కళ్ళకు గంతలు కట్టుకుంది చూడలేక,
అయినా, బతుకు దారుల్లో కాళ్ళీడ్చుకుంటూ పోయేప్పుడు బురద మీద రాళ్ళేస్తావెందుకు?

ప్రభుత్వాలు బిజీగా ఉన్నాయి బురదలో పోసిన పన్నీరు ఖర్చునెలా రాబట్టాలా అని,
శాస్త్రజ్ఞులంతా చిలక, గబ్బిలాల జ్యోతిష్కం చెబుతున్నారు
చిలక నీకార్డు తీసినాక తెలుస్తుంది ఎన్ని రోజులు ఏ జోన్లో ఉండాలో
ఈలోగా ఈ భయం గోలీలు మింగి ఈ బురద కాకుల సమావేశానికి హాజరు కా!
నీకోసమే కదా మందుల షాపులు బార్లా తెరిచింది... పన్నీరు జల్లి మరీ...
ఇదుగో ఈ బురద వేల సంవత్సరాల నాటిది అనేక వర్ణాల బురద
అయినా, బతుకు దార్లలో కాళ్ళీడ్చుకుంటూ పోయేప్పుడు బురద మీద రాళ్ళేస్తావెందుకు?

నీకేంతెల్వదు, నోర్మూస్కో! అనే అరుపుల మధ్యే కదా మనం బతుకుతున్నది,
జ్ఞానులు స్టాటిస్టిక్కు అంజనాలేసి తాళాలు యెన్నాళ్ళెయ్యాలో చెప్పారు కానీ తీసాక
అట్టడుగు బతుకుల అడుగులెటు నడుస్తాయో అర్థం చేసుకోలేకపోయారు...
ఈ విపత్తు చల్లారినా, జీవాయుధాలు ఒకసారి ప్రయోగించాక ఉపసంహారం లేదు!
సహజీవనం తప్పదని అర్థమైనాక బురద మీద రాళ్ళేస్తావెందుకు?
కావాల్సిందల్లా కాసిని మాస్కులు, ఇంత శుభ్రత, మితంగా మాట్లాడడం... ఆ మూడు కోతుల్నీ
గమనించడం... చూడు చూడు... ఆ కోతులప్పుడే మారుస్తున్నాయి మాస్కులు...

✧✧✧✧✧

# 18. ఎందుకయ్యా వలసపోవడం?

ఈదేశం మీది, ఈ సంపదలు మీవి,
ఈ ప్రభుత్వాలూ, ఈ నాయకులూ మీ చౌకీదార్లు...
ఒక్క వైరసు పరాయిదేశం నుంచి రాగానే మిమ్మల్ని తాళాల వెనక
కాపాడుకున్నారు కాదా– అది అద్భుతమే కానీ...
మరి ఇక్కడి వైరసుల సంగతేమిటి?

ఈ దేశం మీదైనపుడు ఈ సంపదలు మీవి కావా?
రెండువేల మూడువందల సంవత్సరాల క్రితం ముప్ఫై మిలియనులున్న
జనాభా నేడు దాదాపు పధ్నాలుగు వందల మిలియన్లు
ఇంకో నాలుగేళ్ళలో చైనాను మించిపోతుంది...
అరవైఅయిదు శాతం మంది ముప్ఫై అయిదేళ్ళు లోపుండే యువరక్తం
మూడు లక్షల చదరపు కిలోమీటర్ల భూమి
నాలుగు వందల నదులు, మూడుపక్కలా సముద్రం,
అయినా ఏమిటీ దరిద్రం? నిలదీసి అడగొద్దా ఈ జ్ఞానుల్ని?

ప్రపంచంలోనే అధిక సాగుబడి భూములున్న దేశం,
నలభై బిలియన్ డాలర్ల వ్యవసాయోత్పత్తుల ఎగుమతితో రెండవ స్థానం
ఇంట్లో తిండికి కొదవ లేదు, వెధవలు సరిగా పంపకాలు చేస్తే...
స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర్నుంచీ సాగించుకుంటున్నారు గదరా
ఇంకా చాలటం లేదా మీ బకాసురుడి పొట్టల్కి...
మూడు ట్రిలియను డాలర్ల సంవత్సరాదాయం,
అయిన పన్నెండున్నర శాతం ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన
ఏ పురుగులు తినేస్తున్నాయీ సంపదల్ని, నిలదీసి అడగొద్దా ఈ జ్ఞానుల్ని?

లక్ష కోట్ల బడ్జెట్టు విద్యకు, తొమ్మిది వందల విశ్వవిద్యాలయాలు,
నలభై వేల కాలేజీలు, మిలియనుకుపైగా పాఠశాలలు
అయిదు వందల ముప్పై అయిదు మెడికల్ కాలేజీలు, ఏడాదికి
యాభైవేల మంది డాక్టర్లు, లక్షలకొద్దీ ఇంజినీర్లు తయారయ్యే దేశంలో
కాస్త వైరల్ విషగాలొస్తే మాస్కుల కోసం, వెంటిలేటర్ల కోసం
ఇతర దేశాల్ని అడుక్కోవాలా? పాఠశాలలంటే బట్టీ కేంద్రాలా?
స్వావలంబన స్కిల్స్ నేర్పొద్దూ?
పని చేసి బతుకుదామని సరిహద్దులు దాటి వచ్చి
ఊరు కాని ఊర్లో గుడిసెల్లో, మురికివాడల్లో బతుకుతుంటే
దేశాన్ని బతికిస్తున్న వాళ్ళను బతికించుకోవద్దా, అని నిలదీసి అడగొద్దా ఈ జ్ఞానుల్ని?

ప్రపంచ చరిత్ర చెబుతోంది ప్రతి ఉత్పాతం తరువాత మార్పులు రావడం తథ్యమని,
దావాగ్నిలోనో, పోడు వల్లనో అడవి కాలినాక కొత్త మొక్కలు పుడతాయి జీవితాలుగా...
ఇవ్వాళ బొబ్బలెక్కి బాధతో రక్తకన్నీళ్ళతో దారిని ఎర్రబరుస్తున్న వలసపాదాలు
రేపు తూర్పును ఎరుపెక్కించే సూర్యుడికి శుభోదయాన్ని పలుకుతాయి...
ఎందుకయ్యా మీరు వలసపోవడం? అసలు వలస పోవాల్సినవాళ్ళు ఇందరుండగా!

✧✧✧✧✧

# 19. పునర్నిర్మాణం

ఈ దేశం ఇప్పుడూ అప్పుడూ గొప్పదే, ప్రజలూనూ,
ఎంత అద్భుతంగా పాలించినా తిట్లూ తప్పవు...
వైరసూ తప్పదు, వలసలూ తప్పవు
ఇవి వైరుధ్య జనితాలు కాబట్టి...
సూక్ష్మ కారణం-ఇదే శ్రమ అక్కడ చేస్తే ఎక్కువ కూలీ దొరుకుతుందని
ఇండియాలో రోజుకూలీ - రెండువందల రూపాయలకు తక్కువ
అమెరికా, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో గంటకు ఏడు డాలర్లకు పైనే
శ్రమను ఓ కులవృత్తిగానో, నీచంగానో చూడరక్కడ
నైపుణ్యమున్నవాడు గౌరవించబడతాడు... అనేది వలసల్ని ప్రోత్సహిస్తుంది.

నిన్న ఆ యువకుడు మండే ఎండలో కాళ్ళీడ్చుకుంటూ పోతూ అన్నాడు-
ఈ భవన నిర్మాణంలో నేనూ నావంతు సాయపడ్డాను పైఅంతస్తు వరకూ...
బిల్డింగు పూర్తయ్యింది, నేనింకోచోట పని వెదుక్కోవాలి
నాకర్థం కానిదేమిటంటే ఈ భవనాలూ, భూములూ, ఆస్తిపాస్తులూ
పని ముట్టుకోని వాళ్ళకెందుకు వారసత్వ సంపదలవ్వాలి?
ఈ దేశానికి నేనూ వారసుడినే కదా పనిచేస్తున్నా నాకెందుకు ఈ కడు పేదరికం?
మా వారసత్వం పేదరికమేనా? డెబ్భై మూడేళ్ళ దేశ సంపదలో నా వారసత్వ వాటా ఏది?

వాళ్ళు కోపంగా అరిచారు- మేము మా రంగు రంగు గొడుగుల కింద దూరం పాటిస్తాము.
మీరెవ్వరు బలవంతంగా మమ్మల్ని ఏదో వ్యాధి నెపం మీద ఒంటరితనంలోకి నెట్టడానికి?
మనసు గాయం మానిపే మందు మీ దగ్గర ఉందా?....
ప్రభుత్వాల పని అడకత్తెరలో పోకచెక్కలా అయ్యేసరికి
అధికారులు ఆముదం తాగిన మొహాలు పెట్టారు...
రేపు ఇంకో వైరసు తుఫాను ముంచుకొస్తే ఆర్థిక వాతావరణ శాఖ ఏం ప్రకటిస్తుంది
అనగనగనగనగా... ఈ రాజకీయ లాక్‌డౌన్ కథకు అంతం ఉందా?

ప్రపంచ దేశాలకు కావాల్సిన ముడిసరుకుల్లో
మూడవ వంతుకు పైగా సరఫరా చేసేది డ్రాగను దేశమే!
పనిచెయ్యకపోతే పప్పులుడకవక్కడ...
విశ్వామిత్ర సృష్టికీ మారుపేరు, వ్యక్తికన్నా సమాజం గొప్పదనుకునేచోటే
విలయమొస్తే విలవిల లాడిపోయారు, వ్యక్తి స్వేచ్ఛ ప్రధానమైన చోట
వలసదారులు కిటకిట లాడిపోక నిర్మానుష్యమౌతాయా?

ఇప్పుడు కావాల్సింది సిద్ధాంత చర్చలు కాదు...
కార్యాచరణ... ప్రజల కందాల్సింది ప్రజల కందేలా చేసే చైతన్య భావన...
జరిగిన తప్పుల్ని సరిదిద్ది అన్నార్తులనేవాళ్ళే లేకుండా చెయ్యాల్సిన సుపరిపాలన...
మందేలేని వ్యాధి మరలా వచ్చినా తట్టుకునే స్వావలంబన...
మానవత్వమే ప్రథమ మతమై ప్రేమ సార్వజనీనమై విలసిల్లే మరోప్రపంచపు రూపకల్పన!

✧✧✧✧✧

# 20. ఈ చదువుల్ని తగలెయ్య

ఎక్కడకోపోయి డాలర్లో దీరాములో సంపాదించుకోండయ్యా
అని చెప్పడానికా
ఈ మిలియను విద్యాలయాలూ రెండున్నర మిలియనుల ఉపాధ్యాయులూ...
ఒక్కసారి అటు పోయినాక ఇటు వచ్చిన వాళ్ళెంతమంది?
ఇవ్వాళ ఇంటికో ఇంజినీరింగు కాలేజీ, వీధికో విశ్వవిద్యాలయం వెలిసాక
గ్రాడ్యుయేట్లూ, పీజీలూ నర్సరీలలో పూలమొక్కల్లా వికసించాక,
నెలకు ఆరేడు వేలకు పనిచేస్తూ, ప్రభుత్వ ఉద్యోగాల కోసం
ఎదురు చూసీచూసీ యాష్టు వచ్చి పళ్ళ బిగువున పనిచేస్తుంటే
కాస్త గాలీ దుమ్మూ వచ్చి తాళాలు పడ్డాక
కూలీకి పోదామన్నా కుదరకపోతే దేనికీ పట్టాలూ, పాఠశాలలూ?
తామర తంపరగా పెరిగిన బడులు బడుద్దాయిల్ని తయారుచేస్తుంటే
ప్రణాళికా జ్ఞానులంతా ప్రపంచపు అవసరాల మోడల్ని ప్రతి సంవత్సరమూ
మన దేశంలో పెట్టి రేపటి తరాన్ని రెంటికీ చెడ్డ రేవడిని చేస్తున్నారు కాదా...

ఈ రోజున ప్రభుత్వం చేతిలో పదమూడు వేల చదరపు కిలోమీటర్ల భూమి ఉంది...
ఇప్పుడున్న ఢిల్లీకి తొమ్మిదిరెట్లెక్కువ నేల... తొమ్మిది ఢిల్లీలు కట్టవచ్చు...
మరి పేదలకు ఇళ్ళు కట్టి ఇవ్వడానికెందుకు ఏడుపు?
ఇదివరకు ఇళ్ళు మింగిన వాళ్ళ లెక్కలు తీసి చూస్తే చాలు,
వాళ్ళ ఇళ్ళు సరిపోతాయి ఇప్పుడు ఇళ్ళు లేని వాళ్ళకు...
ఈ రోజున ప్రభుత్వం చేతిలో బోల్డెంత డబ్బుంది సబ్సిడీలను తీసేసాక మిగిలింది....
దేశంలో ముప్పై మిలియన్ల నిరుద్యోగులున్నారు, వీళ్ళ శ్రమశక్తిని
దేశపు ఆర్థికశక్తిగా మార్చాలి... మూడు లక్షల కోట్ల రూపాయలతో
నిరుద్యోగ సమస్య తీరేంతవరకూ
స్వావలంబనకూ, కుటీర పరిశ్రమలకు ఇవ్వాలి మద్దతు...

ఇదొక చైతన్య తరంగమై ప్రవహించినపుడు
యువతలోని నిరాశా నిస్పృహల స్థానే ఆశల చిరునవ్వు కాంతివంతంగా వెలుగుతుంది...

బట్టీ పొగబట్టీల చదువుల బడుల స్థానానే,
విదేశీ వలస కార్ఖానా స్కూళ్ళ స్థానానే
నా దేశం ప్రగతి కోసం కలలుగనే నవ యువతరాన్ని నిర్మించే గురుకులాలు కావాలి...
దేశానికెవరు కావాలో, ఏమి కావాలో చెప్పే పాఠశాలలు, ఉపాధ్యాయులు రావాలి...
రేపటి తరాన్ని అప్రయోజకుల్ని చేసే చదువుల్ని తన్ని తగలెయ్యండి...
మనిషిని మార్చగలిగింది- తల్లీ, తండ్రీ, గురువూ...
ఆ తరువాత నమ్మినవాళ్ళకు ఆ దైవం...
దైవం మార్చినపుడు మారుదామనుకుంటే
ఆ లాక్‌డౌన్ మరింత భయంకరంగా ఉంటుంది...

✧✧✧✧✧

# 21. ఇంకా తెలవారలేదు...

మానవత్వాన్ని కాదని మతం కత్తెరతో ఒక దేశ వస్త్రాన్ని
ప్రపంచ బేహారి పరపరా చించినప్పుడే
ఒక చిరుగుల కల అతుకుల బొంతగా దర్శనమిచ్చింది...
పిగిలిన చోటే పిగుల్తున్నపుడు కుట్టిన చోటే కుడుతూ
వచ్చిన దర్జీలందరూ ఎవరి రంగుల దారం, ఎజెండాలతో
దర్జాలు పోయారేగానీ కాస్త నూలు వడికి తల్లికి
కొత్త వస్త్రాన్ని ధరింపజేయని దగుల్బాజీలయ్యారు.

పంచవర్ష ప్రణాళికల ప్రకటిత అప్రకటిత సంపదలన్నీ
బలం, తెలివిగల కొడుకులు, కూతుళ్ళు పంచుకుని
దూరంగా తరమబడ్డ పిల్లలకు కంచంలో మిగిలిన కాసిని మెతుకుల్ని
విసిరి దయగల మహరాజులుగా చలామణీ చేసుకున్నారు...
ఎదురుతిరిగీ ఇదేంటన్న వాళ్ళందరూ ఎర్ర స్తూపాలకింద నిద్రపోగా
కొత్తతరం పిల్లల్నీ, పంటల్నీ ఎగుమతి వస్తువులుగా తయారుచేసి,
ఈ దేశం నుంచి ఎగిరిపోయేందుకు రెక్కలూ తొడిగారు వాళ్ళకు...
ఇక్కడ దేశవాళీ బతుకుల రెక్కలు విరిచేసి...

కంప్యూటర్ల పరిజ్ఞానాన్ని రాజ్యాధికారం కోసం
కులాలు, మతాల వర్గీకరణల, వోట్ల లెక్కలకై వాడారు కదా
ఇందరు ప్రజలెందుకు ఎక్కడికి వలసపోతున్నారో తెలుసుకోవద్దా?
ఇన్ని కాలేజీలు, ఇంతమంది అధ్యాపకులూ, విద్యార్థులూ
ఇన్నిన్ని పరిశోధనాపత్రాలూ, ఆర్థికవేత్తలూ, విశ్వ విద్యాలయాలూ,
యు.జి.సి. గ్రాంట్లు తిని నిద్రపోతున్నాయా?

బలహీనంగా ఉన్నారని అమ్మ తన పిల్లల్ని వెలిగా చూస్తుందా?
మరి ఈ భారత మాతముద్దుబిడ్డలకేం మాయరోగం
ఇంకా అంటరానితనాన్ని, వలసల్నీ, పేదరికాన్ని నిర్భంధంగా అమలుచేయడం?
ప్రాణ భయాన్ని వీధి వీధికి ఇంటింటికీ వ్యాప్తిచేసి ప్రజలకు పరీక్షలు పెట్టి,
మళ్ళీ పిల్లలకు ఈ ఎండల్లో పరీక్షలు పెట్టాలన్న మహాత్ములకు దణ్ణాలు పెట్టాల!

అడుగడుగునా పరీక్షలేకదా అట్టడుగు వర్గాలకు!
వాళ్ళ వెతల్ని పట్టించుకోండి ముందు, ఆకలితో సామాజిక దూరాలతో
వందల యేళ్ళ నుంచీ నడిచి వస్తున్నారు తలవంచుకుని కన్నీళ్ళ పర్యంతమవుతూ...
నీళ్ళెండిన కళ్ళల్లోంచీ నిప్పులు కురవడం మంచిది కాదు...
ఎండలు మరింత మండకముందే ఎవరికి రావాల్సిన వాటా వాళ్ళకిచ్చేస్తే...
బొబ్బలెక్కిన పాలన పాదాల దేహాలు పెనుబొబ్బలెట్టడం దేశ ఆరోగ్యానికి మంచిది కాదు...

కాసేపయినా నిద్రపో చెల్లెలా, తమ్ముడూ, ఇంకా తెలవారలేదు...

✧✧✧✧✧

# 22. పనికి రాని వాళ్ళు...

వలస పోవడమనేది ఒక జీవన విధానం
ఆర్కిటిక్ టెర్న్ పక్షి ఆర్కిటిక్ సముద్రం నుంచి వేసవి కాలమైనాక బయల్దేరి,
అంటార్కిటికాకు ఎండాకాలం నాటికి చేరుకుని
వచ్చిన పని అయిపోగానే తిరుగుబాట బట్టి ఆర్కిటిక్ వేసవికల్లా ఇంటికి చేరుకుంటుంది.
ప్రయాణించే దూరం దాదాపు డెబ్భై నుంచి తొంభై వేల కిలోమీటర్లు రానూ పోనూ...
సాల్మన్, సార్డిన్ చేపలూ, మిడతలూ, తూనీగలూ, సీతాకోకచిలుకలూ,
అమెరికా కారిబో రెయిన్ డీర్లూ, గ్రే తోడేళ్ళూ,
ఆఫ్రికా సెరెంగెటి–గ్ను–దుప్పులూ, జింకలూ, పశువులూ
రెండు మిలియనుల గ్రేట్ మైగ్రేషనూ,
మెక్సికన్ గబ్బిలాలూ, సముద్రంలోని తిమింగలాలూ, డాల్ఫిన్లూ, పార్పాయిసులూ,
అవసరార్థం ఖండాలను దాటి మరలా వెనక్కి వస్తాయి...

వలస పోవడమనేది ఒక జీవన విధానం
రెండు లక్షల సంవత్సరాల క్రితం ఆఫ్రికా నుంచి మొదలైన మానవుల వలస
అలలు అలలుగా ఈనాటి ప్రపంచమంతా వ్యాపించిందని శాస్త్రజ్ఞుల సిద్ధాంతం...
పదివేలయేళ్ళ క్రితం నుంచీ రక్తంతో రహదారుల్నీ, కంకాళాలతో సరిహద్దుల్నీ
గీసుకుంటూ, చెరుపుకుంటూ తగాదాల్లో, యుద్ధాల్లో చంపుకుంటూ
ఇప్పటి ప్రపంచ పటాన్ని దాదాపు రెండు వందల ముక్కలుగా విభజించుకుని
ఆ గీతల్ని కాపాడుకోటానికి మారణహోమాలు చేస్తూంటే
క్షతగాత్రుల, అమాయకుల వలసలు అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉన్నాయి...
యూరపు నుంచీ ఆసియా, ఆఫ్రికా అమెరికాలకు శ్వేత వలసలూ,
ఆఫ్రికా ఆసియాల నుంచి అమెరికా దేశాలకు నల్ల బానిసల వ్యాపార వలసలు,
ఇప్పుడు ఆకుపచ్చకార్డుల కొత్త బానిసల వలసలూ...

వలస పోవడమనేది ఒక జీవన విధానం...
ఇప్పుడది శరణార్థి రూపాన్ని సంతరించుకోగా... సిరియా, రొహింగ్యా,
ఇలా వలస దారులన్నీ కన్నీరు, రక్తం తడిచిన కొత్తదారులయినాయి...

ఇక్కడ ముప్పై మూడు లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, నూట నలభై కోట్ల జనం,
పదహారు వందల భాషలూ, వందకు పైగా ముఖ్యభాషలూ, ఇరవైరెండు అధికారిక భాషలూ
ఇరవై ఎనిమిది రాష్ట్రాలూ, ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలూ,
మూడు ట్రిలియను డాలర్ల ఆర్థిక వ్యవస్థా, యాభైరెండు మిలియనుల శ్రమజీవులూ...
ఆ రాష్ట్రం నుంచీ ఈ రాష్ట్రానికీ, ఇక్కడనుంచీ అక్కడకూ ఆకలి, ఉద్యోగ వలసలు...

వలస పోవడమనేది ఒక జీవన విధానం
దూరం నుంచి వచ్చినోళ్ళయితే నోర్మూసుకు పనిజేస్తారు
ఇక్కడోళ్ళయితే అన్నీ కిరికిర్లే, యూనియన్లంటారు లొల్లి జేస్తారు...
పనిజెయ్యరు పైపెచ్చు ప్రతిదానికీ రాజకీయం జేస్తారు...
– మన పనికి రాని వాళ్ళు మనకు పనికి రాని వాళ్ళే–
కేరళ నుంచి నర్సులూ, టీచర్లూ, ఒరిస్సా, బీహార్ల నుంచీ కూలీలు,
తమిళనాడు నుంచీ గ్రానైటు వర్కర్లూ, కాస్త మెరుగైన జీవనోపాధి కోసమేగదా
ఈ వలసలూ, అనధికారిక శ్రామిక ఒడిస్సీలూ...
సంఘటితమైన చోట పనిజెయ్యరు–– పైరాబడి కోసం పడి చస్తుంటారు...
అసంఘటిత మైదానాల్లో ఆకలి వలసలు...

వలస పోవడమనేది ఒక జీవన విధానం
పాతికేళ్ళ లోపు వయసున్న అరవై కోట్ల యువజనులున్న దేశమిది...
ఈ దేశపు రూపురేఖల్ని మార్చాల్సింది మీరే!
ఇప్పుడున్న అడ్డుగోడల్ని మీరు మాత్రమే తొలగించగలరు...
ప్రతి ఉత్పాతం తరువాతా ప్రపంచపు రాజకీయ గతి మారింది...
ఇప్పుడు మన భారత మాతకు నూతన వస్త్రాన్నీ, తేజస్సునూ యిచ్చి,
మరో ప్రపంచాన్ని నిర్మించాల్సిన తరుణమిదే!
శ్రమశక్తిని గౌరవించి బతికించుకున్న నాడు దేశం సౌభాగ్యవంతమౌతుంది...
ఈ పనికి రాని వాళ్ళు ఎవరికీ పనికిరానివాళ్ళే...!

✧✧✧✧✧

# 23. విరోధ భారతం...

గురివింద గింజల సమావేశంలో చర్చల వేడి ఎక్కువయ్యింది...
పెనం మీద పేలుతున్న పేలాల్లా పేలుళ్ళ చప్పుడే ఏ చానెల్లో చూసినా...
కళ్ళతోచూడ్డం మానేసి కళ్ళద్దాల్లోంచీ చూసేప్పుడు
ఎదుటివాడు చేసే ప్రతి పనీ వెధవ పనిలానే కనిపిస్తుంది...
అదే నేనైతేనా ప్రపంచవ్యాధిని నా ప్రశస్తమైన మందుతో
నెలరోజుల్లో నివారిస్తాననే ఉత్తరకుమారులూ, దక్షిణ నాయకులూ,
టెలివిజను స్క్రీన్ల మీద బర్బరీకుడి శిరస్సుల్లా ఊగిపోతుంటారు...

తొమ్మిది వందల టీవీ ఛానెల్సూ, లక్షకు పైగా న్యూసుపేపర్లూ, పత్రికలూ,
ప్రతిరోజూ వార్తల్ని వడపోసి వ్యాఖ్యానిస్తాయి కానీ,
అన్నీ రాజకీయ పుత్రికలు కనుక – గడియారాల షాపులో గడియారాల్లాగా–
ఏ రెండూ ఒకే టైము చూపించనట్లు, ఏ పత్రికా నిజాన్ని నిజంగా చెప్పదు...
కేంద్ర ప్రభుత్వ భోజనాలు రాష్ట్ర ప్రభుత్వాలకూ అరగవు,
రాష్ట్రాల రుచులు జిల్లాలకు పడవు, ఎవరూ నిజం చెప్పరు...

దక్షిణదేశమంటే ఉత్తర దేశస్తులకు చులకన,
ఉత్తరాదంటే దక్షిణాదిలో తిరస్కరణ...
జన, ధన, గుణ విభజనల్లో లాభాలకోసం భగవానుడి పాదాల మీద పడి మొక్కేవాళ్ళు
శ్రమచేసి ప్రగతివేపు నడిపించే వలస పాదాలనుంచి పుట్టిన వాళ్ళను
సూదుల్తో పొడిచి పొడిచి సూక్తాలను రుజువులుగా చూపించేవాళ్ళు ఇన్నాళ్ళూ...
ఇప్పటి యువతకు తాము పోగొట్టుకున్నదేమిటొ తెలుసు,
వీళ్ళకు ప్రశ్నించడం వచ్చు...
ఎవరి సమాధానాలకో, దయా దాక్షిణ్యాలకో ఎదురు చూడరిక...
ఈనాటి విద్య ఇప్పిస్తున్నది సేవకావృత్తిని, అనిశ్చిత భవిష్యత్తునూ...
కరోనా విషవాయుగాడ్పులకు కోట్లకొద్దీ ఉద్యోగాలు కాలిపోయాయి కలలతోపాటు,
యువత నిర్ణయించుకోవాల్సిన సమయమొచ్చిందిప్పుడు...

ఉన్న ఊరును విడిచి సరిహద్దులుదాటి
పది రూపాయలు ఎక్కువ వస్తాయని పరాయి నీడ కింద నిర్బంధంలో కుమలడమో,
ఉన్న ఊళ్ళోనే శ్రమకు తగ్గ ఫలాన్ని పొందడమో తేల్చుకోవాలి...
సమాజం తనకు కావాల్సిన నిపుణుల్ని తగినంతగా తయారు చేసుకోవాలి.

ఉద్యోగమిమ్మని అడుక్కోవడం ఊంఛావృత్తికన్నా అధమం కాదా?
ప్రభుత్వాన్ని ప్రతిపక్షం, ప్రతిపక్షాన్ని ప్రభుత్వం గుడ్డిగా వ్యతిరేకిస్తూ
ఉత్పాతాలొచ్చినప్పుడు ప్రజలు ఊపిరికి ఆసరాగా మారనప్పుడు
విరోధ భారతం స్థానే విషాద భారతమొస్తుంది, తస్మాత్ జాగ్రత్త!

✧✧✧✧✧

# 24. అవుటర్ రింగు రోడ్లు...

ఆరుగాలమూ శ్రమించే గానుగెద్దులు తిరుగుతూనే ఉన్నాయి...
ఆగే ప్రసక్తీ లేదు, ఆకలీ తీరడం లేదు...
కళ్ళకు గంతలు కట్టేసాక పగలంతా చీకటే...
చీకట్లో ఉన్నపుడు పగలైనా రాత్రయినా ఫరకు పడేదీ లేదు...
భయం ప్రవహించే దారుల్లో బతుకుతెరువు మృగ్యమవుతుంది...
వ్యాధి వలయ రహదారుల్లో, రింగు రోడ్లలో
టోల్‌గేట్ల దగ్గర తోలు తీసేందుకు రింగులే రింగులు...
గానుగెద్దులు తిరుగుతూనే ఉన్నాయి విశ్రాంతి లేకుండా
చీకటిపడ్డాక పడేసే ఆ కాస్త గడ్డి కోసం...

అక్కడ కంచె లోపల ఎద్దులూ, ఆవులూ, మేధావులూ, ఆంబోతులూ...
పనిచేయకుండా స్వేచ్ఛగా మేస్తున్నాయి నానా రకాల గడ్డీ...
గానుగెద్దు మెడలో డిగ్రీల పట్టాకున్న గంటలు గణ గణ మోగుతున్నాయి...
ఎంత ఆలోచించినా దానికర్థం కావడం లేదు... ఇదేమి న్యాయం?
పనిచేస్తూ, ఉన్నదమ్ముకుని చదువుకుంటే గానుగెద్దు జీవితాలా?
పనిజేయకుండా చదువుకొని ఆంబోతుల్లా తిరిగినా
పూర్వీకుల చర స్థిరాస్తులు, కుల గౌరవాలూ ఏ శ్రమ లేకుండానే
వారసత్వ సంపదలౌతున్నపుడు ఎద్దుల పోటీ పరీక్షల్లో ఎట్టా నెగ్గేది?
గానుగెద్దుకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

మే నెల ఎండ మేనును మాడ్చేస్తున్నది...
కాలిపోతున్న రహదార్లపై వలసొచ్చి బక్కచిక్కిన లేగదూడలూ, ఆవులూ, ఎద్దులూ
పాదాలకు బొబ్బలెక్కుతున్నా లెక్కచేయకుండా స్వంత బీళ్ళలోకి పోతున్నాయి
డెబ్బై యేళ్ళనుంచీ ఎంత నడిచినా దారి తరగడం లేదు, ఎప్పుడెవరొస్తారో...
ఏ బందుల దొడ్లో పెడతారో క్వారంటెయినో, ఐసోలేషనో,
ముట్టికి చిక్కాలో, ముక్కుకు తాడో వేసి నిర్బంధంగా...
పగలంతా కళ్ళకు గంతలు కట్టి, ఏవీ చూడకుండా, ఆలోచించే వ్యవధి ఇవ్వకుండా
అదుగో కట్టేసి నడిపిస్తున్నారు కొత్త ఔటర్ రింగురోడ్లపై...
మళ్ళీ గానుగెద్దు జీవితాలవేపు మళ్ళిస్తున్నారు...
చీకటి పడ్డాక ఇంత గడ్డి పడేస్తారు...
ఛీ!

✧✧✧✧✧

# 25. బీరు గంధము తెచ్చినారము...

కబీరులెవ్వరో చెప్పుడీ, ఇంటియింటికి తెచ్చి పోస్తుము
ఈ మెయిలూ వివరాలూ ఇవ్వుడీ!
ఖాతాల్లోనా పైసలేస్తిమి కొద్దికొద్దిగా వాడుడీ,
ఇన్ని వరాలిచ్చినాము వోటు మాకే ఇవ్వుడీ!

అందరూ మాకు సమానమేగానీ మా వాళ్ళు మాకూ ఎక్కువే
మీరు మాత్రం చెయ్యలేదా మీ ముంగిట్లో సవ్వడీ!
ప్రజాపతులయ్యినాక మీరూ శ్రీ పతులయ్యారు కాదా,
పేదలింట్లో ఉండనివ్వండి పెద్దమ్మ గజ్జెల సవ్వడీ?

మీరు మేమూ ఒక్కటే మహా నేతలమయ్యినాకా,
బానిసలు లేకుంటే మన బరువు మోసేదెవ్వడండీ?
మనకు తెలిసినదే కదా అటిచ్చిటు పుచ్చుకునే విద్య
వాళ్ళ తాగుడు శక్తే మన బండిని నడుపునండీ!

కాలం మారే రోజుల్లో కర్మ కూడా మారునూ,
కొత్త వానా కురవగానే కొత్త మొక్కలు పుట్టునండీ,
శ్రమజీవుల కన్నీళ్ళూ శాపమగును సమాజానికీ,
వారి బ్రతుకులు బాగుంటేనే దేశ ప్రగతి బాగుండునండీ!

నీతి గంధము తెచ్చినారము పారేయండి మీ పాత మాస్కులూ,
బల్ల కింద చేతుల్ని బాగ శానిటైజు చెయ్యండీ!
వీరగంధము తెచ్చినారము రండి ముందుకు వీరులూ,
సాటి మనిషికి సాయం చేయగ కలిసికట్టుగా రారండీ!

✧✧✧✧✧

# 26. చైనా పిల్లి...

బొమ్మల లోడుతో పాటు చెన్నై పోర్టులో దిగి, దిగీ దిగగానే
'మియ్యావూ' అని అరిచిందా చైనా పిల్లి ఆకలితో కేకలేస్తూ...
ఇమ్మిగ్రేషను అధికారులకు ముచ్చెమటలు పోసాయి...
పట్టుకుని సెల్ఫీలవీ దిగాక అనుమాన భయాలధికమయ్యాయి...
ఇదేమన్నా గూఢచారి పిల్లా?
క్వారంటెయినులో పెట్టి దాని కదలికల్ని అబ్జర్వు చేస్తున్నారు...

ఫిబ్రవరి పదిహేడు నుంచీ డ్యూటీలో ఉన్నవాళ్ళకి నిద్రలేదు
అప్పటికే మీడియాలో సెలబ్రిటీ అయిపోయిందా చైనా పిల్లి...
జంతు ప్రేమికులు పెద్దపెద్ద వాళ్ళు దాని బాగోగుల మీద ఫోకసు పెట్టారు...
అప్పటికే లోకమంతా కరోనా వైరసూ కాలు దువ్వడం మొదలెట్టింది...
జనవరి ఇరవై మూడునే వూహానులో లాక్‌డౌన్ ప్రకటించారు...

మార్చి ఇరవై నాలుగు కల్లా ఇండియా కూడా తాళాలు వేసుకున్నది...
చైనా పిల్లినందరూ చూస్తున్నారు అను అనుమానంగా...
అది మియ్యావూ అంటే వంద అర్థాలు వెదుకుతున్నారు అంతర్జాతీయ నిపుణులు...
ఇట్లా వచ్చింది ఒక్క పిల్లేనా లేక... అట్లా అనుమానం వచ్చేసరికి
మొదలయ్యింది గందరగోళం... ఫిలిప్పీన్స్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్,
ఇరాన్, వియత్నాం, కొరియా, ఇటలీ, బ్రిటన్, జర్మనీ, స్పెయిన్, బ్రెజిల్, ఫ్రాన్సు,
రష్యా, అమెరికా దేశాలన్నీ చైనా పిల్లులేమన్న తమతమ దేశాల్లో దిగాయేమోనని...
వణికి వణికి చలిజ్వరం తెచ్చుకుని మాస్కులు తొడుక్కోడం మొదలెట్టారు...

ఇన్నాళ్ళూ వాడిన మాస్కులు తీసేసి చూస్తే అందరి ముఖాలకూ
చైనా పిల్లికున్ననట్లు అను మీసాలే-కరోనా స్పైకుల్లాగా...!
పిల్లికేదన్నా అయితే మేమూర్కోమని కాటిట్యూడ్‌తో క్యాటు కాపరులు
గట్టిగా వార్నింగులిస్తున్నారు... చైనా పిల్లి మాత్రం అక్వేరియం దగ్గర
గెంతులేస్తూ గోల్డ్ ఫిష్షులను జూసి లొట్టలేస్తున్నది...
పిల్లొచ్చి మూడు నెల్లయ్యింది కాబట్టి పుట్టింటికి పంపాలా
అత్తారింట్లో ఆదరించాలా అనే మీమాంస జాతీయ సమస్య కాకూడదని
విజ్ఞులు చైనా పిల్లిని జనజీవన స్రవంతిలో సహజీవనానికే నిర్ణయించారు...
శుభం చీనీ చీనాంబర మార్జాల ఇంద్రజాల కరోనా జ్వాలా భూయాత్! సశేషం...

✧✧✧✧✧

# 27. రావడానికీ పోవడానికీ మధ్య...

ఈ కాలి నడక మానవా? నిన్నటి గాయాలు మానాయా?
అప్పుడే మళ్ళీ తిరుగు ప్రయాణం మొదలెట్టావు?
యన్95 మాస్కులు తొడుక్కున్న నవసమాజంలోకి వచ్చేముందు
చేతులూ కాళ్ళూ శుభ్రంగా కడుక్కున్నావా అవినీతి లేని సబ్బుతో?
నమస్కారాలే ఇక్కడ మాస్కుల వెనక మస్కాలు కనబడవు...

మొన్నటి తుఫానుకు అవినీతి, కరోనా విషజ్వాలకు బంధుప్రీతీ,
సోడియం హైపోక్లోరైటు స్ప్రేలతో కుల మత వర్గ విద్వేషాలూ,
మే నెల ఎండ, వడగాడ్పులకు రౌడీ దోమలు, ఈగలు, మిడతలూ
అన్నీ సమూలంగా నాశనమై మన నాయకులూ, అధికారులూ
బోధి చెట్టు కింద డెబ్బై యేళ్ళ అక్రమ సంపాదనల్ని
పేద ప్రజలకు పంచి పెట్టేస్తున్నారా? అందుకేనా మళ్ళీ ఈ నడక?

అయిదు వందల ఎకరాల స్థలంలో ఏడెనిమిది లక్షల మంది
వంతులవారీగా నిద్రపోయే మురికి వాడల నుంచీ,
ఇతిహాస కాలం నుంచీ వందల వేల యేళ్ళుగా ఉన్న వెలివాడల నుంచీ,
ఎర్రకోటకో, అయోధ్యకో, కురుక్షేత్రానికో నడిచి పోయేప్పుడు
ఎంతకాలం భౌతిక, సామాజిక దూరం పాటించాలి?
ఈ కరోనా వైరసు వచ్చాకన్నా – మా కులం వాళ్ళ రక్తమే నాకు ఎక్కించాలి,
మా వాళ్ళ వెంటిలేటరే నాకూ పెట్టాలి – అనే వైరసేమన్నా మారిందా?

నడువు చెల్లెలా, తమ్ముడూ–ఢిల్లీ ఇంకా చాలా దూరముంది
ఈసారి కాళ్ళకు బొబ్బలెక్కినా నడక ఆపొద్దు...
పొద్దు పొడిచేప్పటికల్లా పొలిమేర చేరాలి...
నడువు చెల్లెలా, తమ్ముడూ–ఢిల్లీ ఇంకాస్త దూరమే ఉంది!

✧✧✧✧✧

# 28. ఆలయాల్లో నాకూ నీకూ మధ్య దూరం...

అన్ని ఆలయాలూ తెరుస్తున్న సందర్భంగా ఈ ప్రకటన!
ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల్లో ఎవరి యెత్తూ, ఎత్తుగడలనిబట్టి
సామాజిక దూరాన్ని విధిగా పాటించాలి...
చేతుల్ని నీతిఆయోగ్ శానిటైజర్లతో శుభ్రం చేసుకుని
ఫ్రే టి యం ల ద్వారా లావాదేవీల్ని యధావిధి యాప్స్ ద్వారా
మూడు నెలల నష్టాన్నీ భర్తీ చేసుకునే వెసులుబాటుని కల్పించుకోవాలి...
కార్యార్థికి అధికారికీ మధ్య జేబుల్కీ చేతుల్కీ ఉండాల్సిన దూరాన్ని
స్థానికంగా నిర్ణయించుకోవాలి.

సచివాలయాల్లో పర్సెంటేజీలు, వెయిటేజీలు ఇలాంటివేమన్నా ఉంటే
ప్రస్తుతం తగిన తరుణం కాదు కనుక వాయిదా పద్ధతుల్లో వాయిదా వేస్తున్నారు...
తగిన సమయం రాగానే ప్రజల నష్టాన్ని తమ నష్టంగా భావించి
క్వారంటెయిను బోరుబావిలో పడ్డ వలస పిల్లాడిని బయటకు తీసినట్లు తీస్తారు...
ఆనక చేతులు కాలినాక ఆకులు పట్టుకుని...
మనకలవాటైన పద్ధతిలోనే కాసేపు చింతించి చింతించి వగచి వగచి...
మందుభాయికి మందు షాపుకూ దూరం ఉన్నట్లు
ప్రజలకు ప్రభుత్వానికీ మధ్య ఉన్న దూరాన్ని
స్థానికంగా నిర్ణయించుకోవాలి...

విద్యాలయాల్లో పేద విద్యార్థి చదువుకీ ఉపాధ్యాయుల బోధనకీ,
ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకున్న
భౌతిక, సామాజిక దూరాన్ని మన స్మృతీ, మనుస్మృతీ అధ్యయనం చేసి
స్థానికంగా నిర్ణయించుకోవలి...
గృహాలయాల్లో  మన మనుషులకూ, పని మనుషులకూ
మనో ఆలయాల్లో, హృదయాలయాల్లో, ఉన్న, ఉండాల్సిన దూరాన్ని
ఎవరికి వారే స్థానికంగా నిర్ణయించుకోవాలి.

ఏమీ మార్లేదు చెల్లెలా, తమ్ముడూ...
ఈ దూరాలింకా పెరుగుతూనే ఉన్నాయి...
దేశాల సరిహద్దుల్లో, దేహాల హద్దుల్లో మృత్యు ఘంటికలు మోగుతూ...
మరణ భయం ఇంత దగ్గరగా వచ్చినా
అన్నిటినీ సమం చేసే ఆ ఆఖరి ఆలయం మహాప్రస్థానం దగ్గరయినా
సామాజిక భౌతిక దూరం మారిందా?

మారుతుంది, తప్పక మారుతుంది,
భస్మ సింహాసనాలు, ఎర్ర గసగసాల పొలాలూ
అసంఖ్యాక సమాధి ఫలకాలున్న ఆ నిశ్శబ్ద స్థలిలోంచే
కొత్త శబ్దం మొలకెత్తుతుంది...
విశ్వ నాదమై విస్తరిస్తుంది...

✧✧✧✧✧

# 29. ఎక్కడి మిడతలు అక్కడే గప్‌చుప్ సాంబార్ బుడ్డీ!

ఇదే మంచి సమయం...
వాళ్ళు ఆ మార్కెట్టులో అన్నీ అమ్ముతారు
మిడతల్ని కూడా శూలప్రోతం చేసిన మసాలా దట్టించి మరీ–
ఉసుళ్ళు లానే అవీ మాంచి బలవర్ధకమైన ఆహారం కాబట్టి...
ఎడారుల్లో, ఆకలి దారుల్లో ఏదీ నిషేధం కాదు...
సృష్టికి ప్రతిసృష్టి చేయగల విశ్వామిత్రుడూ తపశ్శక్తి తగ్గినప్పుడు
కరువు కాటకాల కాలంలో కుక్క మాంసంతో ప్రాణం కాపాడుకున్నాడు,
రాంబోలూ, అన్వేషకులూ, అలన్ క్వాటర్ మయిన్లూ
ఎడారి తేళ్ళూ మండ్రగబ్బల్నీ, తొండల్నీ
తిని అరిగించుకుని గొప్ప గొప్ప ఫైట్లు చేసి
దుష్టశిక్షణా, శిష్ట రక్షణా చేసింది మనం చూసాం కళ్ళారా...
ఇదీ మంచి సమయమే...
తినడం ఇష్టం లేకపోతే వాటిని పట్టి తెచ్చిన వాళ్ళకి
పనికి ఆహార పథకం కింద పైసలు ప్రకటిస్తే
పట్టుకొచ్చిన మిడతల్తో కోళ్ళకు దాణా కింద అమ్మొచ్చు కదా...
ఎట్లాగూ ఇచ్చిన పైసల్ని వసూల్ చేసుకోడానికి
పక్కనే కల్లుపాకలూ, మందు దుకాణాల్లో మందుతో పాటు
కోడి పకోడీలు, మిడతల పకోడీలు వేడి వేడిగా
మనకలవాటైన పద్ధతిలో పాలు కల్తీ చేసినట్లు చేసేయొచ్చు...
ఇంత బిరియానీ, మందుకు వోట్లూ, ఆత్మలూ అమ్ముడు పోవట్లేదా?
ఇదే మాంచి సమయం బాబూ...
అర్థమవుతుందా నీకు... పందుల్ని తింటే స్వైన్ ఫ్లూ,
పక్షులూ–కోళ్ళని తింటే ఎవియన్ ఫ్లూ, గబ్బిలాల్ని తింటే కోవిద్ ఫ్లూ
నడిచే ప్రతిదాన్నీ తినే దేశం నుంచే కదా నడుచుకుంటూ వచ్చింది కరోనా!
మిడతల్ని తినొచ్చు కానీ ఆ తరువాత ఏ వైరసు వస్తుందో గబ్బిలాల
కోవిద్ వైరసులా... మళ్ళీ ఏ లాక్‌డౌనొస్తుందో...
మరి ఇళ్ళు, ఊళ్ళూ, భూములూ, కోళ్ళూ, పక్కోళ్ళని తిని త్రేనిస్తే రాదా
మారణ కారకమైన వైరసు?
ఎక్కడి మిడతలు అక్కడే గుప్‌చుప్ సాంబార్ బుడ్డీ!

✧✧✧✧✧

# 30. ఒక నీటి కల

రెండు గొప్ప నదులూ, అనేక చెరువులూ, అసంఖ్యాక బావులూ,
ఆనకట్టలూ, రిజర్వాయర్లూ ఉన్న బంగరు నేల,
అనేక రాజులూ, రారాజులూ, సుల్తానులూ, నవాబుల
కీర్తి కిరీటాలపై కోహినూరు లాంటి వజ్రాల్ని అలంకరించిన రత్నాల నేల,
త్రిలింగాల మధ్య దేశమై జైన, బౌద్ధ, శైవ, వైష్ణవ, హైందవేతర సంస్కృతుల
తులతూగే వెండి నేల,
సిరిసంపదల ఓలలాడి ఒకప్పుడు ప్రపంచ కుబేరుడున్న హరిత నేల,
కాలరేఖలో ప్రాధాన్యతలు తారుమారైనపుడు కళ దప్పినా
మరల దేశపు ధాన్యాగారమై విలసిల్లబోతున్న విప్లవ నేల,

శ్రీ పరమేశ్వర జటా నిర్గత గంగా ప్రవాహ మహిమాభి వర్ణన చేసిన
సహజ కవి పోతన నడయాడిన కవిత్వ సంపదల నేల.
కొండపోచమ్మ సాగరమ్మునకు ఎత్తిపోతల కదిలింది గోదారి తల్లి...
మేడిగడ్డ నుంచి అన్నారానికి కన్నెపల్లి జలధార కదిలిరాగా
కనుల పండుగయ్యె కాద మాకు...
అటునుంచి శుందిళ్ళకెల్లి నా గోదారి ఎగసి దూకింది యెల్లంపల్లికి...
అటు కదిలి ఇటు కదిలి ఆ గంగ చేరింది... నంది మేడారంలోని
రామడుగు బావికి,
రామడుగు నుంచి మధ్య మానేరుకు ఏడు మోటార్లతో ఎగిసిపడేను
భూగర్భాన ప్రవహించి అడుగుబెట్టేను తల్లి అనంత సాగరమందునా...
కర్పూర కాంతుల విరజిమ్ముతూ కదిలి ప్రవహించి రంగనాయక సాగరాన
ముత్యాలసరుల అలలతో మురిపాలు కురిపించు... మా బంగారు తల్లి...
పాలనురుగుల చెంగట నర్థోన్మీలిత ముత్యాల సుళ్ళును, సుళ్ళ
కెలంకులు ధవళ జలధర రేఖాకారంబులు కాగా పారి,

ప్రవహించి చేరు కొండపోచమ్మ దివ్య సన్నిధికి కోటి జలధారల అలల అలరించు విధాన...
విశ్వంభరుని శంఖంబు నుండి ఆశ్రిత ప్రహ్లాదగా, కామధేను కల్పలతాద్యభినవంబై తెలంగాణా నేలను సంప్రోక్షించును గాక!

ఆనాడు ఆకాశంబున నుండి శంభుని శిరము పైకి దూకెనా గంగమ్మతల్లి...
భగీరథుని పిలుపునాదరించి...
ఈనాడు అంచెలంచెలుగా రెండువందల యాభై కిలోమీటర్ల దూరం నడిచి, అరకిలోమీటరు ఎత్తుకెగసెనీ గోదారి గంగమ్మ... ధన్యుడు చంద్రశేఖరుని స్వప్నమాకర్ణించి...

ఆ గంగ దిగి వచ్చె భస్మరాసులకు పుణ్య మొసగ....
ఈ గంగ ఎగసి వచ్చె అన్నార్తుల నాదరించ అన్నపూర్ణగా...
ఇది ఒకనాటి కల, నేడు
సాకారమైన నీటి కల... జీవకళ...

శుభం భూయాత్...

✧✧✧✧✧

# 31. రెండు వాన చినుకులు...

బ్రహ్మాండ ఘటమున ఉష్ణ రసము తెచ్చి బ్రహ్మ పోసినాడని
            పోతనార్యుడు పలికిన తెరునవున,
ననభీల నిదాఘకాలపుటెండల వాడిన తరులతా కుసుమచయ
            దళములాశించు జల కరువున,
నేల పగిలి నెర్రెలు గండు చీమల బారిన పడిన మహాసర్పపు
            పొలుసుల వోలె తోచు తరుణాన,
సకల జనుల, పక్షి జంతు తతుభీష్మమై, వడగాడ్పుల విస్తరించి
            పానశాలలవేపు పరుగులెత్తించిన గ్రీష్మాన,

కాలి భస్మమయ్యేనో లేదో ఈ కరోనా వైరసటంచు
కాలుగాలిన మార్జాలముల వోలె కరముల మొబైళ్ళతో
కాల్ కాల్‌కు మధ్య సహచర దూరమ్ము సాకారము కాగా,
కాలమ్ము గడుపుతూ కొందరు భాగ్యులు శీతల గదులలోన-

లాక్ డౌన్ సడలినా మరణ భయపు తాళము మ్రోగుచుండ
మండుటెండల్లో ఇంటిదారి బట్టిన అభాగ్యుల వంటినిండ
మనసింట సంకులమైన నిరాశా మేదినీ రేణువుల్ మండుచుండ
మింట తిరిగెడువాడి వాడి కిరణవేడి కన్నీటిని కాల్చుచుండ

నిరాదరణ దారులందు ప్రేమ, ఆప్యాయతల ఆపన్నులనాదరించి,
అన్నపానీయాదులనొసగి, ధైర్యంబు చెప్పి ఇంటికేగు దారి చూపించి
ఉత్పాతపు ఎడారులందు ఉపశమనపు ఒయాసిద్ధులైన వారికి తోడు వచ్చెనో
అన్నట్లు పలకరించెను రెండు వానచినుకులీ రోహిణీ కార్తెయందు...

✧✧✧✧✧

# 32. అతడింకా చనిపోలేదు...

దొంగనోట్లూ, మాదక ద్రవ్యాలూ, గన్నులూ, బుల్లెట్లూ,
స్వేచ్ఛ, లిబర్టీ విగ్రహం, నిరుద్యోగం, శ్వేత బెత్తం, నల్ల చర్మం...
ఊపిరాడట్లేదు మనిషీ నీ మోకాలు తీయి నా గొంతు మీంచీ
అదుగో మృత్యు గురక... గెటప్ మ్యాన్... ఐ కాంట్ బ్రీథ్...

మిన్నియాపోలిస్ నేల నల్లబడుతోంది ఫ్యాక్టరీ పొగగొట్టంలా
నాకు చీకటంటే భయం, ప్లీజ్, ప్లీజ్, ప్లీజ్
ఊపిరాడట్లేదు మనిషీ నీ మోకాలు తీయి నా గొంతు మీంచీ
అదుగో మృత్యు గురక... గెటప్ మ్యాన్... ఐ కాంట్ బ్రీథ్...

ఇరవై డాలర్ల నోటు ఇంతకీ అది నకిలీదా కాదా?
ఒక సిగరెట్టు పాకెట్టు- అనుమానపు ఫోను కాల్ నంబర్-911,
నిరుద్యోగి నుదుటిపై గురిపెట్టిన రివాల్వర్... కార్లోంచీ బయటకు లాగి,
చేతులు వెనక్కి విరిచికట్టి బేడీలు వేసినాక తిరగబడ్డ ఆత్మాభిమానం
పెనుగులాట, ఎనిమిది నిముషాల నలభై ఆరు సెకండ్ల జీవితం...
ఊపిరాడట్లేదు మనిషీ నీ మోకాలు తీయి నా గొంతు మీంచీ
అదుగో మృత్యు గురక... గెటప్ మ్యాన్... ఐ కాంట్ బ్రీథ్...

ఆ కార్లోంచీ ఈ కార్లోకి అంబులెన్సు లోకి-- మే 25, 2020-
20:08, 20:19, 20:27 కు మధ్య- ఓ ఇరవై నిముషాల లోపే...
నలభై ఆరేళ్ళ జార్జి ఫ్లాయిడ్....
ఎనిమిది నిముషాల నలభై ఆరు సెకండ్ల జీవితం...
ఊపిరాడట్లేదు మనిషీ నీ మోకాలు తీయి నా గొంతు మీంచీ
అదుగో మృత్యు గురక... గెటప్ మ్యాన్... ఐ కాంట్ బ్రీథ్...

ఆ గొంతు ఇక్కడా వినిపిస్తూనే ఉంది... పరువు దారుల్లో...
ఇక్కడా ఊపిరాడటంలేదు యెన్నో తరాల్నుంచీ...
ఊపిరాడట్లేదు మనిషీ నీ మోకాలు తీయి మా గొంతుల మీంచీ
గెటప్ మనూ... ఐ కాంట్ బ్రీథ్...
అతడింకా చనిపోలేదు- ఇంకాసేపు నొక్కిపెట్టు...

✧✧✧✧✧

# 33. గోస యాత్రలు...

ద్వైత వనంలోకి కరోనా గో సంరక్షణ నెపం మీద గోక్కున్న,
దుశ్శకున దుష్టాంగ, దుశ్శాసన ధనాదుల్లాగా,
అద్వైత ఫేసు బుక్కు సోషల్ మీడియాల్లో ఘోషయాత్రలు చేసే
అరాచకపు వాళ్ళకు ఈ మధ్య గొప్ప షాకులు తగిలాయి...

కాగల కార్యం గంధర్వులు చేశారని కార్యకర్తలనేసరికి
గ్రహణం పట్టిన చంద్రుడు మబ్బుల మధ్య మాడుతుంటే,
గ్రహణం పట్టని చంద్రుడు జలతరంగిణుల స్నానమాడుతున్నాడు...
భ్రమరావతిలో కలలు నిషేధించబడినాయి...
భాగ్యనగరిలో పుకార్ల కింద గాయపడిన నిజాలు నివేదించబడుతున్నాయి...
అక్కడ ఇంద్రప్రస్థంలో వాతావరణావతంబులు నచ్చని వాళ్ళు
మమ్మోడి తమ్మోడెనా, తమ్మోడి మమ్మోడెనా తెలియక
లక్క ఇంటికి నిప్పంటుకునే రాజకీయాల మధ్య
ద్వేషాగ్ని పాచికీలలతో జూదమాడుతున్నారు,

అమెరికా శ్యాముడు చక్రం తిప్పలేక ఏంచైనా అనుకుని
ఆ అపసవ్యసాచితో ప్రపంచ ఖాండవ దహనం మొదలెట్టగా,
విషవాయువులు విశ్వమంతా విస్తరించేసరికి
తప్పు నీదంటే నీదని తన్నుకోడం మొదలెట్టారు...
ప్రపంచ ధన్వంతరి గబ్బిలాల మీద ప్రమాణం చేసి
చావుకబురు చల్లగా చెప్పేనాటికి
వ్యాక్సీను వ్యాపారస్తుల ఆస్తుల్లో భాగమయ్యింది కర్కోటక కరోనా ...
మాస్కులు తొడుక్కో, దూరం పాటించు, కార్వంటెయినులో ఉండు,
చేతులు కడుక్కో అని, పిలాతే లా చేతులు కడుక్కున్నాక
గ్రహణం పట్టిన మామూలు, వలస గోవులు
ఎంతకాలం ఐసోలేషను బందులదొడ్లో ఉంటాయి?

అలా మొదలయ్యింది గోస యాత్ర...
మనకలవాటే కదా ఘోష యాత్రలూ, రథయాత్రలూ,
పాద యాత్రలూ, బాధయాత్రలూ...
వాళ్ళు నడిచీ నడిచీ నడిరోడ్ల మీద గుంటలు పడ్డాయి
ఇంకా వాటిని పూడ్చనేలేదు...
ఇంటికి పోయి మనోళ్ళ మధ్య చచ్చిపోదామని మనసులో పడ్డాక
వందల మైళ్ళ దూరం నడవాలని గుర్తు రాదు...
ఎట్టాగొట్టా ఇంట్లో పడితే చాలు... మజిలీలు, మజిలీలు...
మేమింతాచేసి మిమ్మల్ని కాపాడితే మీరట్లా పోయి మమ్మల్ని బద్నాం
చేస్తారా అని ప్రభుత్వాల గుర్రు...

ఈ గోసయాత్రలకిది ముగింపా లేక ఇది ప్రారంభమేనా?
ఈ భూకంపాలూ, తుఫాను వరదలూ, వైరసులూ, మిడతలూ, ఆకలీ,
పేదరికం మన ప్రారబ్దమేనా?
ప్రాయోపవేశాలూ ఆవేశాలూ తగ్గాక చేయబోయే యజ్ఞాలేమిటో...
మహాభారత యుద్ధం ప్రపంచయుద్ధం కాబోతున్నదా?

✧✧✧✧✧

# 34. వసుదేవుడు కూడా గాడిద కాళ్ళు పట్టుకున్నాడు, కానీ...

దేవకి అష్టమ గర్భాన రాత్రి మూడవ జామున
భాద్రపద అష్టమి రోజున జైలు గోడల మధ్య
నిశ్శబ్దంలో జన్మించాడు నీలమేఘశ్యాముడు,
తానూ నోరెత్తి ఏడ్వలేదు, తల్లిదండ్రులూ కిమ్మనరాదు,
కావలిభటులు నిద్రలోకి జారుకున్నారు ఏదో మత్తుకమ్మినట్లు...
అక్కడ రాజభవనంలో కంసుడు నిద్ర పట్టీ పట్టక కలత నిద్రలో కలవరిస్తున్నాడు
తన మృత్యుదూత తలను తానే తెగనరకాలనే తెగింపుతో...

అప్పుడు చప్పుడు గాకుండా అడుగులిడుచు నినుప గొలుసుల మెలుసులు వీడిన,
తాలంబులు మహోత్తాలుడైన బిడ్డనికి అడ్డంబుగాక కీలూడివీడి పడగా...
యరళంబులు విరళంబులయి సరళంబులైన మొగసాలలంగడచి...
సర్పరాజు పడగ విప్పి తట్టలో నిద్ర నటిస్తున్న జగత్ శిశువుకు గొడుగు కాగా...
మరల తలుపులు మూతపడిపోయాయి, తాళాలు వేయబడ్డాయి...
రాచనగరు కోటగుమ్మం దాటి వసుదేవుడు చూసాడు...
ఎప్పుడూ మెలకువగా ఉండే కావలి భటులు గుర్రుబెట్టి నిద్రపోతున్నారు...
అదుగో యమునా నది...
అమావాస్య చీకటిలో-- అడుగు ముందుకు వేయబోయి
ఏదో అలికిడి కాగా పక్కకు చూసాడు వసుదేవుడు...
అక్కడ ఠీవిగా నిలబడి కనుగుడ్లు పెద్దవిగాచేసి చక్రాల్లా తిప్పుతూ
పళ్ళికిలిస్తూ ఓండ్రపెట్టబోయింది గాడిద...
ఆ గార్దభరాజు ఓండ్రపెట్టితే మిగతా గాడిదలూ అరుస్తాయి,
భటులు లేస్తారు, కంసుడికి తెలుస్తుంది... అంతా తలకిందులౌతుంది...
పరమాత్మ పనిని నెత్తినపెట్టుకున్న వసుదేవుడూ ఏంచేయగలడు పాపం...!

అట్లా అని గాడిదలేమన్నా తక్కువ తిన్నాయా?
కాళ్ళు పట్టుకున్నాక కనికరించాయి... వాటి కాళ్ళబలం
తన్నులు తిన్నవాడికే తెలుస్తుంది...

అంతకు ముందు దేవకి సప్తమ గర్భపు పిండాన్ని,
యోగమాయ రోహిణీ గర్భానికి మార్చిన సంకర్షణతో - సంకర్షుడై-
బలరాముడు జన్మించి ఉన్నాడు ఆ పల్లెలో...
యమున దారి యివ్వగా, పల్లెకు చేరిన వసుదేవుడు,
బిడ్డల మార్పిడి చేయగా దేవకీ నందనుడు,
తనకు పుట్టింది కూతురో, కొడుకో తెలియనంత గాఢ నిద్రలో ఉన్న
యశోదకు తనయుడయ్యాడు.
యశోదకు పుట్టిన... ఆ యోగమాయ...
ఇప్పుడు మధురా నగరపు జైలు గోడల మధ్య
అప్పుడే పుట్టిన పసిపాపలా కెవ్వున కేకబెట్టింది...
తలుపులూ, తాళాలూ వేసినవి వేసినట్లే వున్నాయి...
లోపల ఉండాల్సినవాళ్ళూ అట్లాగే ఉన్నారు...
కబురందగానే కంసుడు మంచం మీంచీ దిగ్గున లేచాడు... కత్తి దూసాడు-

వెంద్రుకలు వీడ పై చీర వ్రేలియాడ
దాల్మి కీలూడ రోషాగ్ని దర్పమాడ
భూరి వైరంబుతో గూడి బురిటి యింటి
జాడ జనుదెంచి యా పాప జంపగదియ...

తోబుట్టువు చేతుల్లోంచీ గుక్కబెట్టి ఏడుస్తున్న పసిపాప నునులేత కాళ్ళుబట్టుకుని,
విసురుగా నేలపైనున్న బండరాతిపై విసిరిగొట్టినంత...
ఆ పసిపాప యోగమాయగా మారి నింగికెగిరి పకపక నవ్వుతూ... ఓరీ దుర్మతీ...
నిను జంపెడి వీరుడొక్క దెస సత్కృతి నున్నాడు... జాగ్రత్త
-అని మాయమయ్యింది.

..................................

అడ్డం వచ్చి ఓంద్రబెట్టబోయిన గాడిద కాళ్ళూ, గడ్డం బట్టుకుని
బ్రతిమలాడి కార్యం విజయవంతంగా నెరవేర్చాడు వసుదేవుడు, ఆనాడు.

గాడిద అర్థం చేసుకుని అడ్డం తప్పుకుంది.
అయిదు వేలేళ్ల నుంచీ మనిషికి సేవ చేస్తున్నవీ గాడిదలు...

నాలుగు కోట్ల గాడిదల్లో ఒక కోటి చైనాలోనే వున్నాయట
బరువులు మోయడమే కాదు, గాడిద మాంసం, పాలూ శ్రేష్ఠమైనవే...
హిందువుల శీతలమాత వాహనం గాడిద కాదా, పూజించబడలేదా...!

కానీ కంసుడు లాంటి అడ్డగాడిదల పరిపాలనలో అధికారం కోసం
స్వంత చెల్లెల్ని పీకల మీద కాలేసి తొక్కుతారు, కత్తులతో నరుకుతారు...
జైళ్ళలో కుక్కుతారు...

నల్లనయ్యను పుట్టకముందునుంచీ అవతారం చాలించేంతవరకూ
ఎవరో ఒకరు హత్యాప్రయత్నం చేస్తూనే వున్నారు...

ఆఫ్రికా అయినా, ఆసియా అయినా
అమెరికాకో, ఇంకెక్కడకో
బలవంతంగానో, స్వేచ్ఛగానో వలస పోయినప్పుడు
రెండో, నాలుగో వర్ణాల గోడల మధ్య
నల్లని శిశు హత్యలు నిరాటంకంగా జరుగుతూనే ఉంటాయి.
నగరాలకూ పల్లెలకూ మధ్య పిల్లల మార్పిడి జరిగినా
గోపాలురకూ, భూపాలురకూ మధ్య విభజన
యమున నల్లగా ప్రవహిస్తూనే ఉంటుంది.

ద్వాపర యుగమైనా, కలి వ్యాపార యుగమైనా
పేదల మెడ మీద స్వార్థపరుల కాలో, కత్తో ఊపిరాడనియ్యదు...

నల్లనయ్యలను ఊరు మార్పిడి చేసేప్పుడు అడ్డం వచ్చి
ఓండ్రపెట్టే అడ్డగాడిదల కాళ్ళు పట్టుకోవాల్సి వచ్చినా
మంచి పని చేసేప్పుడు నల్లని యమున దారి యిస్తుంది...
విధ్వంసం లేకుండానే తూరుపు తెలతెలవారుతుంది...

✧✧✧✧✧

# 35. ఎక్స్-పైరీ డేట్

హక్క బుక్కరాయ సోదరులు అడవికి వేటకెళ్ళారు...
తుంగభద్రానది ఉత్తుంగతరంగాల హోరుతో ప్రవహిస్తున్నది సమీపానే...
కుందేళ్ళను తురుముతూ వాళ్ళ వేటకుక్కలు మహోగ్రంగా మొరుగుతున్నాయి...
కానీ అక్కడకు రాగానే కుందేళ్ళు ఎదురుతిరిగాయి--
వేటకుక్కలు ఖంగు తిన్నాయి... ఎక్కడలేని భయం నరనరాల్లో
వ్యాపించగా తోకముడిచి వెనక్కి తగ్గాయి...

ఈ విషయాన్ని గురుదేవుడు విద్యారణ్యస్వామికి చెప్పారు వాళ్ళు...
అదే అచ్చోటనే ఆరోజుల్లో బీజింగ్ తర్వాత ప్రపంచంలో పెద్ద నగరమైన
హంపి నగరానికి... పాలు పొంగించాడు విద్యారణ్యుడు...
పాలు పొంగిన తీరును చూసి పలికాడు-- ఈ నగరం,
ఈ విజయనగర సామ్రాజ్యం- ఆయుష్షు-- రెండువందల ముప్పైయేళ్ళు
(1336-1566)...

ధాన్యపు సంచుల్ని మోసుకువస్తున్న ఎడ్లబండి-
చక్రం దిగబడి మట్టిలో కూరుకుపోయింది...
ఆ చక్రాల కింద బయటపడింది- స్వయంభూ శివలింగం- దాని చుట్టూరా
వెలసింది అత్యద్భుతమైన వరంగల్-ఓరుగల్లు కోట.
ముత్యాలు, రత్నాలు గుట్టలుగా వీధుల్లో అమ్మిన నగరం,
365 శివాలయాలున్న నగరం, కోహినూర్ వజ్రాన్ని భద్రకాళి దేవత
ఎడమకన్నుగా ఇచ్చిన సాటిలేని నగరం- (1190?-1323) ఆయుష్షు
సుమారు నూటముప్పై యేళ్లు-

సముద్రాన మునిగిన ద్వారక, గ్రీకుల-అట్లాంటిస్, ఆఫ్రికా-జింబావో కోట,
కుబ్లయిఖాన్-గ్జానాడు, సింహళ-సిగిరియా, రోమన్ల లెప్టిస్‌మాగ్నా,
వైకింగుల-విన్లాండ్, ఈజిప్టుల-సముద్రంలో మునిగి ఉన్న హెరాక్లియాన్,
కొలంబియా-లాసి యుడాడ్ పెర్డిడా, హోండూరాస్ అడవుల్లో-

వానరదేవుడి శ్వేత నగరం... ఆ కాలాల్లో ఎంత గొప్పవైనా వాటి
ఎక్స్పైరీడేట్ కాగానే కాలగర్భంలో కలిసిపోవాల్సిందే... కలిసిపోయాయి...

బోస్టన్, కార్థేజ్, ఇస్తాంబుల్, బెర్లిన్, బీజింగ్, ప్రాగ్, వారణాశి, ఏథెన్స్.
అలెగ్జాండ్రియా, కుస్కో, నగరాల్లో కొన్ని చరిత్ర పుటల్లోనే కనబడతాయి...
జెరికో-7000 బిసి, ఉరుక్-3500 బిసి, మారి-2400 బిసి,
ఉర్-2100 బిసి. బాబిలోన్-700 బిసి, కార్థేజ్-300 బిసి,
రోము-200 ఏడి, న్యూయార్క్-1924-ఏడి, టోక్యో-1968 ఏ.డి...
ఇవి మహానగరాలు కాలరేఖపై...

మన కళ్ళముందే బాంబుల, అణుబాంబుల దాడికి బూడిద కుప్పలై
ఎక్స్పైయిర్ అయిన నగరాలు... మళ్ళీ కోలుకుని బతుకుతుంటే ప్రతి పల్లె
ప్రతి నగరం ప్రతి జీవితం ఈ మానవ అగ్ర అహంకారపు మంటల్లో
మాడి మసై... మట్టిలో కలవడానికా ఈ తొందర?
నేర్చుకోరా చరిత్ర పాఠాలు?

ఈ మార్గంపై నడక కత్తి అంచుపై నడక...
ఇప్పుడు యుద్ధాలొస్తే ఏదీ మిగలదు, ఎవ్వరూ మిగలరు
ఎక్స్పైరీ డేట్ దగ్గరబడుతోంది- జాగ్రత్త! బహు పరాక్!

ఉత్తిష్ఠ జాగ్రత! ప్రాప్యవరాన్ నిబోధత!
క్షురస్య ధారా నిశిత దురత్యయా
దుర్గం పథ స్తత్వయో వదంతి!

✧✧✧✧✧

# 36. తిండిపోతు లెక్కలు...

ఏడువందల ఎనభై కోట్ల జనం
ఆకలి గంట కొట్టగానే ఆవురావురమని ఏది దొరికితే దాన్ని తినడం...
ఎక్కడా నిలకడ ఉండదు ఆ ఆత్మారాముడు శాంతించేంతవరకూ...
ఏ ఫుడ్ కోర్టూ ఖాళీగా ఉండదు...
ఈ దృశ్యం మారింది చూడు అటువేపు-

ప్రతి పది సెకండ్లకు ఒక పసిప్రాణం గాలిలో కలిసిపోతుంది
ఆకలి భూతానికి ఆహుతై...
వంద కోట్లమంది అర్థాకలితో. రెండు వందల కోట్లమంది
పోషకాహార లోపంతో...
అణుబాంబులు కాదురా కాస్త అన్నం పెట్టండిరా అని
వాళ్ళు ఆశగా చూస్తున్నారు అంగళ్ళ వైపు...
మిడతలు తినేయగా మిగిలిందీ, మిడతల్నీ పట్టుకు తినాలన్నా
సత్తువ చాలదిక్కడ...
ఈ బక్కచిక్కిన దృశ్యం చూడబుద్ధి కాదు...

మిగతా అదృష్టవంతులైన అయిదు బిలియన్ల జనం భోజనం కోసం...
మూడు బిలియన్ల జంతువులు ప్రాణత్యాగం చేస్తున్నాయి ప్రతిరోజూ...
జలచర, భూచర, ఖేచర... చలించేదేదైనా భోజనయోగ్యమే ఈ మనిషికి...
సంవత్సరానికి 7200 కోట్ల భూచరాలూ, లక్ష కోట్ల జలచరాలూ
వంటగదుల్లో వంటకాలై నోరూరించి వాతాపి జీర్ణమై పోతుంటాయి...
అరవై బిలియన్ల కోళ్ళూ, వంద బిలియన్ల చేపలూ, ఒకటిన్నర బిలియను
పందులూ, రెండు బిలియను బాతులూ,
ఒక బిలియను కుందేళ్ళూ, అర బిలియను టర్కీలూ, గొర్రెలూ, మేకలూ
ఒక బిలియను, ఆవులూ, గేదెలూ ఓ అర బిలియను, గుర్రాలూ, గాడిదలూ,
ఒంటెలూ ఓ పది మిలియన్లు... గుటకాయ స్వాహా...

ఇవికాక ఎగిరే పావురాలూ, ఊరపిచ్చుకలూ, అడవి బాతులూ,
కొంగలూ, నెమళ్ళూ,
నీళ్ళలో ఈదే చేపలూ, రొయ్యలూ, ఆక్టోపసులూ,
ఇంకా నత్తలూ, పీతలూ, పాములూ, తేళ్ళూ, ఎలుకలూ,
తొండలూ, సమస్త కీటకాలూ
గబ్బిలాలూ, పిల్లులూ, కుక్కలూ, అడివిపిల్లులూ,
పులులూ, సింహాలూ, ఏనుగులూ....
ఒక ట్రిలియన్ గుడ్లూ...
ట్రిలియన్ల దుంపలూ, ఆకులూ, అలములు,
పూలూ, కాయలూ, ఫలాలూ, గింజలూ...
అనుపానంగా... నలభై బిలియను లీటర్ల బీరు–విస్కీ–మధు పానీయాలూ,
ఆరు ట్రిలియన్ల సిగరొత్తులూ, అశేష జరదా సరదాలూ... పానుపరాగులూ..

తిని అరగక యుద్ధాలూ, కనిపించకుండా చంపడానికి
జీవాయుధాలుగా కరోనా వైరసులూ...
తిండిపోతులు... ఛీ!

✧✧✧✧✧

# 37. గోడల యుద్ధాలు...

గోడల యుద్ధాలు...
అత్తా-కోడళ్ళ యుద్ధాలకన్నా ప్రాచీనమైనవీ,
భౌతిక, మానసిక, ఆర్థిక, దైవిక నష్టాల్ని కలిగించే
ఈ గోడల యుద్ధాలు చాలా ప్రమాదకరమైనవి కూడా...
మనకు బాగా... డబ్బూ, జ్ఞానం ఎక్కువయ్యాయని భ్రమ కలిగినప్పుడు
మన చుట్టూ గోడలు పకడ్బందీగా...

క్రీస్తుపూర్వం 2100 కాలంలో అప్పటి సుమేరియన్ల దేశపు రాజులు,
యూఫ్రటిస్-టైగ్రిస్ నదుల మధ్య (ఇప్పటి ఇరాక్) కట్టారు
ఓ వంద మైళ్ళ గోడ- అమొరైట్ల దాడుల్ని తట్టుకోడానికి...
వందేళ్ళలో గోడా, సామ్రాజ్యం రెండూ పోయాయి...

క్రీస్తుపూర్వం 461లో ఏథెన్స్ ప్రజలు కట్టుకున్న గోడను
ముందు స్పార్టన్లు, ఆనక రోమన్లూ నేలమట్టం చేసారు...
రక్త వర్ణ సర్పం, గ్రేట్ వాల్ ఆఫ్ గార్గన్, అలెగ్జాండర్ బారీర్ 121 మైళ్ళ గోడ
కాస్పియన్ సముద్రం నుంచీ ఎల్-బుర్జ్ పర్వతాల వరకూ పర్షియన్ల నిర్మితం-
ఇప్పటి ఇరాన్‌లో- ఇదీ హూణుల్ని ఆపిన దాఖలా లేదు...

బార్బేరియన్ల, పిక్ట్‌ల దండయాత్రల నాపడానికి ఆనాటి ఇంగ్లాండ్‌లో
రోమన్లు కట్టిన 73 మైళ్ళ హ్యాడ్రియన్ గోడ,
ఆంటోనియన్ గోడ- ఇప్పుడు చూడవచ్చు శిథిలాలుగా...

గోడలు, పర్వతాలూ అన్నీ కలిపి 13171 మైళ్ళుండి
క్రీస్తుపూర్వం 300 నుంచి పదిహేడవ శతాబ్దం వరకూ
కడుతూనే ఉన్న ప్రఖ్యాత- పదివేల మైళ్ల చైనా గోడ-

కాన్-స్టాంట్-నోపుల్ గోడ, సిగ్గుపడాల్సిన గోడగా పిలువబడిన-
వాల్ ఆఫ్ షేం--బెర్లిన్ గోడ,
మా అద్వితీయమైన వరంగల్ కోట గోడ,
కంప్యూటర్లలోని ఫైర్‌వాల్- నిప్పు గోడ...

మనకున్న వారసత్వ కుల, మత, వర్ణ, వర్గ గోడలూ,
మరోనా అంటూ ఎగేసుకువచ్చిన కరోనా మాస్కు గోడలూ...
ఇవి చాలదన్నట్లు ఇప్పుడు కొత్త కోడలొచ్చినట్లు కొత్త గోడలొచ్చాయిఇ
మనకు బాగా... డబ్బూ, జ్ఞానం, జబ్బూ, ఎక్కువయ్యాయని భ్రమో,
భయమో కలిగినప్పుడు మనచుట్టూ గోడలు పకడ్బందీగా కావాలిగా...

ఇప్పుడీ ఫేస్‌బుక్ వాల్ యుద్ధాలు... ముఖపుస్తకపు గోడలు...
రకరకాల గ్రఫితీలూ, గోడ మీద రాతలూ, నీతులూ నీళ్ళమీద
రాతలకన్నా వేగంగా చెరిగిపోతున్నా
గోడ హక్కులూ, దురాక్రమణలూ, న్యాయాన్యాయ విచారణలూ...
గ్రూపులూ, స్వేచ్ఛా స్వాతంతర్య పోరాటాలూ,
వామ్మో! ఇది కలా లేక పీడకలా?

నీ గోడ మీద నీవేమైనా రాసుకో... అంతేకానీ...
నా గోడ మీద నీ పిడకలా? ఎంత ధైర్యం నీకు?

✧✧✧✧✧

# 38. మనసన్నది... వెళ్ళి ఆ మేఘ శకలాన్ని కోసుకురా...

నల్లటి మబ్బును తడమగానే చల్లటి నీళ్ళు
చేతుల్ని శుభ్రించిన నీటిబిందువులు
ముత్యాల్లా మెరుస్తుండగానే
దాపులనే ఉన్న శీతాంశుడినుంచి
దోసెడు నవ్వుల్ని నింపుకుని ముఖాన పులుముకున్నాను
ఇల్లంతా వెన్నెలే...

దూరంగా అక్కడ చీకట్లో కొందరు అపరిచితులు
మాటల్ని చితిమంట చేసి చలికాచుకుంటూ...
సున్నితపు త్రాసులో పాత జ్ఞానాన్నీ కొత్త సైన్సునూ సరితూచి
అణుమానపు కొలిమిలో ముడి భేదాల్ని కొత్త సత్యంగా రసవాదిస్తున్నారు...
అక్కడంతా అనుమానపు గాయాల నిప్పురవ్వలే...
డార్విన్ బలవంతుడిదే భవిష్యత్తనేది నిజమయితే
భూతల స్వర్గమింకెక్కడ, అంతా భూతాల నరకమే కదా బలహీనులకు!
ఇల్లంతా మనమే అయితే తలుపు తడుతున్న జోంబీలెవ్వరు?...

బహుశా పిడివాదాల పిడికిలిలో పీడితులైన వాళ్ళు కాబోలు
తెలుపునలుపు రేఖల మధ్య చల్లారని చిచ్చులో మిథ్యా స్వర్గాల
భ్రాంతుల్ని తడుముతున్నారు...
పదివేల యేళ్ళలో ప్రతి శతాబ్దాంతానికి నైతికంగా మరింత పతనమై
డబ్బు పువ్వుల వ్యామోహంలో ప్లాస్టిక్కు మొహాల తోట...
కాసింత విషగాలి సోకగానే ఎప్పటినుంచో ఎదురు చూస్తున్నట్లు
తాము ఏర్పర్చుకున్నన కంచెల్ని గొడుగుల్ని కాల్చేసి
కొత్త వ్యవసాయం చేసేందుకు ఆరాటం...

తమ చేతికి రాజదండం రాగానే- వోడలు బండ్లూ... బండ్లు వోడలూ...
ప్రతీకారాలూ... రణార్థులూ-శరణార్థులూ...
వలసలూ-రక్తసిక్త రహదారులూ...

ఇప్పుడు నీకూ నాకూ మధ్య ఏమీ లేదన్న భ్రమ వాస్తవమే
ఏదో ఒకరోజు రాగానే నేనూ నువ్వూ పాత జ్ఞాపకాలు తవ్వుకుని
ఒకర్నొకరు పాతిపెట్టుకుంటాం...
ఎట్లాగూ ఎర్ర డ్రాగను తన అడుగుల్ని అన్ని దిక్కులా విస్తరిస్తోంది...
గద్దలూ, ఎలుగుబంట్లూ, సింహాలూ, నెమళ్ళూ వర్ణాల గీతల జ్వాలల్లో
కాలిపోతూ అసహాయమైనాక
ఆఖరి అణు-అస్త్రాలు పేల్చి శాశ్వత బంకర్లలో తలదాచుకుంటున్న రోజున
ఏమీ మిగలదన్న వాస్తవాలు
మానవజాతి చితాభస్మకలశంపై లిఖించబడిన ఆఖరి అక్షరాలవుతాయా!

మనసన్నది... వెళ్ళి ఆ మేఘ శకలాన్ని కోసుకురా...
నల్లటి మబ్బును తాకగానే సలసలా కాగుతున్న నీళ్ళు
బొబ్బలూ, కెవ్వున కేకపెట్టి బొబ్బలెక్కిన అరచేతులు
అగ్నిపర్వతాల్లా విస్ఫోటిస్తుండగానే
దాపున ఉన్న ఎర్రబడ్డ ఉష్ణాంశుడి చంద్రనిప్పుల బూడిద నుంచీ
దోసెడు దుఃఖాన్ని నింపుకుని ముఖాన పులుముకున్నాను...
ఇల్లంతా కాళ రాత్రే...

మనసన్నది...వెళ్ళి ఆ మేఘ శకలాన్ని కోసుకునిరా... వెళ్ళగలనా?
వెళ్ళి శాంతి లేపనాన్ని తెచ్చి గాయపడ్డ చేతుల్ని బుజ్జగించగలనా...
అంతదాకా కన్నీళ్ళతో కడుగు కమిలిన హస్తాల్ని...
వెళ్ళి ఆ మేఘ శకలాన్ని, చంద్ర జనిత ప్రేమ వెన్నెలనీ కోసుకునిరా...

✧✧✧✧✧

# 39. అలిగిన వేళనె చూడాలీ...

ఇన్ని లక్షల కోట్లూ ఖర్చుబెట్టి
దేహాల్నయితే క్వారంటెయిన్లో ఉంచగలిగారు కానీ,
స్వేచ్ఛను కోరే మనసుల గుటక పడని కోర్కెలకూ...
మృత్యు సందేశాల సందేహాలకూ సమాధానాలివ్వకబోయేసరికి
జల్లెడలోంచీ ఇసుక జారిపోయినట్లు
ఐసోలేషను శిబిరాలు ఖాళీ అయిపోయాయి,

వలసదారుల కాలి బొబ్బలకు
కొత్త పూనకాలు మొదలయ్యేసరికి
తలలు పట్టుకున్న ప్రభుత్వాలు
కోపించిన దధీచి, శిబి, దానకర్ణుల్లా మూతులు ముడిచాయి...
నిత్య శంకితులు,
ఎప్పుడూ ప్రభుత్వాలను తిట్టకుండా నిద్రపోలేని వాళ్ళూ
తమకు దగ్గొచ్చినప్పుడల్లా ప్రభుత్వాల అసమర్థ నిర్వాకాల్ని
ఎండగడ్తున్నారు...

సమన్వయ లోపాల్ని బుల్లితెరల మీద బురద జిమ్మేందుకు చూపే
ఉత్సాహంలో వందవ వంతు
ఎవరూ ఊహించని ఉత్పాతపు విధ్వంసాలొచ్చినపుడు
తట్టుకునే చర్యల్ని ఉమ్మడిగా చేసుంటే
ఆపదలో అందరూ ఒకటిగా ఉంటారన్న భావనకు బలం చేకూరేది...
శకలాలుగా విడిపోయిన ఈ సమాజ దేహం ఇప్పుడో శిథిల గృహం!
బాగుచేద్దామనుకున్న ముతామేస్త్రీలకు యిసుకా, సిమెంటూ
దొరక్కపోయేసరికి విసుగూ కోపం రెండూ వచ్చాయి...

జనంతో క్రిక్కిరిసిన బస్సును
ట్రాఫిక్కు జామయ్యే సమయంలో నడుపుతున్న డ్రైవరు పరిస్థితి
ప్రభుత్వాలదీ, అధికారులదీ...
ఆకలిదారుల్లో, పరాయి ఊళ్ళల్లో చచ్చి పోవడంకన్నా త్వరగా ఇంటికి
పోవాలన్న తపనతో బస్సుకడ్డం పడుతున్న బడుగు జీవులదీ...
అప్పుల ఇటుకతో కట్టబడి, క్రెడిట్ డెబిట్ కార్డ్ ద్వారాలూ, కిటికీలున్న
కలల ఇళ్ళు కూలిపోగా రేపేంచేయాలో తెలియని నిరు, చిరుద్యోగులదీ...
లాగితే తెగే సన్నని దారంతో చేయబడ్డ హారంలా ఈనాటి పరిస్థితీ...
హారను కొడుతున్నా దారికడ్డం వస్తుంటే రథ సారథులకు కోపం వచ్చింది...

అక్కడ సమావేశపు ఆవరణలో పదీ-పన్నెండు గొంతులు
అరుస్తున్నాయి ఆగ్రహంతో, ఒకే శృతిలో...
వాళ్ళ ముఖాలలో కొట్టవస్తున్నట్లు ఏదో మార్పు...
ఇప్పుడా ముఖాల్లో ఏ తేడా లేదు... అన్నీ ఒకేరకంగా...
ట్వంటీ-ట్వంటీ-ఆట... ఆడేవాళ్ళు బాగానే ఉంటారు...
చూసేవాళ్ళే గ్రూపులుగా చీలిపోయిన కొట్టుకు చస్తారు...
వద్దనకు... అలుగుతారు... వాళ్ళూ-వీళ్ళూ...

✧✧✧✧✧

# 40. వేలి మీద గోరు మొలిచింది...

వేరు పోదాము రారా వె(్రి మొగుడా అందట వాళ్ళావిడ...
ఎక్కడకు పోతావవ్వా ఈ వీధికీ ఆ వీధికీ మధ్య కరోనా రెడ్ జోన్ ఉందికదా!
అయినా లేడికి లేచిందే ప్రయాణమన్నట్లు, ఉండుగమ్మున అన్నాడతడు...
...ఆ ఉంటాలే గమ్మున... వట్టి గొడ్డుకు అరుపులు మెండు, వరపుటేటికి
మెరుపులు మెండు... అని, లక్షణాలు గల బావగారికి రాగి మీసాలు-
అవలక్షణాలుగల బావకు అవికూడా లేవంట...హుం..." -అందావిడ...

ఏమిటే నీ గోల? పిండి బొమ్మను చేసి పీట మీద కూర్చుండబెడితే
ఆడబిడ్డతనాన అదిరదిరి పడిందని- చేతులు శుభ్రంగా కడగడం
నేర్చుకో నన్ను తర్వాత కడుగుదువు కాని... అన్నాడా పార్థుడు.
ఎందుకు కడగనూ... ముద్దులు గులకరా ముదిపెండ్లికొడుకా అంటే,
పెండ్లికి వచ్చిన పేదపేరంటాల్లందరూ నా పాత పెండ్లాలన్నాడట
నీలాంటోడు... అన్నదా సుభద్ర...

ఇదిగో, ఈ మాస్కుల్లో తన్నులాట ఏమిటి? నీలాంటిదే ఓ ముసలమ్మను-
బుర్రూపుతున్నావెందు కదేపనిగా అంటే ఊరకే తినికూర్చోడం మా ఇంటా
వంటా లేదందంట... నన్ను తిట్టి నువ్వేడుస్తున్నావెందుకే, వామ్మో?
ఏడుపుగాక ఏముందిక్కడ- ఓ ముద్దా ముచ్చటా! అయినా ఇంటిదీపమని
ముద్దు పెట్టుకుంటే, మూతిమీసాలన్నీ కాలాయని... దుష్ట కరోనా పేరుచెప్పి
అన్నిటికీ దూరమాయె కదరా దేవుడా!....

అడివి ఉశిరిక కాయి సముద్రపు ఉప్పు కలిసినట్లు, కలిసి మనిద్దరం...
క్వారంటెయినులోనూ బాగానే టిక్కు టాక్కులు చేసాము... అంగట్లో
అన్నీ ఉన్నాయి అల్లుడి నోట్లో శనిలా ఉంది మన పరిస్థితి...
అన్నాడతడు హాయిగా నవ్వుతూ...
ఆశపడి ఆరు లంఖణాలు చేస్తే ఆ వేళా జొన్న మెతుకేనా అన్నట్లు...
ఇరు పోటీల ఇల్లు చెడును, వాతమొస్తే వొళ్ళు చెడును... అని కష్టకాలంలో
కాసేపు పోట్లాడుకున్నా నాకు నువ్వూ, నీకు నేనే కదా నేస్తుడా-
...అన్నదామె వెన్నెలలు కురిపిస్తూ...

✧✧✧✧✧

# 41. సబ్బు నీటి బుడగలు...

ఒక కప్పు దేశభక్తీ, ఆరు కప్పుల ఆవేశం,
ఒక చెంచాడు గ్లిజరీనూ చాలు...
కెమేరా కళ్ళముందు సబ్బునీటి బుడగల్ని సరిహద్దుల వద్ద
శాస్త్రోక్తంగా ఎగరెయ్యడానికి...
మనిషితనం ఘనీభవించిన మంచు మైదానాల మీద
ఎవరి గీతలు వాళ్లవి...
అటునుంచి ఇటునుంచీ బుడగలు, బుడగలు...
గీతలు లేనిచోట్ల గీతారహస్యంతో పనేముంది?
యుద్ధతంత్రం నమ్మిన వాళ్ళకు శాంతిసూక్తం రుచిస్తుందా?

సన్–జు, తావో, కన్‌ఫ్యూసియస్ చెప్పిందీ యెలా యుద్ధం చెయ్యాలో...
శ్రీకృష్ణుడు చెప్పిందీ అదే, యెందుకు యుద్ధం చెయ్యాలో...
శాంతి పర్వాలనెవరూ చదవరు...
వాళ్ళకూ మనకు దాదాపు ఒకేసారి స్వాతంత్ర్యమొచ్చింది...
అక్కడ వ్యక్తి కన్నా సమాజం గొప్పది...
ఇక్కడ సమాజంకన్నా వ్యక్తులు, ఆచారాలు, కుల గౌరవాలూ,
మతచిహ్నాలూ, రథ పాద యాత్రలూ, పాదుకా పట్టాభిషేకాలూ,
వారసులకు కిరీటాలూ, వెట్టిచాకిరీలూ, బాబాలూ, భజనలూ...
ఇంకా... ఇంకా... ఇవన్నీ గొప్పవి....
ఎవరి పవిత్ర గ్రంథం వాళ్ళు పట్టుకుని కొట్టుకుంటారిక్కడ...

అక్కడ పార్టీ నియమావళిని రాజదండంగా పట్టుకుంటాడా ప్రధాన వ్యక్తి...
ఇక్కడ అఖండ దేశ స్వప్నాన్ని కాగడాగా పట్టుకున్నాడీ ప్రధాన వ్యక్తి...
అదొకరకం ఎర్రకోట... ఇదొకరకం ఎర్రకోట...
ఇద్దరూ బిలియన్ల జనబలం కలిగి
అణు బక్కెట్ల నిండా భారజలం పోసి
ఊదుతున్నారు సబ్బు బుడగల్ని...

అటు మొన్నటి శాంతి బుడగ భాయీ–భాయీ అంటూ మంచుకొండల్లో పేలిపోయింది...
నిన్నటి శిఖరాగ్ర రంగుల బుడగ మామల్లపురంలో మలిగిపోయింది...
బౌద్ధం పుట్టిన చోటా, బౌద్ధం పెరిగినచోటా శరణమని పలికేవారు శరణార్థులైనారు...
ఇచ్చి పుచ్చుకుని సఖ్యంగా ఉండకుండా... బిగ్ బ్రదర్స్ ఇద్దరూ...
అణు బక్కెట్ల నిండా సైన్య భారజలం పోసి
ఊదుతున్నారు సబ్బు బుడగల్ని...

పరాయి బుడగలు పేలుతున్నపుడు చూడటానికి బాగానే ఉంటాయి...
భీకరమైన రణాన్నినాదాల మధ్య, మందుగుండు పాతరల విస్ఫోటనాల మధ్య,
రివ్వున దూసుకుపోతున్న తుపాకి గుళ్ళ మధ్య, రక్తసిక్తమైన మంచుకొండల మధ్య...
...నువ్వే ఆ బుడగవై మంచు లోయల్లో పడిపోతూ పేలి...

అమ్మా, రక్షించు ఈ మానవ బుడగల్ని...

✧✧✧✧✧

# 42. అవునూ మీకేమని అనిపిస్తుంది?...

ఏమనిపిస్తుందా... ఇదుగో... ఇది ఇండియా–చైనా బోర్డర్...
సంభాషణలతో, లౌక్యంతో పరిష్కరించాల్సిన తగాదాల్ని...
రాజకీయ జీవచ్ఛవాలు డెబ్భై మూడేళ్ళుగా శిఖరాగ్రాన నిలబడి.
రావణ కష్టాల్ని నిర్విరామంగా కాలుస్తూనే ఉన్నారు...
ఇలాంటివే దేశం చుట్టూరా గీసి గీయని గీతలు గీసి,
ఎప్పటికీ మానని గాయాలతో యువ రక్తాన్ని జిమ్ముతుంటారు...

ప్రతిరోజూ బుల్లెట్లు తింటాం మేమిక్కడ...
మీరక్కడ మా పాత ఫోటోల్నీ మీ పైత్యాన్నీ క్లోజప్పులో చూపించి
కన్నీళ్ళ, సానుభూతి రే–టింగురంగా–ల్లా రెచ్చిపోయి అడుగుతుంటారు...
మీకేమని అనిపిస్తుందీ అని?...
అవునూ మీకేమని అనిపిస్తుంది ఇటువంటి ప్రశ్నల్ని అడిగేప్పుడు?

శీతల పేటికలో, యుద్ధ దుస్తుల్లో, పూల దండల మధ్య...
మేము నిశ్శబ్దంగా శాశ్వత నిద్దరోతున్నపుడు...
ప్రకటిత మేధావులతో ఇంటి సరిహద్దుల గురించి ఇప్పుడు చర్చిస్తారా?
మా భార్యాబిడ్డల్ని పిలిచి వాళ్ళ ధైర్యం, దేశభక్తి గురించి, మా మీద ప్రేమ
గురించి కొత్త వాక్యాల్ని పలికిస్తారా?
మరుసటి రోజున ఎలాగూ మరచిపోతారు కదా మమ్మల్ని మీరు...!
అవునూ మీకేమని అనిపిస్తుంది ఇటువంటి ప్రశ్నల్ని అడిగేప్పుడు?

ఇంకా కరోనా భయం తగ్గనే లేదు?
ఇప్పుడీ యుద్ధ భయం...
ప్రపంచ పాలకులకు... వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికి యుద్ధమొక ఎత్తుగడ...

ఈ యుద్ధాలలో అందరూ మాస్కుల వెనకే ఉంటారు... చేతులు కడుక్కుంటూ..
బోర్డర్ల దగ్గర కొద్దికాలం భౌతిక దూరం పాటించినట్లు నటిస్తారు...
దుర్భర విరామం తరువాత ఫిరంగులు పేల్తాయి...
దేశభక్తి గీతాలు మార్మోగుతాయి...
దేవతల పేర్ల మీదున్న అస్త్ర శస్త్రాలు అణుమానపు గుహల్లో మొహరిస్తాయి...
అవకాశవాదపు నక్కలు అర్ధరాత్రి ఆపకుండా ఊళలు వేస్తాయి...

ముందు వరసలో నిలబడ్డ వీరులు బుల్లెట్లు తిని చెక్కపెట్టెల్లో ఇంటికి వస్తారు గౌరవ వందనాల మధ్య...
గుండెలు చెరువై, కన్నీళ్ళు ఏరులై ప్రవహిస్తున్నపుడు...
అవునూ మీకేమనిపిస్తుంది ఇటువంటి ప్రశ్నల్ని అడిగేప్పుడు?

✧✧✧✧✧

# 43. ఎనిమిది కాళ్ళ పల్లకెక్కి యేడబోతివి నాయనా...

ఎనిమిది కాళ్ళ పల్లకెక్కి యేడబోతివి నాయనా...
కట్టెపుల్లల మంచమెక్కి కాలిపోతివి న్యాయమా...

అందమైన జీవితములో అమ్మ నుదుటి బొట్టువైతివి,
ఎదురు కాళ్ళతో నేను పుట్టగ ఎత్తుకుని ముద్దు చేస్తివి
ఉయ్యాలల్లో నన్ను ఊపి ఊసులెన్నో చెప్పుకుంటివి,
అమ్మ ఒడిలో నన్ను చూసి చందమామగ మురిసిపోతివి...

ఎనిమిది కాళ్ల పల్లకెక్కి యేడబోతివి నాయనా...
కట్టెపుల్లల మంచమెక్కి కాలిపోతివి న్యాయమా...

వెల్లకిలా నేను పడితే వెంటనున్న మెత్తవైతివి,
బోర్లబొక్కల నేను పాకితె బోలెడంత నవ్వువైతివి,
బుడ్డిబుడ్డి అడుగులేస్తే బుట్టబొమ్మలా ఉబ్బిపోతివి,
అమ్మ చంకలొ నన్ను చూసి కమ్మకమ్మని కలలు గంటివి.

ఎనిమిది కాళ్ల పల్లకెక్కి యేడబోతివి నాయనా...
కట్టెపుల్లల మంచమెక్కి కాలిపోతివి న్యాయమా...

కలిగినూళ్ళో బడులు నచ్చక కాన్వెంటులో చేర్చినావు,
ఉన్న చెలకల నమ్మి నన్ను ఉన్నతంగా దిద్దినావు
సాఫ్టువేరు చదువు చదివి సాగరాలను దాటిపోతిని...
తల్లి వేరును మరచి నేడు తల్లడిల్లుతు వాపోతిని...

ఎనిమిది కాళ్ల పల్లకెక్కి యేడబోతివి నాయనా...
కట్టెపుల్లల మంచమెక్కి కాలిపోతివి న్యాయమా...

కలల నగరపు బేహారిగా కన్నవాళ్ళను మరచినాను
ప్రోగ్రాములెన్నో రాసి రాసి పోగు చేసితి డాలర్లను...

ప్రేమలోపడి ఆనక పెండ్లి ఫ్రేములో చిక్కినాను
నాకు కూడ కొడుకు పుట్టగ నాన్నా అమ్మా రమ్మన్నాను...

ఎనిమిది కాళ్ల పల్లకెక్కి యేడబోతివి నాయనా...
కట్టెపుల్లల మంచమెక్కి కాలిపోతివి న్యాయమా...

నాకూ నా పిల్లలకు మిమ్ము నానీలుగ నే చూసినాను,
మీ స్వేచ్ఛ విలువను మరచి మిమ్ము పంజరంలో పెట్టినాను,
ఉన్న నాళ్ళు ఉండి మీరు ఊరికెలా వెళ్తున్నారని...
అమ్మని నిన్నూ వేరు చేసి నమ్మకాన్ని వమ్ము చేస్తినని...

ఎనిమిది కాళ్ల పల్లకెక్కి యేడబోతివి నాయనా...
కట్టెపుల్లల మంచమెక్కి కాలిపోతివి న్యాయమా...

నీవులేని యింటిలోన తా నిలువలేని అమ్మ కన్నీటిని
ఇంతలో నే వచ్చి చచ్చిన ఈ కరోనా మహమ్మారిని,
లెక్క చెయ్యక అమ్మ నీకై రెక్కలు కట్టుక వసున్నదని...
తెలిసి నీవూ ఆగకుండా తెల తెల్లవారే వెళ్ళిపోతివి...

ఎనిమిది కాళ్ల పల్లకెక్కి యేడబోతివి నాయనా...
కట్టెపుల్లల మంచమెక్కి కాలిపోతివి న్యాయమా...

చివరిసారిగ నిన్ను చూస్తిమి వాట్సప్పులో చిత్రమై
కడసారిగ నిన్ను కంటిమి కాలరేఖలో దూరమై,
అగ్నిజ్వాలల వెలుగులో అదృశ్యమైన రూపమై,
అమ్మ మౌనపు భాషలోన అపురూపమైన కావ్యమై...

ఎనిమిది కాళ్ల పల్లకెక్కి యేడబోతివి నాయనా...
కట్టెపుల్లల మంచమెక్కి కాలిపోతివి న్యాయమా...

✧✧✧✧✧

# 44. పట్టుకుంటే పదివేలు...

కదా ఫేస్‌బుక్‌లో అయితే అయిదువేల లిమిట్ ఏమిటని
లైకు, కామెంటు, షేర్ కొలతల కరువుతో కొట్టుమిట్టాడుతున్న
వారు విజ్ఞప్తి చేస్తున్నారు...
నిజానికి పదివేళ్ళమీద లెక్కబెట్టగలిగిన మంచి స్నేహితులు చాలు కదా
పదివేల హితులేల?

చైనా వాళ్ళకు పదివేలంటే చాలా ఎక్కువని అర్థం...
చైనా గోడను పదివేల మైళ్ళ గోడ అని పిలుస్తారు...
మీరు వచ్చారు మాకదే పదివేలు అంటాము మనం...
ఏ పనైనా పదివేల గంటలు ప్రాక్టీసు చేస్తే పర్‌ఫెక్ట్ అవుతామట...
అందుకే డిగ్రీ కోర్సులన్నీ మూడు సంవత్సరాలుంటాయి...

పదివేల సరస్సులున్న నేల– మిన్నెసోటా
పదివేల పొగలొచ్చే లోయ... అలాస్కా
పదివేల దారులతో సరస్సులని కలిపేది... టెన్నెస్సీ-కెంటకీ ల మధ్య దూరమూ...
పదివేల ద్వీపాలున్న చోటు– ఫ్లోరిడా–పూల లోగిలి...
పదివేల పేర్లున్న దేవత– ఐసిస్...
పదివేల పర్షియన్ అమర సమూహమూ,
పదివేల సైన్యంతో ప్రవక్త మక్కా స్వాధీనమూ...
పదివేల దినాల వియత్నాం యుద్ధమూ...
పదివేల మంది గ్రీకు సైనికులతో క్జెనొఫోన్ కవాతూ...
పదివేల మీటర్ల పరుగు పందాలూ,
పదివేల విషయాలు–టావోయిజపు భావనలూ...
పదివేల వాగ్ధానాలూ, పదివేల స్వప్నాలూ...
పదివేల ధిక్కారాలూ, పదివేల నినాదాలూ...
పదివేల మాస్కులూ, పదివేల పరీక్షలూ,
పదివేల కానరాని చిరునవ్వులూ...

నిజానికి పదివేళ్ళమీద లెక్కబెట్టగలిగిన మంచి స్నేహితులు చాలు కదా
పదివేల లైకులేల?
పదివేల తుపాకులేల?
పదివేల నమస్కారములు మీకు...

✧✧✧✧✧

# 45. ఒక ఫ్యానూ ఒక తాడూ ఒక మెడా

ఎక్కడో ఒక తప్పు  ఒక వాక్యాన్ని మింగివేసింది...
ఒక ఊపిరి దేహం లోపల గిలగిల లాడింది...
ఒక స్వప్నం పూర్తికాకమునుపే చెదరగొట్టబడింది...
ఒక ప్రహేళిక జవాబు కనుక్కోక ముందే చెరిపివేయబడింది...

మాస్లో పిరమిడ్లో అవసరాలు అవసరాలను పుట్టిస్తుంటూనే వుంటాయి...
దైహిక, రక్షణ, ప్రేమ, గౌరవ, శక్తిసంపన్నత మాస్లో వలయాలు...

ఔటర్ రింగురోడ్లలా మనసు ట్రాఫిక్ జామును నియంత్రించబోతాయి...
మొదటిది ఆకలిదప్పులు, విశ్రాంతి, సౌఖ్యాల వలయం
రెండవది రక్షణ– గుండె మీద చెయ్యి వేసుకుని నిద్ర పోగలిగిన
మానసిక ప్రశాంత స్థితి...
మూడవది– ప్రేమ, స్నేహం, ఆప్యాయతా...
నిన్ను లాలించి నీ కన్నీళ్ళను చదివి ఓదార్చే తోడు నీడా...
నాల్గవది– పరువు–మర్యాదా, హెూదా, ఉన్నతస్థితి, నీవెక్కిన మెట్లూ,
కిరీటాలూ, సింహాసనాలూ...
ఆఖరిది– అయిదవ వలయం... సృజన, నీ శక్తియుక్తుల విశ్వరూపం
ప్రదర్శనా, వినియోగ విచక్షణా...
అనుకోకుండా బండి గాడి తప్పింది...
నీ వెహికిల్ నిన్ను కిల్ చేస్తుంది నువ్వు డిప్రెషనులో కంట్రోలు కోల్పోతే...
జీవితం ముఖ్యం... వలయాలు తరువాత...

ఆహార, నిద్రా, భయ, మైథునాలు పశువులకూ, మనుష్యులకూ
సమాన అవసరాలే...
ధర్మమనే అయిదవ వలయం మానవుల్ని పశువుల నుంచీ
వేరుచేస్తుందంటుంది హితోపదేశం...
ఈ విషగాలి విజృంభణలో వలయాలన్నీ ఊపిరి అందని చీకటి దారులయ్యాయి...
ఆహార, నిద్రా, భయ, మైథున వలయంలో తుఫానులూ, సునామీలూ

రక్షణా వలయంలో అనిశ్చిత స్థితి,
ప్రేమ ఆప్యాయతా వలయాల్లో చలివేంద్రాల కరువూ,
పరువూ–మర్యాదల దారుల్లో, వర్ణ, మత, కుల, జాతి
కత్తులింకా విచ్చుకునే ఉన్నాయి...
ఎడారిలో ఎండమావులకై వెదుకుతూ సర్వ శక్తులూ ఉడిగినప్పుడు...

ఎక్కడో ఒక తప్పు ఒక వాక్యాన్ని మింగివేసింది...
ఒక ఊపిరి దేహం లోపల గిలగిలలాడింది...
ఒక స్వప్నం పూర్తికాకమునుపే చెదరగొట్టబడింది...
ఒక ప్రహేళిక జవాబు కనుక్కోక ముందే చెరిపివేయబడింది...

✧✧✧✧✧

# 46. ...వెళ్ళిపోయాక నీవు అడుగుతావు...

ఎందుకు ఈ ఊటబావి ఇంత లోతుకు ఎండిపోయింది?
తోడుతూనే ఉంటావు బొక్కెన్ల కొద్దీ జ్ఞాపకాలను...
ఇల్లంతా సముద్రమై అలలు తీరాన్ని తాకి నురగలా నీటి బుడగల్లా పేలిపోతుంటాయి...
వెళ్ళేముందు అడగవు ఎందుకు వెళ్ళిపోతున్నావని...

ఉండలేనంత నిశ్శబ్దాన్నో, విస్ఫోటనాన్నో... అగ్నిపర్వతంలా ఇద్దరి మధ్య
ప్రతిష్టించుకున్నది ఇద్దరూ మరిచిపోతారు...
ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరు ఇక చాలు అనుకుని...
కన్నీళ్ళని, గుండె చప్పుడునీ...
బిగబట్టిన కనురెప్పల, పెదాల వెనుక నొక్కిపెట్టి
తాడునో, దారినో వెదుక్కుని నిష్క్రమిస్తారు...

అక్కడ వాళ్ళూ అంతే! ఒక సూర్యోదయాన్ని నమ్ముకుని,
ఒక సిద్ధాంతాన్ని గుండెలపై ముద్రించుకుని
చె గువేరా, లోర్కా, నెరూడా, భగత్‌సింగ్, సీతారామరాజు...
చిక్కటి అడవుల్లోనో, చీకటి పడవల్లోనో తీరం వేపు వస్తుంటే...
...వాళ్ళు వెళ్ళిపోయాక నీవు అడుగుతావు...
ఎందుకు ఈ ఈ రహదారులిట్లా ఎర్రబడ్డాయి,
ఎందుకు ఈ చెట్లు అగ్నిపూలను వికసిస్తున్నాయని...?

శాంతినీ, సమానత్వాన్నీ తత్వాలుగా మార్చి,
స్మృతుల్నీ, రాజ్యాంగాన్నీ, ఊటబావులుగా మార్చి నీకిచ్చి...
...వాళ్ళు వెళ్ళిపోయాక నీవు అడుగుతావు...
ఇల్లంతా ఇన్ని గదులై సముద్రమై ఉప్పు చెరువులై
అలలు తీరాన్ని తాకి విద్వేషపు నూనె నురగలు నీటి బుడగల్లా చిమ్ముతుంటే...
వెళ్ళేముందు అడగవు ఎందుకు వెళ్ళిపోతున్నావని...
ఉండలేనంత నిశ్శబ్దాన్నో, విస్ఫోటనాన్నో... అగ్నిపర్వతాల్లా ఒకరి మధ్య
ఒకరు ప్రతిష్టించుకున్నది ఇద్దరూ మరిచిపోతారు...
...వాళ్ళు వెళ్ళిపోయాక నీవు అడుగుతావు...
ఎందుకు ఈ కన్నీళ్ళు ఇంత ఉప్పగా ఉన్నాయని...

✧✧✧✧✧

# 47. కా కస్య పరివేదనా?
# ఎవరయ్యా బాధపడేది?

"ఏక వృక్ష సమారూఢా నానాదేశ విహంగమా... చీకటి పడేసరికి నానాదేశ పక్షులు ఆ చెట్టుపై చేరతాయి... తెల్లవారగానే ఎవరి దారి వారిది... అయినా సొమ్మొ పోయి దిమ్మొ పట్టింది" అన్నాడు రైల్వేస్టేషన్లో ఏకాంతరావు...

"పట్టదామరి! ఈ కరోనా దెబ్బకు... సొగుసు సోమవారం పోతే మొగుడూ యాయవారం పోయినట్లు... సత్యములు పొత్తు గడుచునా, బాసలు కలిసి వచ్చునా?... నిజాలు తెలవడం లేదు... నిష్ఠూరాలు నిలవడం లేదు"– అన్నాడు భూషణం ఆవలిస్తూ...

"మరీ ఆవలించకు... అదుగో బ్రహ్మానందం వస్తున్నాడు– ఆవలిస్తే ప్రేవులు, బ్రేవులు, వారం కింద తిన్న టాబ్లెట్లూ లెక్కబెట్టేస్తాడు. ఆ ఆ! రండి గురువు గారూ... మీ గురించే పచ్చి నిజాలు చెప్పుకుంటున్నాము..."

"...ఏం నిజాలు లే! సంతపాక తొత్తు సన్యాసిని యెరుగునా... అన్నట్లు... లోగుట్టు పెరుమాళ్ళుకెరుకలా– ...విన్నమ్మ వీపు కాలింది, కన్నమ్మ కడుపు కాలిందని... ఇంతకీ కాంతారావు గారు మాస్కు పెట్టుకోరా?"– వస్తూనే అన్నాడు మాస్కులో బ్రహ్మానందం.

"బతుకో క్వారంటెయిను, ముఖమో మాస్కూ అయ్యింది కదా– ...ఊరు రమ్మంటుంది... వాడ పొమ్మంటుంది, పిల్లల్ని చూడాలని ఆ దేశం పోతున్నా – నమస్తే ఏకాంతం సార్!..." అన్నాడు మాస్కు సర్దుకుంటూ కాంతారావు.

ఏకాంతం అన్నాడు– "ఇంటికెళ్తామో, వల్లకాటికెళ్తామో తెలియని రాహు కేతు వ్యవహారమైంది బతుకు... సామజము చెరుకు మేస్తుంటే దోమలెన్ని అయినా తోలగలవా... ఏ కరోనా పెద్ద ఏనుగులా మన వ్యవహారం ఏనుగు– గుడ్డివాళ్ల కథలా ఉన్నది..." అన్నాడతడు.

భూషణం అందుకున్నాడు... స్థూలము కనుగుడ్డు, సూక్ష్మము కనుపాపలా అంతా గోచరం అగోచరంగా కానవస్తున్నది... స్వాతి కొంగల మీదకు సాళువ పోయినట్లు... ఈ కరోనా మన రిటైరయినోళ్ళమీద పడుతున్నదని పిస్తోంది ఏకాంతం గారూ..." అన్నాడు అతగాడు.

ఈ పాలకులు... శెనగలు తింటూ వులవలని చెప్పి కాసిని పత్తిగింజలు మన చేతుల్లో విదిలించి చేతులు కడుక్కుంటున్నారు... మన పని... సన్యాసి పెండ్లికి జుట్టు కాద్నుంచీ అన్నీ అరువు... అయిన చందమయ్యింది" సణిగాడు కాంతారావు.

"వేసినదే ఒక గంతు, విరిగినదే ఒక కాలు... వాళ్ల వేసాలల్లా గ్రాసాలకే కదా... క్రాన్వెంటు క్రాకీ వ్రతి వ్రత్తి ప్రలకవే అంటే క్రావు క్రావు... అన్నట్లు కాసేపు అరుస్తారు... వాళ్లకేమీ ఒరగదు, మనకేమీ తరగదు, ఈ బాధ..." అన్నాడు నిర్లిప్తంగా భూషణం.

"ఎవరయ్యా బాధపడేది? మొండికీ బండకూ నూరేళ్ళ ఆయుష్షు.. అన్నారు. ఈ కరోనా జగమొండిలా ఉంది... మొయిలు విడిచిన యెండా, మొగుడు విడిచిన ముండా, పట్టి విడిచిన మండా, యెత్తి విడిచిన కుండా తీక్షణం కదా... పట్టించుకోవద్దు... బతుకుదాం ఆశతో..." అన్నాడు కాంతారావు.

"అదుగో తూరుపు వెళ్ళే రెయిలొస్తోంది... పదండి... రెయిల్లో మాట్లాడు కుందాం... అర్థమవుతుందా..." అన్నాడు బ్రహ్మానందం.

✧✧✧✧✧

# 48. లావొక్కింతయు లేదు...

లా వొక్కింతయు లేదు... ఎక్కడుంది?
లాక్‌డౌన్‌లో లారీల్లో ఉన్నది లాగి పిర్రలమీద కొట్ట లా...
లా కేత్వమే లేకుండా లక్షలు లక్షలు పేదల అకౌంట్లలోకి లాగిన్ కాలేదా...
లోడెత్తాలిరా లారీల్లో, వలస దారుల్లో,, పద, పద,
లలాట లేఖా న పునః ప్రయాతి...
లా యిలా అనుకుంటూ లాభంగా ఇంటికిపోదామనుకుంటే గూబలు పగల్లా?

ధైర్యముల్ విలోలంబయ్యె... ప్రాణంబుల్ ఠావులు దప్పెను...
పాలక గోగ్రహణంలొ తావులుదప్పిన ప్రజావుల గొడవను
లాక్షణిక, క్షణిక మేధావులు కుప్పించి ఎగసి ఎగసి ఠావులు ఠావులు
బుల్లితెరలపై అంబారవాల పారేసిన నిస్గర నిర్భయవాక్ ధాటుల రోజువారీ
అప్‌డేటు నిరాశా రాశుల విని విని...
ధైర్యం విలోలం కాలా...

మూర్ఛ వచ్చె...
తనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్... అదుగో కరోనా... ఇదుగో
కరోనా... కుచ్ కరోనా... అంటే ఊపిరాడని మాస్కుల్లో మన కంపు
మనమే పీల్చుకుని పీల్చుకుని
జీవితాశ మీద చేతులు కడుక్కుని చప్పట్లు కొట్టి, దీపాలారగానే దీపాలు
వెలిగించి, కళ్లకద్దుకుని, పూలు జల్లి, తీర్థ ప్రసాదాలను,
బారుల్లో బారులుగా యధావిధి సామాజిక, భౌతిక దూరాల్లో పుచ్చుకున్నాక...
సహజీవనం చెయ్యండి సన్నాసుల్లారా... అనేసరికి మూర్ఛరాక
మూర్ఛనలు, కీర్తనలు వస్తాయా...

నీవేదప్ప నితః పరంబెరుగ మన్నింపదగున్ దీనునిన్...
అన్నీ మర్చిపోయాం ఈ మూడు నెలల్లో...
కరోనాయణంలో కథా కోవిదులం, నీతి కోవిదులమై
కిష్కింధల్లాంటి యిళ్ళల్లో కోతుల్లా టిక్కుటాకుల్లాంటి
తిక్క పనుల్జేసి చేసీ యాష్టొచ్చాక,

ఇప్పుడు కార్యాలయాలు, దేవాలయాలూ తెరుస్తున్నాము క్రమపద్ధతిలో
పొమ్మంటే మూడు నెల్ల బద్ధకమెట్లా పోయేను?
నీవే మన్నించి పదోతరగతి పరీక్షలు రద్దు చేసినట్లు
మాకు పనులు రద్దు చేసి దీనుల కాపాడ...

రావే ఈశ్వర కావవే వరద...
వరదా అంటే నిసర్గ వరదలొచ్చినాయి... ఇంకా మాకు పరీక్షలా తండ్రీ!
ఇప్పటికే ఇరవై లక్షల కోట్ల రూప వరదల్లో
వెతుక్కుంటున్నాము మా ఆర్థిక ఉనికిని
అసలే రూపాయల్లేక ఏడుస్తుంటే కరోనా గోరుచుట్టపై
కరువు రోకటి పోటులా వానలు కురిసి కొత్త రోగాలు...
కాస్త దగ్గితే కరోనా టెస్టంటే- కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం...

రావే ఈశ్వర కావవే వరద...
సంరక్షింపు భద్రాత్మకా...
రావయ్యా అల వైకుంఠ పురంబు నుండి... తన ముఖారవింద మకరంద బిందు సందోహ పరిష్యందనానంద దిందిందిర యగు నయ్యిందిరాదేవి గోవింద కరారవింద సమాకృష్యమాణ సంవ్యాన చేలాంచలమయి రాగా...
వచ్చి సంరక్షింపు భద్రాత్మకా...!

✧✧✧✧✧

# 49. పాములూ-నిచ్చెనలూ...

వాళ్ళిద్దరూ సహజీవనం చేస్తూ పరమపదసోపానమనే
వైకుంఠపాళీ ఆట ఆడుతూ ఆపసోపాలు పడుతున్నారు...
ఈ పాములూ నిచ్చెన్ల ఆటలో...
ఒకటే పాచిక... దానికి ఆరుముఖాలూ...
ఒక్కో ముఖం మీద ఒకటి నుంచీ ఆరు చుక్కలూ...
ఆటగాడా విసురు... జాగ్రత్తగా డబ్బా కదిలించి...!
ఇష్టదైవాన్ని తలుచుకుని... విసురు...
ఆరు పడితే ఆట మొదలెట్టు... ఇంకొకసారి విసిరే ఛాన్సు...
స్క్వేర్ ఓన్‌లో చైనా ఉందా... సరే సరే... అక్కడనుంచే లెక్క మొదలెట్టు...
కరోనా విసిరింది గబ్బిలాల గవ్వను... నిచ్చెన...
వూహాన్ నుంచి న్యూయార్క్‌కు లాంగ్ జంపు...
మనిషి విసిరాడు-- చిన్ని నిచ్చెన... ముఖానికి మాస్కు వేసుకో...
కరోనా విసిరింది... ఇరాను, ఇటలీ, స్పెయిను, బ్రిటనూ, జర్మనీ, ఫ్రాన్సు
దాటి ఇండియా చేరింది... వావ్...
మనిషి విసిరాడు-- చప్పట్లు కొట్టు, దీపాలు వెలిగించు...
చిన్న పాము కరిచింది మళ్ళీ మొదటికే...
కరోనా గలమని డబ్బాలా నవ్వుతూ విసిరింది... ఒకటి పడింది...
రెండు పడితే వ్యాక్సీను పాము కరిచేది... కాస్త భయపడింది కరోనా...
మనిషి విసిరాడు- ఆరు వారాల క్వారంటెయిను పడింది...
ఎక్కడి దొంగలక్కడే గప్ చుప్....

ఇద్దరూ ఆడుతూనే ఉన్నారు... పాములు మింగినప్పుడు జరజరా జరుగుతున్నారు...
నిచ్చెనెక్కినప్పుడు బరబరా పాకుతున్నారు...
అయినా కరోనాదే పైచేయిగా ఉందిప్పుడు...
అమెరికా, బ్రెజిల్, ఇండియా, రష్యా ఇలా అనేక దేశాల గళ్ళు
తడిచిపోయాయి మనిషి కన్నీళ్ళతో...
ఈలోగా నిద్ర మేల్కొన్న వర్ణవివక్ష పాము అమెరికా, ఇండియాలో
బుసకొట్టి కాటు వేసింది...

మనిషి అట్టడుగుకు జారిపోయాడు మళ్ళా స్క్వేర్ ఒన్‌లోకి...
రహదారులపై వలస జీవుల మెడల మీద నిర్లక్ష్యపు మోకాళ్లు
తొక్కిపెడుతుంటే ఊపిరాడక...

చేతులు కడుక్కుని విసురు మనిషీ నీ పాచిక... ఒకటేస్తే- మాస్కూ,
రెండైతే- శానిటైజరూ, మూడేస్తే- భౌతిక సామాజిక దూరమే,
నాలుగేస్తే- క్వారంటైయినూ, అయిదేస్తే- ఐసోలేషనూ,
ఆరేస్తే-మందులూ, ఎక్స్‌ట్రాగా- వెంటిలేటరూ...
కాయ్ రాజా కాయ్...

ఇప్పుడు పైగడికి చేరుకున్నావు మనిషీ..
అన్ని ఆలయాల్లో గాలిలో దీపం వెలిగించారు...
నీ గర్భ గుడుల్లో, నీ ఊపిరితిత్తుల్లో అంతా చీకటి...
ఆ చీకట్లో కరోనా నాట్యం...
విశ్వాసం, నమ్మకం, దయ, జ్ఞానం, తపస్సు గడులెప్పుడో మరిచిపోయావు...
నీ చూపంతా డబ్బు గడి మీదే...
అవిధేయత, ఆడంబరం, యేహ్యత, దోపిడీ, చోరత్వం, వంచన,
అసత్యం, తాగుడు, వాగుడు, అప్పులూ-ఎగ్గొట్టడాలూ,
యుద్ధాలూ, హత్యలూ, అరిషడ్వర్గాలూ
నీవెక్కుతున్న మెట్లూ... ఆ మెట్ల నిండా నీవు పెంచి వదిలిన
కరోనా అడుగుల విష ధూళి...

విసురు మనిషీ విసురు నీ ఆఖరి పాచిక... ఆఖరి యెత్తూ, ఆఖరి అవకాశం...
బతికించుకో మానవతను... సృజించుకో భూలోక వైకుంఠాన్నీ,
అవినీతి కరోనా లేని భూతల స్వర్గాన్నీ..

✧✧✧✧✧

# 50. ఇంద్ర గర్వభంగం...

ఏడేళ్ల పిల్లాడు ఏం చెబితే అది చేసేస్తారా ఆ పసుల కాపరులు?
నాకు పూజలు మాని ఓ రాళ్లగుట్టకు జాతరా? అవమానం...
పెరుగులు నేతులు ద్రావి క్రొవ్వి...
గిరిసంఘాతకఠోరపత్త్రదళనక్రీడా సమారంభ దుర్భర దంభోళి ధరుండను,
పురందరుడను నన్ను ధిక్కరింతురా?--
ఆ గొడ్లు కాచేవాళ్ళు... వాళ్ల అంతు చూసెద గాక?
ఓ సంవర్తక మేఘాల్లారా! మీ సంకెళ్ళు తీస్తున్నాను... వెళ్ళి,
మహానిలములు మీకు తోడు రాగా అమోఘములైన మేఘములు
మహౌఘములు కాగా నాలుగు దిశలావరించండి...
బ్రహ్మాండభాండంబుకు చిల్లులుపడి ఎడతెగని నీర ధారలు, మహాశిలల
ప్రమాణమగు వడగళ్ళు వర్షించుచు, పిడుగులు రువ్వుచు,
విలయశిఖి శిలా సంరంభ విజృంభమాణవిద్యుల్లతా విలొకంబులు గావించి
రిమ్మదిరిగి సొమ్ములు పోవాలి వాళ్ళూ వాళ్ల మందలూ...

వాళ్ళూ భయపడిపోయారు... కరోనా కాలమేఘాలు కమ్మి వణుకుతున్న
కలికాలపు ప్రజల్లాగా...
ఈ ఉరుములు నీ మెరుపులు నీ యశనులఘోషణములు
ఈ జలధారలు ఎప్పుడూ కనీ వినీ యెరుగమయ్యా...
చిన్ని కృష్ణయ్యా! అని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు వాళ్ళు...
దండిని బ్రహ్మాండంబుల చెండుల్లా ఎగరేసే హరికి
కొండను పెకలించి యెత్తుట ఒక లెక్కా...
ఎత్తి ఆ ఏడేండ్ల బాలుడు గోవర్ధనగిరిని గొడుగులా పట్టుకుని...
బాలుండీతడు కొండ దొడ్డది అని భయపడకుమన్న...
పుత్రమిత్ర కళత్రాది సమేతులై గోపాలురూ, గోవులూ ఆ గిరి కిందకు చేరగా,
గిరిభేది ఇంద్రుడు ఏడు రాత్రుళ్ళూ ఏడు పగళ్ళూ వర్షం కురిపించాడు...
అప్పుడర్థమయ్యింది ఆ పిల్లాడెవరో...
త్రిలోకాధిపతినన్న గర్వము పటాపంచలు కాగా దిగివచ్చి తలవంచి
దినకర నిభనిజకిరీట దీధితి చేత నందసుత చరణముల పూజించినాడు...

నిన్న వర్షం కురిసింది ఉరుములు మెరుపులు పిడుగు శబ్దాలతోకూడి...
ఈదురుగాలులు ఈడ్చి కొట్టగా కార్యాలయాలన్నీ తెరుచుకున్నాయి...
కరోనా ఇంద్రుడు వేయికళ్ళు తెరిచి విష వర్షం కురిపిస్తున్నాడు...
ఏడేళ్ళ కృష్ణులు పరిపాలనా గిరి గొడుగుల్ని
ఎత్తుతున్నారు, దించుతున్నారు... ఏడు నెలల నుంచీ...
గోవులూ, గోపాలకులూ, మేధావులూ, వలస ఆవులూ...
తమ్మోడి తామోడిన మురళీ గానాన
కొండ కింద క్వారంటెయినులోకి పోయి ముక్కులకు ముఖాలకు చిక్కాలు
కట్టుకుని ఊపిరాడక ఉగ్గబట్టుకుంటున్నారు...

కరోనా ఇంద్రుడికి ఎప్పుడు యాష్ట వస్తదో,
గొడుగు ఎత్తినాయన ఎప్పుడు గొడుగు మూస్తాడో...
మళ్ళీ మళ్ళీ తొడుక్కుంటున్న ఈ మాస్కులెప్పుడు పోతాయో...
ఈ సామాజిక, ఆర్థిక దూరాలూ, భౌతిక, ఆదిభౌతిక దూరాలూ పోయి...
ఆ అసమాన కరోనా పోయే రోజెప్పుడో...

✧✧✧✧✧

# 51. నియోబి కన్నీళ్ళు...

దేవతలకు పరీక్షబెట్టి దెబ్బతిన్నాడు టాంటాలస్...
అతడికన్నా గర్విష్ఠి అతడి కుమార్తె- నియోబి...
ఆమె భర్త ఆంఫియాన్ స్వర్ణ వీణపై సరాగాలు పలికించే సంగీతజ్ఞుడు...
ఏడుగురు కొడుకులు, ఏడుగురు కూతుళ్ళు వాళ్ళకు...
ఆరోజు మహాపర్వదినం... అపోలో-సూర్యుడు, ఆర్టెమిస్-చంద్రికల తల్లి...
లెటొ మాత జాతర...
థెబెస్ నగర ప్రజలు ధూప దీప నైవేద్యాలతో, జయజయ నినాదాలతో
బాకాలు, డప్పుల చప్పుళ్ళ మధ్య కోలాహలంగా వెళ్తున్నారు గుడి వేపు...

అక్కడకు మెరుపులా వచ్చింది నియోబి-
బంగరు దుస్తులు, నవరత్న హారాలు ధరించి దేవతలా వెలిగిపోతున్నదామె-
ఆశ్చర్యంతో చూస్తున్న జనులను చూసి ఆగ్రహంతో పలికింది...
ఎటువంటి మూర్ఖులు మీరు! దేవతల కుమార్తెను నేను-
ఈ నగర నిర్మాతలు నా భర్త అతడి సోదరుడూ...
మిమ్మల్ని ప్రతిక్షణం కనిపెట్టుకునే నేను మీ ఎదుటనే ఉంటే
ఏనాడూ మీ ముందుకు రాని ఆ లెటో రాణిని పూజిస్తారే...
ఆమెకు ఒక కొడుకు, ఒక కూతురు...
నాకు ఏడుగురు కొడుకులు, ఏడుగురు కూతుళ్ళు...
వాళ్ళను ఏడురెట్లు మించిన వాళ్ళు...
నాకు చెయ్యండి మీరు పూజలూ... ఆజ్ఞాపించిందామె...

మహాకాయుల కుమార్తె మింటి దీపాల తల్లి విన్నదా మాటలు...
అపోలో, ఆర్టెమిస్‌లను పిలిచింది... ఆ వదరుబోతు నియోబికి
గర్వభంగం చెయ్యండి...
అపోలో తన ప్రచండోష్ణ కిరణాలు సంధించి గురిచూసి కొట్టేసరికి
నియోబి ఏడుగురు కొడుకులు మొదలు నరికిన చెట్లలా నేలకూలారు...

ఆర్టెమిస్ చంద్రిక తన శీతల శరపరంపరతో ఏడుగురు ఆడపిల్లల ఊపిరి తీసింది...
అడ్డువచ్చిన ఆంఫియాన్ లెటో పిల్లల ఆగ్రహజ్వాలల్లో ఆహుతయ్యాడు...
భీకర భూకంపాలతో థెబెస్ నగరం కుప్ప కూలింది...

తన భర్త, పిల్లల మరణాల్ని కళ్ళారా చూసిన నియోబి కఠినశిలలా మ్రాన్పడిపోయింది...
తొమ్మిది రోజులు నిద్రాహారాలు లేకుండా రోదిస్తూనే ఉంది...
దేవతలు విధి నిర్ణయాలను నచ్చజెప్పినా ఆమె మారు పలకలేదు...
పిచ్చిగా రోదిస్తూ ఆమె పరుగెత్తి, పరుగెత్తి సిపిలస్ కొండపై శిలలా మారిపోయింది...

ఓ బాటసారీ! అదుగో చూడు... ఆ కన్నీరు కారుస్తున్న చంద్రశిలను... టర్కీ దేశపు మనిసా దగ్గర అదుగో... సిపిలస్ కొండపై ఈనాటికీ చెక్కుచెదరని... నియోబి శిల... చూడు ఆమె కన్నీళ్ళను...

మితిమీరిన గర్వభారం తెస్తుంది అంధకారం...

✧✧✧✧✧

# 52. గర్వము సర్వము చెరుచును...

కామ, క్రోధ, లోభ, మద, మోహ, మాత్సర్య అరిషడ్వర్గాలు
కేవలం చిన్ని దోమ కాట్లు,
గర్వాతిశయం చేసే గాయాలతో పోల్చుకుంటే...

దేవుడు మట్టి నుంచి చేసిన మానవుడికిస్తున్న గౌరవాన్ని భరించలేక
కుతకుతలాడిపోయాడు అగ్ని సంభవుడు ల్యూసిఫర్...
అహంకారం అతడిపై బూడిదలా కమ్ముకుని పొగచూరిపోయాడు...
స్వర్గంలో సేవకుడిగా ఉండడం కన్నా నరకంలో రాజాగా బదకడం మేలనుకున్నాడు...
ఈర్ష్యాసూయలతడి కళ్లుకప్పగా వెలుగుని చూడలేని దివాంధుడై పతనమైనాడు...

దేవేంద్రుడికి మర్త్య కన్యకు పుట్టినవాడు టాంటాలస్...
మహాగర్వం...
స్వర్గానికి వెళ్ళి దేవతలతో విందు గుడుస్తూనే అక్కడి నుంచీ అమృతాన్ని దొంగిలించి
అతిథి మర్యాదోల్లంఘన చేసినాడు...
ఈసారి దేవతల్ని తన ఇంటికి విందుకు ఆహ్వానించాడు
వాళ్ళ శక్తుల్ని పరీక్షిద్దామని...
అతిథులొచ్చారు... ఆసీనులైనారు భోజనాల బల్ల వద్ద...
స్వయంగా వడ్డిస్తున్నాడు టాంటాలస్ చలోక్తులు విసుర్తూ...
నాలుగు కూరలూ, నవకాయ పిండివంటలతో పాటు
ఘుమఘుమలాడే వివిధ రకాల మాంసాలూ వడ్డించాడు...

మిగతా దేవతలు వారించేలోపునే కూతురు పెర్సిఫోనె కనబడక
పరధ్యానంగా ఉన్న డిమాతరె-భూమి తల్లి ఓ ముక్క తిన్నది...
టాంటాలస్ వడ్డించింది తన కొడుకు పెలియాస్ మాంసాన్ని...
దేవతలు పెలియాస్‌ను బతికించి... టాంటాలస్‌కు శిక్ష విధించారు...

నరకలోకంలో అతడు చిరకాలం ఆకలిదప్పులతో అలమటిస్తూ
దారుణ బాధననుభవించాలి... పక్కనే నీళ్ళుంటాయి.. తాగబోయేసరికి అందవు...

దగ్గర్లోనే మధురఫలాలు చెట్ల కొమ్మలకు వేళ్ళాడుతుంటాయి,
చెయ్యి కదిలిస్తే దూరంగా పోతుంటాయి...
కదిలీ కదలకమునుపే పెద్ద బండరాయి నెత్తిమీద పడడానికి
సిద్ధంగా ఉంటుంది... చిత్రహింసలలో పరాకాష్ఠ...

వింధ్య పర్వతాల గర్వాన్ని అణిచి అగస్త్యుడు అటుగా పోతుంటే
ఇల్వలుడు ఇంటికి పిలిచి మేకమాంసంతో మాంచి భోజనం పెట్టి-
వాతాపీ రా... అన్నాడు. రాలేదు... మళ్ళీ పిలిచాడు- వాతాపీ రా...
అయినా రాలేదు...
మామూలుగా అయితే తాను పిలవగానే తిన్నవాడి పొట్ట చీల్చుకుని
తన సోదరుడు వాతాపి రావాలి.
బలదర్పితులూ, గర్విష్టులూ, బలహీనులను ఏడిపిస్తూ నవ్వుకునేవాళ్ళు
ఆ అన్నదమ్ములూ...
ఇద్దరూ పగలబడి నవ్వుకుంటూ వాడిని ఫలహారం చేసేవాళ్ళు...
అగస్త్యుడు నవ్వుతున్నాడు... ఇంకేమి వస్తాడు- జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం...

కొందరు ఇతరులను హింసలు పెట్టి ఆనందం పొందుతారు...
కొందరు ఇతరులు కష్టాల్లో ఉంటే శునకానందాన్ని పొందుతారు...
వాళ్ళదాకా వచ్చినపుడు కళ్ళనీళ్ళ పర్యంతమవుతారు...

మితిమీరిన గర్వం మొదటికే నష్టం...

✧✧✧✧✧

# 53. సిసిఫస్ మరియు శిశుపాలుడూ...

జగత్కిలాడి, అత్యంత క్రూరుడూ, ఎఫిరా దేశపు రాజూ,
బాటసారుల్ని అతిథులుగా ఇంటికి పిలిచి దారుణంగా చంపే హంతకుడూ
కన్నింగ్ ఫెలో... అని తెలిసి మృత్యువు యమపాశం లాంటి
అత్యంత శక్తివంతమైన సంకెళ్ళతో వచ్చినాడు...
సిసిఫస్ చమత్కారంగా మాటల్లో పడేసి మృత్యు సంకెళ్ళను మృత్యుదేవతకే
తొడిగి తన గదిలోనే బంధించినాడు...
ఇంకేముంది... భూలోకంలో జనాలకు చావురాదు... కానీ...
వృద్ధాప్యపు కష్టాలకు ముసలివాళ్ళు నానా అవస్థలు పడుతూన్నారు–

సిసిఫస్ అన్న సాల్మోనియస్... అన్నను తొలగించి
థెస్సాలే సింహాసనం ఆక్రమించాలని సిసిఫస్ అన్న కూతుర్ని వలలో వేసుకుని
పిల్లల్ని కన్నాడు ఆ నీచుడు... పాపం పండింది...
భూభారం ఎక్కువయ్యింది... ఎంత తిండి, పంటలూ చాలడం లేదు
జనాలకు... ఆకలి... ఆకలి... కరువు...
యుద్ధాలు చేసే ఓపిక కూడా లేక కరోనా ప్రశాంతతలా అందరూ
లాక్‌డౌన్‌లోకి పొయ్యేసరికి యుద్ధదేవుడు ఏర్స్ వచ్చి సిసిఫస్‌ను బెదిరించి
మృత్యువు సంకెళ్ళను తొలగించాడు...
మృత్యువు ఆగ్రహంతో సిసిఫస్‌ను బంధించి పాతాళ లోకానికి తీసుకెళ్ళి
పెర్సిఫోనె దేవతకు అప్పగించాడు నరక యాతనలు బెట్టమని...

పెర్సిఫోనెను కూడా మాటల్లోబెట్టి తప్పించుకుని భూలోకం
వచ్చాడా కపటి సిసిఫస్...
దేవేంద్రుడు జ్యూస్ ఆగ్రహంతో శిక్ష విధించాడు సిసిఫస్‌కు.
ఒక పెద్ద బండరాయిని సిసిఫస్ తలమీద పెట్టాడు...
దానిని కొండమీదికి తీసుకుపోవాలి... ఆగే వీలులేదు...

ఆగితే పెర్సిఫోనె కొరడాతో వీపు చిట్లగొడుతుంది...
నానా ఆయాసపడుతూ బండరాయిని కొండమీదకు తీసుకెళ్ళి దించగానే
అది కిందకు జారిపోతుంది... మళ్ళీ మొదలెట్టాలి... ఆగే వీలు లేదు...
మనము, ప్రభుత్వాలు పడుతున్న కరోనా కష్టాల్లా అన్నమాట...

ఇటువంటి సిసిఫస్ చైనాలో ఇంకొకడున్నాడు...
అతగాడి పేరు... వు గాంగ్... అతడి పనేమిటంటే
చంద్రుడి మీద మనకు చెట్టు-కుందేలు కనిపిస్తాయి కదా...
ఆ చెట్టు ఒస్మాంథస్ ఫ్రాగ్రన్సు-బృహత్ వకుళ చెట్టు--దానిని ఇతడు
నరుకుతుంటాడు... అది మరుక్షణం పెరుగుతుంటుంది... అంతులేని కథ...
మనమందరం ఇప్పుడు కరొనా చెట్టు నరుకుతున్న వు గాంగ్‌లమైనాము...

దేవుడి దేశమైన కేరళలో, మొన్న ఏనుగు చనిపోయిన పాలక్కాడ్ ప్రాంతంలో...
నరనాథుడనే ముక్తుడు... విక్రమాదిత్య చక్రవర్తి ఆస్థాన
జ్యోతిష్కుడైన వరరుచి కుమారుడు...
ఇతడు పెద్ద పెద్ద బండరాళ్ళను రాయిరానెల్లోర్ కొండమీదకు
మోసుకెళ్తుంటే జనాలు అతడిని చూసి నవ్వేవాళ్ళు...
రాళ్ళను పైనుంచి కిందపడేసి అవి కిందకు దొర్లుకుపోతుంటే
రాళ్ళను, వాళ్ళనూ చూసి పకపకా నవ్వేవాడట అతడు...
బహుశా మన క్వారంటెయినూ, మాస్కులూ, వలసల్ని చూసి ఉంటాడు...
దివ్యదృష్టితో అప్పుడే...

అప్పుడంటే అగ్రపూజ అర్హత కృష్ణుడికి దక్కింది...
అది చూసాడు నికృష్టుడైన శిశుపాలుడు... మూడు కళ్ళూ, నాలుగు చేతుల్తో
బుట్టి కరోనా వైరసు ముఖమూ వాడూనూ...
శ్రీకృష్ణుడి చేతుల్లోనే తన కురూపితనం పోయిందన్న గతాన్ని మరిచాడు...
విరోధిగా మారినాడు...

రాజసూయ యాగ సభలో అందర్నీ తూలనాడుతూ రసాభాస చేస్తూ ముఖ్యంగా కృష్ణుడిని... నీకా అగ్రపీఠం?...
అర్హత లేని పశువుల కాపరివి, అమ్మాయిల్ని పెళ్లిపీటల మీంచి ఎత్తుకుపోయే దొంగవి... మామను చంపిన హంతకుడివి... అని తిడుతూనే వున్నాడు...
కృష్ణుడు లెక్కపెడుతూనే ఉన్నాడు... మేనత్తకిచ్చిన వంద పూర్తయ్యాయి...
నువ్వూ బొగ్గులా నీ నల్లరంగూ... నీలమేఘ శ్యాముడివా... ఆహా...
నూట ఒకటో తప్పు... జనవందిత శ్రీకృష్ణుడు చక్రం విసిరేసరికి శిశుపాలుడి తలెగిరిపోయింది...
అక్కడ అమెరికాలో ఎవరో ఎవరివో తప్పులు లెక్కెడుతున్నారు...

✧✧✧✧✧

(This divorce between man and his life, the actor and his setting, is properly the feeling of absurdity. Great feelings take with them their own universe. - Albert Camus

The Myth of Sisyphus (French: Le Mythe de Sisyphe) is a 1942 philosophical essay by Albert Camus. The English translation by Justin O'Brien was first published in 1955.)

# 54. నాలుగు పాదాల నడుస్తున్న పశువు...

ఉదయాన నాలుగు, మధ్యాహ్నం రెండు, సాయంకాలం మూడు
పాదాల నడిచేదేది? – అడిగేది స్ఫింక్స్ అనే మహారాక్షసి
థెబెస్ అనే పట్టణానికి వెళ్ళే దారిలో అడ్డం నిలబడి...,
మానవ స్త్రీ ముఖం, సింహ శరీరం, గరుడపక్షి రెక్కలు, పాము తోకతో
భయంకరంగా కనిపించేది భీకరంగా అరుస్తూ...
సరైన సమాధానం చెప్పనివాళ్ళని దారుణంగా చంపి తినేసేది...
సమాధానం చెప్పిన ఉబ్బు పాదాల ఎడిపస్‌కు దణ్ణంపెట్టి
సముద్రంలో దూకి చచ్చిపోయింది...

ఎడిపస్ అంతకు కొన్ని దినాల ముందు దారిలో గొడవ పడి
ఒక ఆగంతకుడిని (మారువేషంలో ఉన్న థెబెస్ రాజును) చంపాడు...
స్ఫింక్స్ రాక్షసిని చంపి అరాచక స్థితిలో ఉన్న థెబెస్‌లో అడుగుబెట్టిన
ఎడిపస్‌కు రాణినిచ్చి వివాహం చేసారు నగర ప్రముఖులు...
వాళ్ళకు ఇద్దరు ఆడపిల్లలు... యుక్తవయసులోకి వచ్చారు...
అప్పుడు తెలిసింది దారుణ నిజం...
తండ్రిని చంపి తల్లితో సంసారం చేసి పిల్లల్ని కన్న విషయం...
ఆమె ఆత్మహత్య చేసుకుంటుంది, తాను కళ్ళు పొడుచుకుని
గుడ్డివాడవుతాడు... నగరం నుంచి తనను తాను బహిష్కరించుకుని
బిచ్చగాడుగా శేషజీవితం గడుపుతాడా అభాగ్యుడు...

జీవితమనే స్ఫింక్స్ రాక్షసి అతడిని అడిగినట్లనిపించింది...
ఇప్పుడు నీ సంతానం నీకేమవుతారు? పిల్లలా, చెల్లెళ్ళా?
నీ భార్య నీకేమవుతుంది? నీవు నీకేమవుతావు?
విధి దేవతల విస్తృత మాయలో ఎవరికెవరు ఏమవుతారు?

సైన్సు అన్ని రంగాల్లో విస్తరించింది...
ఏ స్ఫింక్సు అడిగే ప్రశ్నలకైనా నెట్లో కొట్టి సమాధానాలు పొందవచ్చు...
స్వార్థమే పరమార్థంగా మారిన మానవుడు అల్లకల్లోల థెబెస్‌కు
వెళ్ళేదారిలో ఎదురు వచ్చిన వాళ్ళను చంపి, మానవత్వాన్ని మరిచి...
స్వజన ఘాతకుడై, ప్రకృతి వినాశకుడై,
ధనమూలమైన అసత్య మద కామ హింసా వైరములనే మెటాఫర్ల
ప్రదేశాలలో సంచరిస్తూ...
అహం, అశుచి, అక్రమం, అనృతం అనే నాలుగు
ఉబ్బిన పాదాల నడిచే పశువై...
విష రాక్షస స్ఫింక్సు ప్రశ్నకు సమాధానం చెప్పి
నగర ప్రవేశం చేసాడా? చరిత్ర పునరావృతమవుతుందా?
లేక తానే స్ఫింక్స్‌గా మారినాడా?

✧✧✧✧✧

# 55. ఈ దారి నీకు నచ్చుతుందా-1

నీదంటూ ఏదీ లేదు, ఈ నేలా, నీరూ, ప్రకృతి ఇచ్చిన సర్వ సంపదలూ సమాజానివే...
రోజుకు అయిదో ఆరో గంటలు సమాజం కోసం శ్రమ చెయ్యాలి...
మిగతా కాలమంతా నీకే... వెసులుబాటులో విధ్వంస బాట నిర్మించరాదు...
నీ నిత్యావసరాలన్నీ సమాజమే సమకూరుస్తుంది...
అందరూ సమానమే అక్కడ...

అంతా నీదే ఇక్కడ... నీవు శ్రమించు...
నీ శ్రమకు, సృజనకూ వెల కట్టుకో... సంపాదనలో సమాజం చెప్పినంత పన్ను కట్టు... ఎన్ని గంటలు పనిచేస్తావో, ఎంతమందితో పని చేయించుకుంటావో అది నీ ఇష్టం.
నీ అవసరాలన్నీ నీవే సమకూర్చుకోవాలి...
శ్రమ నీ ఇష్టం... అందరూ సమానమే అయినా అధికార, ఆర్థిక స్థితి సమానత్వంలో అసమానతల్ని నిర్ణయిస్తుంది...

అంతా ఆ సృష్టికర్తదే అచ్చోట... ఆ పవిత్ర గ్రంథాల వాక్కులు శిలా శాసనాలు... అందరినీ, అన్నిటినీ సృష్టించి మానవుడిని ధర్మకర్తగా నియమించినాడు.
వాటిని విడమరచి వివరించే జ్ఞాన ధనులు, మిమ్మల్ని ఉపద్రవాల నుంచి కాపాడే బాహుబలులూ, మిమ్మల్ని ఒక మందగా నడిపించే నాయకులూ, అన్ని పనుల బరువు తట్టని మోసే శ్రామిక జనులూ...
న్యాయాన్యాయాలన్నీ పవిత్ర భావనల దైవశక్తితో సమీక్షించబడతాయి...
దుష్ట శిక్షణ శిష్ట రక్షణ పాప పుణ్య నిర్ధారణ అన్నీ ఆ పవిత్ర వేదిక వద్దే...

మానవుడే మహనీయుడు,
అతడే తన అవసరాల కోసం పరిణామక్రమంలో
అన్ని దైవ రాక్షస భావనల్నీ సృజించుకున్నాడు...
అతడికతడి సౌభాగ్యమే గమ్యం, అమరత్వ సాధనే అతడి లక్ష్యం.

అతడు కూడలిలో నిలబడి వెనక్కీ ముందుకూ కాలంలోకి తొంగిచూసాడు...
దారుల కన్నివేపులా రక్తపు వాగులూ, కొట్టుకుపోతున్న కపాలాలూ,
మానవ మేధో, హస్త నిర్మిత మారణ యంత్రజనిత విస్ఫోట భీభత్స దృశ్యాలే,
అసహాయుల ఆక్రందనలే...
దారులపై అడుగడుగుకూ విచ్చుకుంటున్న విచ్చుకత్తులూ,
విస్ఫోటిస్తున్న విరోధ విషబాంబులే...
ఏ దారిన నడవాలి?

ఈ దారి నీకు నచ్చుతుందా!

✧✧✧✧✧

# 56. నైమిశారణ్యంలో వ్యాస, శుక, సూత, శౌనకులు...

తాను వ్రాసింది చెప్పే తన కుమారుడు శుకుడు నగ్నంగా వస్తుంటే
దాపులనున్న స్త్రీలు, పరిజనం పలకరిస్తున్నారు సగౌరవంగా
తాను వస్త్రధారియై వస్తున్నా పమిటలు సర్దుకుని పక్కకు తొలుగుతున్నారు-
ఇదేమిటని వేదవ్యాసుడు ఆలోచించాడు ఒక్కక్షణం...
అర్థమయినట్లనిపించింది..
దృశ్యమదే... దృష్టిలో తేడా...

తన సంతానం కొట్టుకు చావడాన్నే కదా తాను వంశకథ జయంగా మలిచింది...
యుద్ధం, మృత్యువు, నీతులు, భవిష్యద్దర్శనం, జ్ఞానం,
అంత విపులంగా చెప్పినా మళ్ళీ మళ్ళీ కురుక్షేత్ర సంగ్రామాలే
ఎక్కడ చూసినా... దృశ్యమదే... దృష్టిలో తేడా...

అదే కథను ఇలా ప్రేమ, భక్తి, అద్భుతాలతో నింపి పామర, పండిత,
స్త్రీజనాలందరికీ అర్థమయ్యేలా భాగవతాన్ని లిఖించాడా ద్రష్ట...
ఆనక జ్ఞానాన్ని ప్రచారం చేయడానికి విభజన చేసి మా తండ్రి
రోమహర్షణునికి పురాణముల నిచ్చినాడు... -అని సూతుడు చెబుతుండగా
వినేవాళ్ళందరూ పోగయ్యారక్కడ శౌనకులై, సత్ర యాగ వేదిక వద్ద...
దృశ్యమదే... దృష్టిలో తేడా....

మహాభారతయుద్ధం ముగిసేసరికి మిగిలింది పన్నెండుమంది-
అయిదుగురు పాండవులూ, కృష్ణుడూ, సాత్యకి, యుయుత్సు, అశ్వత్థామ,
కృప, కృతవర్మ, వృషకేతు...
ఉత్తర గర్భాన, అశ్వత్థామ బ్రహ్మాస్త్రం వేడికి చచ్చి, కృష్ణునిచే పరీక్షించబడి
బ్రదికిన పరీక్షిత్తూ...
తక్షకుడి విషకాటుకు భస్మమయ్యేముందు శుకుడు చెప్పగా పరీక్షిత్తు విన్న
తన వంశ కథ... దృశ్యమదే... దృష్టిలో తేడా...

తన తండ్రి ఓ విషక్రిమి పాముకాటుకు చచ్చిపోతాడా అని
సర్పయాగం చేసి సర్పజాతినే దాదాపు సమూల నాశనం చేసిన
పరీక్షిత్తు కుమారుడు- ఆ జనమేజయుడూ.... అతడు విన్న కథా...
దృశ్యమదే... దృష్టిలో తేడా...

కృష్ణ నిర్యాణమై కలికాలమొచ్చి 5122 సంవత్సరాలయ్యింది-
ఈ జనవరి ఒకటిన జనాలకు తెలిసింది ఒక విషక్రిమి గురించి...
అందరూ దాక్కున్నారు గిరి గుహల్లో, తరుల మాటున, నీతి కోవిదులందరూ-
తగవులాడుకుంటూ పరస్పరారోపణల్లో తలమునకలై ఉన్నప్పుడు...
జనగోవర్ధనగిరి ఎత్తిన అపరకృష్ణులకు చెయ్యి నెప్పెట్టి ఇక ఎవరి చావు
వాళ్ళని చావమన్నారు...
అమెరికా శ్యాముడి ఆర్భాటపు అభిచార హోమాల్లో పుట్టిన కృత్యాగ్ని
ఉగ్ర రేసియల్ దావాగ్నిలో అగ్ర పరువు నష్టం బంకర్లోకి పోగా
అక్కడ పచ్చ నది పక్కన ఎర్ర డ్రాగను పకపకా నవ్విన నవ్వులు
ప్రతిధ్వనులై ప్రపంచమంతా వినరాగా...
దృశ్యమదే... దృష్టిలో తేడా....

ఈ ప్రళయవేళా సంభూత జీమూత సంఘాత ప్రభూత
ఘుమఘుమాటోపనినదాధరీకృత మహాదుస్సహ కహకహ
నిబిడనిస్వన నిర్ఘోష పరిపూరిత కుహర, నభ్రంలిహాకీలా సముత్కట
పటు చిటచిట స్ఫుట స్ఫుటద్విస్ఫులింగ విసరంబగు చక్రాన్ని విసిరి
మనల్ని కాపాడెదెవరో...
జనమే జయం కదా!
దృశ్యమదే... దృష్టిలో తేడా...!

✧✧✧✧✧

# 57. స్విచ్చి అక్కడ చీకటి ఇక్కడ...!

డెబ్బై మూడేళ్ల క్రితం ఆరువందల చిరుగుల్ని కుట్టి,
మూడు రంగులతో నేసుకున్న నూలు వస్త్రమిది...
జరీ అంచుల దగ్గర సరిగా కుట్టే దర్జీలే కరువయ్యారు...
అర్ధరాత్రి కాగానే ఆనాటి అనంత ఆర్తనాదాలు వినబడి,
ఏదో వస్త్రం పర పరా చింపేసిన ధ్వని...
అంచుల నిండా రక్తపు మరకలు కన్నీటి తడులు...
గుండె కలుక్కుమంటుంది గాయాల మూలుగులు వినబడ్డప్పుడల్లా...
చిరుగుల్ని చిక్కటి రాత్రి చీకటిలో కుట్టడమే ఎప్పుడూ...
ఏనాడూ వెలుగు మనకందుబాటులో లేదు...
ఎందుకంటే... స్విచ్చి అక్కడ చీకటిక్కడ...

నీ చేతిలో నీకు తెలిసిన మ్యాపు పట్టుకుని నువ్వు
అతడి చేతిలో అతడికి ఇచ్చిన కాలపు మ్యాపుతో అతడు చీకటిలో ఇద్దరూ...
సైనిక దుస్తుల్లో నీవున్నపుడు నీలో ఒక దేశపు ఉద్రేకం పొంగుతుంటుంది...
మృత్యువు సంచరించే మంచులోయల్లో సమాధానాల్లేని ప్రశ్నలతో తోసుకుంటారు...
తెల్లవారేసరికి జీవితాలు తెల్లారి, శీతల నదుల్లో మునిగి
ఘనీభవించి మంచు ముక్కలుగా తేలుతారు...
దేశం దేశం ఒక్క మనిషిగా దుఃఖిస్తుంది రెండు వేపులా...
ఎందుకంటే... స్విచ్చి అక్కడ చీకటిక్కడ...

రాజకీయ భాషలో నువ్వంటావు అది వెంట్రుక కూడా మొలవని
అతిశీతల బట్టతల అని...
నీ వాళ్ళలోనే అతి మితవాదులూ, మిత అతివాదులూ
నిన్నొక నిలువెత్తు పరాజయానికి ప్రతీకగా నిర్వచిస్తారు...
మన పేర్లూ, అక్షరాలున్న నేల అంతా మనదే అని అఖండ భావన నీది...
అతడి భాష వేరు... అతడి కాంక్ష వేరు... అతడు అనుకున్న పొలిమేర వేరు...
లావై పోవాలని నిర్ణయించుకున్నాక బాడీ లాంగ్వేజ్ మారిపోతుంది...
ఎందుకంటే... స్విచ్చి అక్కడ చీకటిక్కడ...

ఒక్కోసారి అనిపిస్తుంది....
ప్రతిరోజూ ఏదో రకంగా మాటలతోనో, మారణాయుధాలతోనో,
ఏదో ఒక నెపంతో కొట్టుకుంటున్న ఈ మనుషులు...
ఆ కనిపించని వాళ్ళాడుకునే చదరంగపు గడులపైన పావులేనేమో...
ఎత్తులు వాళ్ళేస్తుంటే కదుల్తారు సైనికుల్లా వీళ్ళు అంతేనా...!
పావులు పడిపోతున్నాయి లోయల్లోకి మృత్యువు చుట్టుముట్టగానే...
రాజులకు చెక్‌పెట్టే పరిస్థితి లేదు...
ఎందుకంటే... స్విచ్చి అక్కడ చీకటిక్కడ...

✧✧✧✧✧

# 58. అన్నీ ప్రత్యేకతలే ఈ అర్ధరాత్రి స్వతంత్ర దేశానికి

బ్రహ్మాండం పగిలినప్పుడు...
ఆ కనిపించని విధాత కాలమనే కుమ్మరిసారే తిప్పుతూ
ఇంత దుమ్మూ, ఇంత గాలీ, ఇన్ని నీళ్ళూ కలిపి గ్రహాల కుండలు చేసి
విశ్వపు బట్టీలో కాలుస్తూ,
కొన్నిటిని తీసి, చల్లారిన వాటిలో దినుసుల్ని నింపుతూ తన పనిలో తానున్నాడు

అనంత విశ్వ ప్రదేశంలో ఓ మహాజ్వాలాఘటం చుట్టూ,
తమ చుట్టూ తాము తిరుగుతున్న సౌర కుటుంబంలో,
నీళ్ళున్న ఈ భూమి కుండ పగిలింది రెండు వందల మిలియను సంవత్సరాలప్పుడు,
నీళ్ళన్నీ పాంథాలస్సా మహా సముద్రంగా,
కుండ పెంకులన్నీ పాంగియా అనబడ్డ నేలగా...
గమ్మత్తేమిటంటే నీళ్ళెక్కువా, నేల తక్కువా ఈ మొండి ఘటానికి...

నూట నలభై మిలియను సంవత్సరాలప్పటి మాట...
పాంగియా నేలతల్లి రెండు ముక్కలై లారేషియా, గోండ్వానా - గోండుల రాజ్యంగా,
మధ్యలో టెథిస్ అనే పగులు... దాంట్లో సముద్రం నీళ్ళూ--
కొత్త సరిహద్దులూ, కొత్త సముద్రం...
గోండ్వానా ముక్కలై ఆఫ్రికా, మడగాస్కర్, ఇండియా, ఆస్ట్రేలియా,
అంటార్కిటికా, దక్షిణ అమెరికా పెంకులు విడిపోయి కాలరథపు దారిలో...

ఇండియా పెంకు వెళ్ళి ఆసియా పెంకును విసురుగా గుద్దుకున్నపుడు
వినువీధిని తాకేలా ఎగసిన మట్టీ, రాళ్ళూ, నీళ్ళతో ఏర్పడ్డాయి టిబెట్,
హిమాలయ పర్వతాలూ, 8848 మీటర్ల ఎత్తూ, 2400 కిలోమీటర్ల
పొడవూ, అయిదు కోట్లకు పైగా జనం, అయిదు దేశాలకు- నేపాల్,
భూటాన్, పాకిస్తాన్, ఇండియా, చైనా- సరిహద్దూ ఆ అతిశీతల
మహోన్నత మంచు పర్వతాలు...
అయిదు కోట్ల సంవత్సరాల వయస్సు...
సజీవ పర్వతాలు తమ్ముడూ ఇవి- యేడాదికి అయిదు మిల్లీమీటర్లు
పెరుగుతూన్నాయి, ఇండియా పెంకు సంవత్సరానికి 67 మిల్లీమీటర్లు
చొచ్చుకుపోతూనే ఉన్నది ఆసియా పెంకులోకి...

అందుకే అక్కడ అనుకోని మంచుతుఫానులూ... భూకంపాలూ...
పదివేల సంవత్సరాలప్పుడు ఆఖరి మంచు యుగం తగ్గడం ప్రారంభమయ్యింది...
మానవ జాతి నాగరికతా ప్రాభవం మొదలయ్యింది...
ఈజిప్టు, మెసపొటోమియా, ఇండియా, చైనాలలో...
నైలునది, యూఫ్రటిస్- టైగ్రిస్, సింధు, పసుపుపచ్చ నదుల వద్ద
నాగరికతా ఊయలలు ఊగాయి...
సంపదలతోపాటు సరిహద్దుల తగాదాలూ, అసంఖ్యాక యుద్ధాలూ,
అనేక తెగల నిర్మూలనాలూ...

పదివేల యేళ్ళప్పుడు పది మిలియన్ల లోపున్న మానవజాతి
క్రీస్తు కాలం నాటికి మూడు వందల మిలియన్లకు...
ఇప్పుడు 7800 మిలియన్లు... జాతి విస్ఫోటనం...
4.4 మిలియను చదరపు కిలోమీటర్ల ఇండియా పెంకులో, బంగ్లాదేశ్,
భూటాన్, మాల్దీవులు, నేపాల్, పాకిస్తాన్, ఇండియా, శ్రీలంక -
1700 మిలియన్ల ప్రజలూ...
జనమెక్కువా- నేల తక్కువా...
యిటు ఇండియా- మూడు మిలియను చదరపు కిలోమీటర్ల భూమీ...
1300 మిలియన్ల జనాభా... ప్రపంచంలోనే అతి పురాతన
సజీవ మతమున్న ఏకైక దేశం...

1947-1949... రవి అస్తమించని సామ్రాజ్యపు దొరలు
ఈ రెండు దేశాల్నీ పీల్చి పిప్పి చేసి
ఒకదాని ఓపియం- గంజాయి మత్తులో,
ఇంకొక దానిని మతపు మత్తు ఘర్షణల్లో వీలైనన్ని రావణ కాష్ఠాలు వెలిగించి
చిన్నాభిన్నం చేసి సరిహద్దుల్ని గీసీ గీయకుండానే ‘స్వతంత్రమిచ్చాం-
తన్నుకు చావండి’ అని... తప్పుకున్నారు...
అక్కడా ఇక్కడా విప్లవాలూ, స్వతంత్ర సమరాలూ...
మిలియన్ల కొద్దీ అమాయక ప్రజల మరణాలూ...
వాళ్లు ఎర్ర జెండా కింద యేకమయ్యారు...
వీళ్ళు రంగు రంగు అజెండాల్లో చీలిపొయ్యారు...
వాళ్ళకున్నది ఒకే ప్రజ- ఒకే చైనా నినాదం...
ఇక్కడ భిన్నత్వంలో ఏకత్వం అనే ఆశా వాదం...

ఎక్కువ ప్రజలున్న చోట్ల నుంచే... ఎక్కువ సంపదలున్న చోటుకి...
ఎక్కువ వలసలు...
ఎక్కువ పీడకులూ– నియంతలున్న తావునే ఉద్భవిస్తారు ఎక్కువ
ఆలోచనాపరులూ, ప్రవక్తలూ...
నమ్మకాలూ, ఆచారాలూ మతాలుగా, విధానాలుగా, జ్ఞానంగా––
ఎక్కువ జ్ఞానమున్న చోటికి జ్ఞానార్థులు విద్యార్థులై వేల కిలోమీటర్లు
నడిచి వెళ్ళేవాళ్ళు––
సిల్కు దారులమీద నడిచి ఒక శాంతి మతం హిమాలయాలు దాటి
చైనాకు వెళ్ళింది...
చీనీ చీనాంబరాలు సిల్కు దారులలో తరలి వచ్చి ఇక్కడి దేవతలకు,
రాజులకు నచ్చిన వస్త్రాలైనాయి...

ఐరోపా దేశాలలో అబ్రహాం మతాలు రెండు వలస వెళ్ళిన
సాహసికులతో ఖండ ఖండాంతరాలకూ వ్యాపించగా...
మూడో మతం అరేబియా ఆగ్రహాన్ని కరవాలంగా అన్ని దిక్కులా విస్తరించింది...
అనాది నుంచీ ఈ ఇండియాలో మానవ జాతుల అన్ని తెగలూ చేరుకుని
స్థిరపడినారు– కాకసాయిడ్లూ, ఆస్ట్రాలోపిథికన్లూ, నీగ్రాయిడ్లూ,
మంగోలాయిడ్లూ, ఉపతెగలూ, వర్ణాలూ, కులాలూ, ఉపకులాలూ,
ఆశ్రితకులాలూ... ఇన్ని జాతులూ, తేడాలున్న దేశమిదొక్కటే...

అక్కడ మతమంటే ఒక మానసిక వికారం–
వాళ్ళు దేశాన్ని ప్రాణం కంటే ఎక్కువగా గౌరవిస్తారు...
ఇక్కడ మతస్థులకు వాళ్ళ వాళ్ల మతాలపై అంతులేని మమకారం...
మతం కోసం ప్రాణాలిస్తారు– తీస్తారు...

కేవలం మంగోలాయిడ్లే ఉన్న దేశం చైనా... ప్రాంతాల భేదాలున్నా వాటిని
దాటుకొచ్చి నేడది– ఒకే జాతి– ఒకే చైనా...
టిబెట్ విలీనం తర్వాత... హాంకాంగ్, తైవాన్ లాంటి ముక్కల్ని
తనలో కలుపుకోవాలన్న లక్ష్యం దానిది....
ఒకప్పటి అఖండ భారతదేశం గాంధారం, కన్యాకుమారీ కుమరకం,

ఇటు పర్షియా– అటు చైనా వరకూ విస్తరించిన సామ్రాజ్య స్వప్నం
నీటిబుడగల్లా పేలిపోగా అసంఖ్యాక వైరుధ్యాలతో సరిహద్దులతో...

నిత్య మహాభారత యుద్ధాలతో నిద్రలేక గతకాలపు గొప్పల్ని
నెమరువేస్తున్న చిత్రం దీనిది...

పదిహేనువేల కిలోమీటర్ల భూసరిహద్దులూ, ఏడువేల అయిదు వందల కిలోమీటర్ల జలసరిహద్దులున్న దేశానికి...
అన్నివేపులా గొడవల్తో పెద్దన్నయ్య పరిస్థితి...
అన్ని తగాదాల కన్నా అన్నదమ్ముల తగాదాలు అధిక నష్టాన్ని తెస్తాయని మహాభారతం చెప్పినా...
సరిహద్దుల గొడవలెప్పటికీ సమసిపోయేట్లు లేవు...
పిల్లుల తగాదాను కోతి తీరుస్తుందా?
3488 కి.మీ. చైనా బోర్డరు, 3323 కి.మీ. పాకిస్తాను,
1751 కి.మీ. నేపాల్, 1643 కి.మీ. మైన్మార్, 4096 కి.మీ. బంగ్లాదేశ్,
699 కి.మీ. భూటాన్, 106 కి.మీ. ఆఫ్ఘనిస్తాన్...
లెక్కలు తెగే లోపల రెక్కలు తెగిపోతున్నాయి సైనికులకు...

ఒక నిర్ణీత కాలం లోపల ఇచ్చి పుచ్చుకునే వ్యవహారంతో ఈపాటికే సరిహద్దు రేఖలు స్థిరమయితే... ఈ అగ్ర సమావేశాల, సైనిక విన్యాసాల, యుద్ధాల ఖర్చు, ప్రాణ నష్టం తగ్గేవి కాదా!
ఇప్పుడు బోర్డర్ల వద్ద ఎగోల పొగర్లు కర్రలకు ఇనుప ముళ్ళ వైర్లు చుట్టి కొట్టుకుంటున్నాయి...
ఏమాత్రం అదుపు తప్పినా అణ్వస్త్రాలు అటూ యిటూ దూకుతాయి...
కాగల కార్యము గంధర్వులే చేసారని ఆయుధ వ్యాపారస్తులప్పుడే ఆనందపడుతున్నారు...
చిలికి చిలికి గాలివాన ప్రళయకాలపు తుఫానైతే...

అంతా పూర్తయ్యాక నేల పెంకుల మధ్య మనిషి పెంకు...
కనిపించీ కనిపించకుండా కథ ముగుస్తుంది...
మళ్ళీ ఆ కనిపించని విధాత కాలమనే కుమ్మరిసారె తిప్పుతూ
ఇంత దుమ్మూ, ఇంత గాలీ, ఇన్ని నీళ్ళూ కలిపి
గ్రహాల కుండలు చేసి విశ్వపు బట్టీలో కాలుస్తూ,
కొన్నిటిని తీసి, చల్లారిన వాటిలో దినుసుల్ని నింపుతూ తన పనిలో తానుంటాడు...

అన్నీ ప్రత్యేకతలే ఈ అర్ధరాత్రి స్వతంత్ర దేశానికి...!

✧✧✧✧✧

# 59. ఏడుగురు అక్కాచెల్లెళ్ళూ-
# అయిదు వేళ్ళూ-ఒక కోడి మెడా...

ఉదయకాంతుల వెలిగే పర్వతాలున్న అరుణాచల ప్రదేశం,
కామరూపమనీ, ప్రాగ్జ్యోతిష పురమనీ పేరుబడిన అస్సామూ,
మువాపొలిగా పేరొందిన మణిపూరూ,
మేఘాల ఆలయం మేఘాలయా,
మిజోల శీతల్ దేశం- మిజోరామూ,
చెవులకు తాటంకాలూ, ముక్కులకు నగలూ ఉన్న జనుల నాగాలాండూ,
జలధికి దగ్గరగా ఉన్న త్రిపుర సుందరీ దేశం- త్రిపురా...
భారతదేశపు ఈశాన్య ప్రాంతపు అందాల అక్కాచెల్లెళ్ళు
వాళ్ళేడుగురూ...
వారికి ఈమధ్యనే తోడైనది సిక్కిం సోదరీమణి- తన కొత్త హోదాలో...

అక్కడ పచ్చ నది దగ్గర ఎర్ర డ్రాగను కళ్ళెర్ర చేసింది...
ఒకప్పటి ప్రపంచపు పైకప్పు టిబెట్టు ఇప్పుడు తనది కాగా.
తన అయిదు వేళ్ళతో ఆసియా ఖండపు అయిదు ప్రాంతాలపై బెట్టు
చూపిస్తోంది... నేపాల్, భూటాన్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, లడఖ్...
ఎన్నాళ్ళుగానో నిర్లక్ష్యానికి గురైన నేపాల్ ఇప్పుడు చైనా పల్లవి పాడుతున్నది,
ఎర్ర భూతానికి భయపడి భూటాన్ ఇండియాతో చెలిమి చేసింది...
వరిధాన్యాల లోయ సిక్కిం భారత దేశంలో భాగమయ్యింది...
అరుణాచలప్రదేశ్‌లోని తవాంగ్ బౌద్ధ ఆశ్రమం తనదేనన్నది చైనా...
1962 యుద్ధపు ఛాయలింకా కానవస్తూనే ఉంటాయక్కడ...
భారత ధాయాది పాకిస్తాను తన ఆంతరంగిక మిత్రుడే...
తనది కాని స్థలాన్ని ఎంతైనా ధారపోస్తాడతడు...
ఇప్పుడు బంగ్లాదేశ్, శ్రీలంకలకు తీర్చలేనన్ని వరాల అప్పులిచ్చి స్థావరాల
నేర్పరుచుకుంటున్నది మెల్ల మెల్లగా...
భారతదేశం చుట్టూరా ఇప్పుడు చైనా ఫ్లడ్ లైట్లే!

భారతదేశం లోపల అన్నీ చైనా వస్తువుల సందడే,
వారాంతపు తిండీ తిప్పల్తో సహా...

పశ్చిమ బెంగాల్ నుంచి సప్తసోదరీమణుల రాష్ట్రాలకూ వెళ్ళే దారి
అత్యంత సన్నసైనది... అదే సిలిగురి కారిడార్...
కోడి మెడలా... ఇరవై రెండు కిలోమీటర్ల వెడల్పు-
చైనా లోని ఉయిగుర్లు, టర్కీ ప్రజలు తమ భాషలో కోడిని హింద్ అంటారు
మనం కొన్ని కోళ్ళను టర్కీలంటాం అంతే తేడా...

ఇలాంటిదే అఖ్నూర్ డాగర్- మరో కోడి మెడ - పాకిస్తాన్ అధీనంలో ఉండి,
1965 యుద్ధంలో ఇండియాను భయపెట్టిన పిడి బాకు...

మన కోడి మెడ పక్కోడి చేతిలో పడితే-- ఇంతే సంగతులు తమ్ముడూ...
ఆ సమర భేరీల ప్రతిధ్వనులే వినిపించాయి నిన్న గాల్వాన్ లోయలో...
మరణ మృదంగాలను మోగిస్తున్నవి ఆ అయిదు వేళ్ళే!

✧✧✧✧✧

# 60. నాడుల కథా-కమామీషూ...

చిన్నా పెద్దా సూక్ష్మ స్థూల నాడులు మన దేహంలో
మూడున్నర లక్షలుంటాయని విజ్ఞుల విశ్వాసం...
టెలివిజను యాంటెన్నాల్లా శరీరంపై వెంద్రుకలుంటాయంటారు
వాటిని అనుసంధానం చేస్తూ...
డెబ్భై రెండువేల నాడుల్లో వాయువు సంచరించి కల్మషరహితం
కావిస్తుంది దేహాన్ని...

వెయ్యి డెబ్భై రెండు స్థూల నాడులు పంచేంద్రియాల వ్యవస్థలో భాగాలు...
ఏడు వందల ప్రధాన నాడులు...
పదునాలుగు ముఖ్య నాడులు... ఇడా, పింగళ, సుషుమ్నా, సరస్వతి,
వారుణి, పూషా, హస్తిజిహ్వా, యశస్విని, విశ్వోదరి, కుహూ, శంఖిణి,
పయస్విని, ఆలంబుసా, గాంధారి...
ఎడమ నాసికా రంధ్రంలో- ఇడా, కుడివేపు- పింగళ,
బ్రహ్మరంధ్రంలో- సుషుమ్నా, నాలుకపై- ఆలంబుసా...
ఎడమ కన్నులో గాంధారి, కుడి కన్నులో-- హస్తిజిహ్వా-
ఎడమ చెవిలో యశస్విని, కుడిచెవిలో పూషా,
తలమీద శంఖిణి, శిశ్న మూలాన-కుహూ... ఇవి నాడులు

వాయువులు పది- పంచ ప్రాణవాయువులు- ప్రాణ, అపాన, సమాన,
ఉదాన, వ్యానములు...
మరో అయిదు వాయువులు- నాగ, కూర్మ, క్రుకర, దేవదత్త, ధనంజయములు...
బొటన వ్రేలిలో- భూత నాడి,
చూపుడు వ్రేలిలో- జలగలా మెలికలు తిరుగుతూ నడిచే- వాత నాడి,
మధ్య వ్రేలిలో- నెమలి-హంస నడక నడిచే- పిత్త నాడి...
అనామికలో- కోడి నడకతో- శ్లేష్మ నాడి...
చిటికిన వ్రేలిలో- గురు నాడి నడుస్తాయని చెబుతుంది నాడీ శాస్త్రం...

రోగ నిర్ధారణలో ఇవి అత్యంత కీలకం...
అసూర్యంపశ్యలైన అంతఃపుర రాచ కన్యకల ఎడమచేతి మణికట్టుకు దారం కట్టి...
ఆ దారపు కదలికతో నాడీ పరీక్ష చేసేవారానాటి భిషగ్వరేణ్యులు...
ఇప్పుడంతా చైనా గాలి వీస్తుంది కదా...
ఆ వైద్యులకు యిరవై తొమ్మిది పల్సు రకాలు తెలుసు...
కన్, గ్వన్, చి విధానాలతో నాడీ పరీక్ష చేస్తారక్కడ...
యిన్-యాంగ్‌ల సమతుల్యత సమీక్షిస్తారు...

నాడీ జ్యోతిష్యం తమిళ, కేరళ దేశాల్లో అత్యంత ప్రసిద్ధం...
అగస్త్య విరచిత వట్టేఝుతు నాడీ గ్రంథమున్నది- తమిళదేశపు- చిదంబర పట్టణానికి యిరవై ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వైధీస్వరన్ కోవెలలో...
పన్నెండు రాశులలో-- ఒక్కో రాశిలో- నూటయాభై నాడులూ...
మొత్తం 1800 నాడులు...
వ్యక్తుల భూత వర్తమాన భవిష్యత్తులు చెబుతాయనేది నమ్మినవారి విశ్వాసం.
కేరళలో- చంద్రకళా నాడి... దేవ కేరళంగా
ఉత్తర దేశాన- భృగు సంహిత, పరాశర సంహితలూ మానవునికి భవిష్యత్తును తెలుసుకోవాలనే అన్వేషణలో దిక్సూచిలుగా కానవస్తాయి...

ఈ దేహ నాడులు కాక
మనదేశంలో... తెలుగు నాడు, తమిళ నాడు, చేర నాడు,
అలనాటి పలనాడు, ఇలా ఎన్నో నాడులు...

ఒక నాడుతో ఇంకో నాడు నాడీ కలహాలకు పోకుండా
అన్ని నాడులూ బాగుంటేనే దేహమైనా దేశమైనా బాగుండేది...
ఇప్పటి ధనవంతరులు కాదు మహాభిషక్కు ధన్వంతరి కావాలి...
ఏనాడు వస్తాడో నాడీ పరీక్ష చేసి దేహ దేశాన్నీ,
దేశ దేహాన్నీ వజ్రతుల్యం చేసే ఆ ధన్వంతరి...
శుభం భూయాత్...

✧✧✧✧✧

# 61. రేపటి గ్రహణాలు-రాబోయే రణాలూ...

అదొక మత్తు మందు... అదొక మానసిక వికారం... ఉన్మత్త భావన...
సమ సమాజ నిర్మాణంలో, ఆర్ధిక స్వావలంబనలో అదొక అడ్డుపుల్ల...
మనిషిని బద్ధకస్తుడిగా మార్చి, పరాన్న జీవిగా చేసి
కనిపించే స్వశక్తిని కాదని ప్రతిదీ ఓ అగోచరశక్తి నిర్ణయమని
తప్పించుకుని తిరిగే తత్వాన్నిస్తుంది ఆ భావన...
మానవుడే మహానుభావుడు ఈ భువిలో... అన్ని భావనలూ అతడి సృజనలే...

కాదు కాదు... అదొక ప్రేమౌషధం... మానసిక తన్మయత్వం... ఉన్నత భావన...
చక్కని సమాజ నిర్మాణంలో, ఆర్ధిక స్థితిని ఆశీర్వదించడంలో,
పాపపుణ్యాలు బేరీజు వేయడంలో, మతమొక ఆలంబన...
మానవ అంచనాల కందని... ఆ మహా శక్తిరూపం సర్వ వ్యాపకమై,
అన్నిటిలో ఉంటూ అన్నిటిని గమనిస్తూ, దుష్ట శిక్షణ శిష్ట రక్షణ చేస్తుంది...
సమస్త జీవకోటినీ రక్షించే కరుణామయుడూ, అనాథ రక్షకుడూ,
అత్యంత శక్తిమంతుడూ ఆ ప్రభువే... ఆ సృష్టికర్తే...
ఈ చరాచర జగత్తులన్నీ ఆ విశ్వరూపుని సృజనలే...

ఫాలున్ గాంగు కావచ్చు, ఉయుగుర్లు కావచ్చు, శిలువనెక్కినవాని శిష్యులు
కావచ్చు... సంఘం శరణమన్న భిక్షకులు కావచ్చు...
వాళ్లు తమ ఇళ్ళలో పరిమితం చేసుకోవాలి తమ ఆలోచనలను...
ఆరామాలూ, ఆలయాలూ, ఆరాధనా స్థలాలూ కాదు ముఖ్యం...
రహదారులూ, వంతెనలూ, ఆనకట్టలూ, నూతన జ్ఞాన పరిశోధనలూ కావాలి...
మా పదివేల మైళ్ళ ఇనుప గోడను తుప్పు పట్టించే విదేశీ ఉప్పు మాకక్కర్లేదు...
ఎవరి మతం వారిది... జీవన పరుగుపందాలలో అలిసిన వాళ్ళకు

మానసిక ప్రశాంతత నిచ్చి, నిదుర పుచ్చుతుంది దైవ భావన...
పూలు పూచి ఆలోచనలు వికసించినట్లు వేయి మతాలు విలసిల్లనీ...
అతివాదులన్ని భావనల్లోనూ ఉంటారు...

సర్వేజనాస్సుఖినోభవేత్ అనే భావన కన్నా సుందరమైన ఆలోచన యేమున్నది?
ఈ మానవ నిర్మితాలన్నీ భగవానుని ఒక్క ఆగ్రహ చూపుతో భస్మమవుతాయి...
మా పదివేల భావనల సముద్ర తరంగాలను ఏ యినుప గోడా ఆపలేదు...

అవునా చూద్దాం ఎవరి శక్తి ఏపాటిదో! మిమ్మల్ని మీ దేవుడే కాపాడు గాక!
మేమూ చూస్తాము! నీవూ చూస్తావు చివరికి ఎవరు మిగుల్తారో!
మిమ్మల్ని మా దేవుడే రక్షించు గాక!

రేపు సూర్య గ్రహణం... జ్ఞాన సూర్యుడిని మూర్ఖ రాహు కేతువుల
మబ్బులు కమ్ముతాయి...
భూమికీ సూర్యుడికీ మధ్య చంద్రుడు అడ్డు రాబోతున్నాడు
అగ్నిజ్వాలా వలయాన్ని సృజిస్తూ...
యుద్ధాలన్నీ వైరుధ్య జనితాలే!

నీటి కోసమైనా, దైవం కోసమైనా కొట్లాటల్లో రక్తం,
ప్రాణాలు ధారపోసేప్పుడు కన్నీటి వలసలు తప్పవు...

మానవ జాతికి పట్టే పెద్ద గ్రహణం యుద్ధమే...

✧✧✧✧✧

# 62. తమను నమ్మిన భార్యలనమ్మిన వాళ్ళు...

చందన కర్పూర కస్తూరీ పరిషిక్తంబైన చదరంగపు బల్లా...
మోంటే కార్లో, లాస్ వెగాస్ క్యాసినోల్లాగా వెలిగి పోతుండగా...
గంధ పుష్పార్చితంబులైన అభిమత అక్షాలూ...
పరిచారకుల్లారా తెండి... ఖిబీటక– బభ్రు పాచికల్...
తిప్పండి అక్ష చక్రం...

శకుని నవ్వాడు... సుయోధనుడు, కర్ణుడు, దుశ్శాసనాది శత
సోదరులూ నవ్వారు...
ధర్మరాజు చిరునవ్వు నవ్వాడు... తమ్ముళ్ళూ నవ్వారు...
భీష్మ, ధృతరాష్ట్ర విదుర కృప ద్రోణ అశ్వత్థామలూ నవ్వారు...
చానా రోజులయ్యింది ద్యూత క్రీడ చూసి...
శకుని–ధర్మరాజు పాచికలు విసరడం మొదలెట్టారు...
సహస్ర సహస్ర నిష్కాయుత సువర్ణ భాండారాలూ, నవరత్న నిధులూ,
అసంఖ్యాక పరిచారకులూ, గుర్రాలూ, ఏనుగులూ, వనాలూ,
భవనాలూ అన్నీ పోగొట్టుకున్నాడు ధర్మరాజు...
వాళ్ళు నూటరెండు మందీ నవ్వుతూనే ఉన్నారు...
వీళ్ళు అయిదుగురూ గుండెలు బిగబట్టుకుని పాచికల వంక చూస్తూనే ఉన్నారు...
చుట్టూ ఉన్న వాళ్లు పెదాలు గోళ్ళూ కొరుక్కుంటున్నారు ఉత్కంఠతతో...
ఇక చాలు ఆపమనండి మహరాజా– అన్నాడు విదురుడు...
ఎప్పటిలానే అది అరణ్య రోదనే...

తన మాట వినే పాచికలతో శకుని నవ్వుతున్నాడు...
ఈసారైనా గెలుస్తానని ధర్మరాజు నమ్ముతున్నాడు...
తమ్ములనొక్కొక్కరినొడ్డి, తననొడ్డి ఓడి తలదించుకున్నాడు ధర్మజుడు...
శకుని నవ్వాడు... కమలాక్షి పాంచాల కన్య నీకు ధనము కాదే?
ద్యూతపు మైకంలో ఒక్క క్షణం ఆలోచించకుండా పందేం కాసి... ఓడిపోయినాడు...
దుర్యోధనుడు నవ్వాడు... శతసోదరులు నవ్వారు...

మయసభలో నేను పడిపోతే మీరు నవ్వలేదా… ఇప్పుడు మీ సంపదలూ
ఆ మయసభా మీరూ ఆ పాంచాలీ నా సేవకులే… బానిసలు…
ఏమి, ఇప్పుడు నవ్వు రావడం లేదా? తీసుకురా ఆ బానిస స్త్రీని!
ఎలా నవ్వుతుందో చూస్తాము… అహ్హహ్హా…
ధర్మరాజట… భార్యను పందెం కట్టి ఓడిపోయినాడట… అహ్హహ్హా…

ఆమె వల్లనే రాజ్యం దక్కిందని మరచిపోయి రెండోసారి మరలా ఆడగా
ఓడి అడవుల పాలైనారు పాండవులు భార్యతో సహా….
శకుని నవ్వాడు… సుయోధనుడు, కర్ణుడు, దుశ్శాసనాది శత సోదరులూ
నవ్వుతూనే వున్నారు…

పదిహేనేళ్ళు, నానా కష్టాలు పడ్డాక…
నలభై లక్షల మంది - 18 అక్షౌహిణీల సైన్యంలో
మిగిలింది కేవలం పన్నెండు మంది…
ధర్మరాజు సంపాదన దాయాదుల పిండాకూళ్ళకు సరిపోయిందని…
ద్యూతంలో పోగొట్టుకున్నది యుద్ధంలో గెలుచుకోవాల్సి వచ్చిందని…
ధర్మరాజు చిరునవ్వు నవ్వాడు… తమ్ముళ్ళూ నవ్వారు… ద్రౌపదీ నవ్వింది…
ఆ నవ్వుల్లో జీవకళ అంతగా లేదు…

ఏనాడో చెప్పారు- ఋగ్వేదం-10-34… జూదరుని విలాప సూక్తంలో…
ప్రియురాలితో సమాగమానికై తహతహలాడిపోతున్నట్లు…
ఈ పాచికలాట నన్ను పిలుస్తున్నది…
నేను ఓడిపోతున్నపుడు నా తల్లిదండ్రులు, సోదరులు- వీడెవడో మాకు
తెలియదంటారు… నా భార్య నన్ను వదిలివేస్తుంది.
ద్యూతాన్ని వదిలితేనే వాళ్ళు మరలా నన్ను చేరదీస్తారు… అని వాపోతున్నాడు…
మంచి మాట ఎవ్వరూ వినరు…

ధర్మరాజు కన్నా ముందే చాలాకాలం కిందటి కథ…
నిషాధ దేశపు రాజు నల చక్రవర్తి… తొలి పాకశాస్త్ర గ్రంథ రచయితా,
అశ్వ హృదయమునెరిగిన మహారథికుడూ, సారథీ అతడు…
విదర్భ రాజకుమార్తె అందాల దమయంతి…

ఇద్దరి మధ్యా హంస రాయభారం... అద్భుత ప్రేమాయణం...
-నల దమయంతులిద్దరు మనః ప్రభవానలబాధ్య మానలై సలిపిరి దీర్ఘ వాసర నిశల్-...
విదర్భకు బయలుదేరిన నలునికి దారిలో అడ్డు తగిలి
ఇంద్ర, అగ్ని, వరుణ, యమ దేవతలు...
తమలో ఒకడిని చేసుకొమ్మని చెప్పమని నలుడిని రాయబారిగా పంపారు
దమయంతి వద్దకు...
ఆమె ఒప్పుకోలేదు...

స్వయంవర మండపంలో ఒకే పోలికలో అయిదుగురు...
వీళ్ళలో నలుడెవ్వరు? దేవతలెవ్వరు?
ప్రార్థించిందామె కరుణించమని...
ఆమె ప్రేమను మన్నించారా అనిమిషులు, అస్వేదగాత్రులు, అవనీతలంబు
ముట్టక ఆసన్నులై ఉన్న ఆ దేవతలు...
మానవుడైన తన ప్రియుడిని గుర్తించి వరమాల వేసింది దమయంతి...
పొంగిపోయాడు నల రాజు నెలరాజులా...

శని ఆగమనంతో కృష్ణపక్షం మొదలయ్యింది...
దాయాది పుష్కరుడితో జూదమాడి రాజ్యం పోగొట్టుకుని అడవులపాలైనాడు...
తమ ఇద్దరు పిల్లలను తండ్రి గారింటికి పంపి భర్తను అనుసరించిందా యిల్లాలు...
అర్థరాత్రి భార్యను వదిలేసి పారిపోయి పాము కాటుకు గురై వికృతరూపుడై-
బాహుకుడై అయోధ్యా నగరపు ప్రభువైన ఋతుపర్ణుని అశ్వశిక్షకుడైనాడు...

బహు కష్టాలుబడిన దమయంతి విదర్భకు చేరుకుని...
నలుడు బాహుకుడై అయోధ్యలో నున్నది తెలుసుకుని
తన రెండో స్వయంవర ప్రకటన పంపింది అయోధ్యకు...
శని తొలగగా సుందరుడైన నలుడై దమయంతీ సమేతుడై,
అక్షహృదయం తెలిసిన ఋతుపర్ణుడికి అశ్వ హృదయమిచ్చి
తాను పాచికలాట మర్మాల నెరిగి
దాయాది పుష్కరుడితో యుద్ధమా, ద్యూతమా? అని సవాల్ విసిరినాడు- నలుడు-
...పణంగా సర్వ సంపదలూ... భార్య దమయంతీ...
యుద్ధం లేకుండానే నిషధ దేశం తనదయ్యింది... శని తొలిగింది కనుక...

ద్యూతం, యుద్ధం అంతే... మళ్ళీ మళ్ళీ రమ్మని పిలుస్తుంటాయి...
ఎవరు విసిరారో ఈ కరోనా పాచికను...
ప్రపంచమంతా యుద్ధరంగాలే...
శాంతిభద్రతలను పణంగా పెట్టి... పాచికలాట...

విశ్వామిత్రుడి కివ్వాల్సిన ధనం కోసం భార్య చంద్రమతినమ్మిన
సత్య హరిశ్చంద్రుడూ,
తాగిన మైకంలో భార్య సుసాన్‌ను అమ్మిన మైఖేల్... ద మేయర్ ఆఫ్
కాస్టర్ బ్రిడ్జ్‌లో కథానాయకుడూ...
బానిసగా ఉన్న తన స్వేచ్ఛకై భార్యను ఓ తెల్లదొరసానికమ్మి,
ఆ డబ్బుతో తన స్వేచ్ఛను కొనుక్కుని, నానా కష్టాలు పడి ధనం సంపాదించి
తన భార్యను విడిపించుకున్న విలియం-ఓ-నీల్-
ఇంకెందరో...

ద్యూతం, యుద్ధం అంతే... మళ్ళీ మళ్ళీ రమ్మని పిలుస్తుంటాయి...
ఎవరు విసిరారో ఈ కరోనా పాచికను...
ప్రపంచమంతా యుద్ధరంగాలే...
శాంతిభద్రతలను పణంగా పెట్టి... పాచికలాట...

ఇంకెందరో... ఇలా-
తమను నమ్మిన భార్యలనమ్మిన వాళ్ళు...

✧✧✧✧✧

# 63. షష్ఠిః కర్ణో నిపాతితః...

నీ చేత, నా చేత, తల్లి కుంతి చేత,
ధరణి చేత, దేవేంద్రుని చేత,
గురువు పరశురాముని చేత
ఆరుగురి చేతలు చేతులు కలిసినపుడు
ఆరిపోయిందా సూర్యకాంతుల కర్ణదీపం...

అందరికీ పెద్దన్న అతడు జన్మ చేత...
లోకాపవాదభీతికి వెరచిన తల్లి నదిలో వదిలేస్తే
సూర్య పుత్రుడు సూతపుత్రుడయ్యాడు...
జన్మరహస్యం తెలిసిన తల్లీ చెప్పలేదు,
రథ సారథి కొడుకుకు పార్థసారథి చెప్పేంతవరకూ...
ఆఖరి అస్త్రం వేసి అతడి గుణశీలాల్ని పరీక్షకుబెడ్తూ...
ఈ సామ్రాజ్య సింహాసనము నీది, పాంచాలి నీది...
రమ్ము వారి కడకు... అన్నాడు... జగన్నాటక సూత్రధారి...

స్నేహ ధర్మాన్ని వీడి రాను...
ఈ సమర సముద్రంబు దరియన్ ఈది నిన్నున్ కనియెద...
లేకుంటే పైలోకంలో కలుద్దాం...
మిగతా వాళ్ళు నలుగురు దొరికినా విడిచిపెడ్తాను... అర్జునుని మాత్రం చంపి తీరుతాను... పాండవులెప్పటికీ అయిదుగురే... అన్నాడు కర్ణుడు.
దుష్ట చతుష్టయంలో కర్ణుడూ భాగమే...

తనను అర్థరథుడని భీష్ముడన్నందుకు జగడమై... మదీయ సంగర సమయంబున కర్ణుండు కయ్యంబునకు రాడు... అన్నాడు భీష్ముడు
...ఆతడు శరతల్పగతుడయ్యాక యుద్ధపు పదకొండో రోజున
రంగంలోకి దిగాడు కర్ణుడు...
గురువు పరశురాముడు నేర్పిన విద్యలు గురుశాపం వల్ల గుర్తుకురాకుండా పోయాయి...
అర్జునుడి తండ్రి ఇంద్రుడొచ్చి కవచ కుండలాలు తీసుకుపోయాడు...

ప్రతిగా ఇంద్రుడిచ్చిన శక్తి ఘటోత్కచుడిపై వాడాల్సొచ్చింది...
మిగిలిన నాగాస్త్రం అర్జునుడికి తగలకుండా పార్థసారథి జాగ్రత్త పడ్డాడు...
ఈ ప్రతికూల పరిస్థితుల్లో తన సారథి శల్యుడు శత్రువును పొగుడుతూ తనని కించపరుస్తున్నాడు...
నేలతల్లి శాపంతో రథం మట్టిలో దిగబడితే- నేను రాజును-
నేను చక్రం లేపనన్నాడు సారథి శల్యుడు...
చక్రం లేపుతున్నపుడు చక్రి మాటలు విన్న అర్జునుడు
ఘోర శరంభున కర్ణుని శిరస్సు ద్రుంచినాడు...
అలా అరయంగా కర్ణుడీల్గె ఆర్గురి చేతన్... అన్యాయంగా...
అత్యంత విషాదకరమైన పాత్ర అతడిది...

వాళ్ళకైనా మనకైనా రథ సారథి గుండెకాయ లాంటివాడు...
మహాభారత యుద్ధంలో- 18 అక్షౌహిణీల సైన్యంలో మొత్తం రథాలు...
393660... దాదాపు నాలుగు లక్షల రథ సారథులలో...
పేరిన్నికగన్న వాళ్ళు పన్నెండు మంది...
పార్థసారథి- పరమాత్మ శ్రీకృష్ణుడూ,
ఆతడికి ధీటైన మద్రభూపతి- కర్ణ సారథి-శల్యుడూ,
కర్ణుడి తండ్రి- అధిరథుడూ,
ఉత్తర గోగ్రహణమప్పుడు బృహన్నల- అర్జునుడూ,
బృహన్నలకు కాసేపు రథసారథి అయిన- ఉత్తర కుమారుడూ
అర్జునుడిని దేవలోకం తీసుకువెళ్ళిన దేవేంద్రుడి రథసారథి- మాతలుడూ,
శ్రీకృష్ణుని సారథి- దారకుడూ,
అర్జునుడి సభాపర్వ కాలపు సారథి- పూరుడూ,
భీముని సారథి- విశోకుడూ,
ధర్మరాజు సారథి- ఇంద్రసేనుడూ,
ధర్మరాజులా జూదం, భీముడిలా వంటలూ చేయగల గొప్ప సారథి బాహుకుడి రూపంలో- నల మహాచక్రవర్తీ,
మొత్తం మహాభారత యుద్ధాన్నీ దివ్యదృష్టితో ఎపిసోడ్లుగా అంధుడైన ధృతరాష్ట్రుడికి చెప్పిన ఆతని రథసారథి- సంజయుడూ...

అందుకే మనకు గుర్తులేని మన యుద్ధాలూ, రహస్యాలూ...
మన రథ సారథుల ద్వారా తెలుస్తాయి ప్రపంచానికి...
దేశం కూడా ఒక రథం వంటిదే...
శ్రీకృష్ణ సారథ్యమో, శల్య సారథ్యమో
మన సారథుల్ని బట్టి నడుస్తాయి దేశాలూ, జీవితాలూ...

సంసారాన్ని తరించి, మథించేప్పుడు...
మన పాత్ర రథికుడైన నరుడిదా, లేక సారథి నారాయణుడిదా?
నర నారాయణ రథం నందిఘోషలతో, కపిధ్వజంతో
సాఫీగా నడుస్తుంది విజయ మార్గాన...
కర్ణ శల్య కాపుర రథ చక్రం మట్టిలో కుంగినప్పుడు
శల్య సారథ్యమవుతుంది ప్రాణాంతకం...
లేకుంటే...

నీ చేత, నా చేత, తల్లి చేత,
ధరణి చేత, పాలక దేవేంద్రుల చేత,
గురువుల చేత... ఆరుగురి చేతల చేతుల
ఆరిపోతాయి అనేక సైనికుల ప్రాణ దీపాలు...
దేశ రథమైనా, దేహ సదనమైనా, ఆ సంసారమైనా, ఈ సంసారమైనా అంతే!

వారి వారి ఎర్రకోటల నుంచి...
రథాలు గాల్వను లోయ దగ్గరకు వచ్చి కొట్టుకున్నాక...
అడిగారు వాళ్ళు... ఒకరినొకరు...
ఇంతకీ మీలో రథికుడెవరు? సారథి ఎవరు?

✧✧✧✧✧

# 64. బర్బరీకుడి ఖండిత శిరస్సు...

ఆ బాలుడు ఎదురుపడ్డాడు ఆ బాలగోపాలునికి...
మూడు బాణాలూ విల్లుతో ముచ్చటగొలుపుతూ ముచ్చటలాడినాడు...
ఈ బాణం వైరి వీరుల్ని గుర్తిస్తుంది...
రెండవది స్వపక్షాన్ని రక్షిస్తుంది...
మూడవది గుర్తుపెట్టబడిన వాళ్ళను హతమారుస్తుంది...
అవునా! ఈ శతసహస్ర శాఖాయుతమైన చెట్టుకున్న లక్షలాది
ఆకులనూ కట్టగట్టి కాల్చివేయగలవా...
బాలుడు కనులు మూసుకుని అస్త్రమంత్రాన్ని జపిస్తున్నపుడు...
పరమాత్మ శ్రీకృష్ణుడు తన ఎడమ పాదం కింద ఒక ఆకును తొక్కిపెట్టినాడు...
బాలుడు సంధించి వదిలిన బాణం లక్షలాది ఆకులను లక్ష్యాలుగా గుర్తుపెట్టి
శ్రీకృష్ణుని పాదాన్ని తాకి ఆగింది...
కొద్దిగా దెబ్బతిన్న ఆ ఎడమపాదం రేపు బోయవాడి వాడిబాణం తగలగా
అవతార సమాప్తి చేస్తుందని ఆ నీలమేఘశ్యాముడికి తెలుసు...

అయినా బాలుడి నడిగాడు... ఈ కురుక్షేత్ర సంగ్రామంలో నీవెటు ఉంటావని...
ఓడిపోతున్న బలహీనుల పక్షాన పోరాడతాను– అది నేను మా అమ్మకిచ్చిన
మాట... అన్నాడా బాలుడు...
అతడే బర్బరీకుడు... భీముని మనవడూ, ఘటోత్కచుని కుమారుడూ,
మాత మౌర్వి వద్ద విలువిద్య నేర్చుకున్న మహావీరుడూ–
శిరోదాత, త్రిశరుడు, బలహీనుల పక్షపాతి, లీలాశ్వికుడూ, ఖటు నరేషుడూ,
యాలాంబరుడూ, నెమలిపింఛాలంకృత దండహస్తుడూ, బలియాదేవుడు,
ఖటు శ్యాముడు...
18 రోజుల యుద్ధాన్ని ఒక్క నిముషంలో ముగించగల సమర్థుడూ...
అతడిని చూసాడు జగన్నాటక సూత్రధారి...
జయాపజయాలు దైవాధీనాలు– ఎవరు ఓడిపోతుంటే ఇతడు అటు వేపు వెళితే–
అందరూ నశించి ఇతడొక్కడే మిగుల్తాడు... సృష్టి ధర్మానికి వ్యతిరేకంగా...

శ్రీకృష్ణుడు అర్థించాడు ఆ బాలుడిని... నీ తాతలు పాండవులు
సంఖ్యాపరంగా బలహీనులు...

వాళ్లు యుద్ధంలో గెలవాలంటే... యుద్ధ ముహూర్తాన కాళీమాతకు
ఓ మహావీరుడి ఆత్మార్పణ కావాలి... అర్జునుడో, నేనో, భీముడో,
ఘటోత్కచుడో, నీవో... అని ఆగాడు... శ్యాముడు...
నా తాతల తండ్రుల విజయం కోసం నేనే నా తలనర్పిస్తాను...
ఓ జగద్రక్షకా! యుద్ధంలో పాల్గొనలేనందుకు దుఃఖముగా ఉన్నది...
కనీసం ఈ యుద్ధాన్ని చూసే వరాన్ని ప్రసాదించు దేవా...! అన్నాడు
బర్బరీకుడు కన్నీరు వాగులై ప్రవహిస్తుండగా...

ధూపదీపాల మధ్య, భేరీ భాంకారాల మధ్య, స్వజన ఘోషల మధ్య,
తల్లుల దుఃఖ వేదనల మధ్య... బర్బరీకుడి బలి...
ప్రపంచ యుద్ధాగ్నిలో ప్రథమ సమిథ...
ఆ ఖండిత శిరస్సు అనిమిషమై కమ్రు పర్వత శిఖరాగ్రాన ఆసీనమై
వీక్షించింది కురుసంగ్రామాన్ని కన్నులారా...

నలుగురే నలుగురు చూసినారు ఆ మహాయుద్ధాన్ని అన్ని రోజులూ...
బర్బరీకుడూ, కపిధ్వజాన ఉన్న హనుమంతుడూ, ధృతరాష్టుడికి
సమాచారమందిస్తున్న దివ్యదృష్టిగల సంజయుడూ, ఇరావంతుడూ...

ఇరావంతుడు- ఇరావన్, అరవన్... ఇతడు...
అర్జునుడు-నాగకన్య ఉలూపిల కుమారుడు...
తండ్రికి సాయంగా వచ్చి ఎనిమిదవ రోజు యుద్ధంలో అలంబుసుడి
చేతిలో అస్తమించినవాడు...
తమిళదేశపు పెరుంతవరన్ విరచిత పరత వెంపులో యుద్ధానికి
ముందే కలప్పలి- యుద్ధపు తొలి బలిగా... తన శిరస్సును
కొర్రవాయి-దుర్గ-కాళీమాతకు సమర్పించిన వీరుడు... ఇరవన్...
కలప్పలికి ముందురోజు సాక్షాత్తూ శ్రీకృష్ణుడే మోహిని కాగా
ఇరవన్‌ను పెండ్లియాడిన ఘట్టాన్ని...
ఇప్పటికీ తమిళనాడు కూవగం గ్రామంలో 18 రోజుల పండుగ...
అర్థ నారులు ఇరవన్‌ను పెండ్లాడే ఉత్సవ వేడుక...
ఆ ఇరవన్ ఖండిత శిరస్సూ అవలోకించింది...
కురు పాండవ సంగ్రామాన్ని... అంతెత్తునుంచీ... ఓ న్యాయనిర్ణేతగా...

నా వల్లనే యుద్ధం గెలిచామని పాండవులు వాదులాడుకుంటుంటే
సలహా ఇచ్చాడు శ్రీకృష్ణుడు... ఖండిత శిరస్సులనడగమని...
ఖండిత శిరస్సు పలికింది... మీరెవ్వరూ కాదు... వీరులా అన్నా చెల్లెళ్ళు-
ఆ నల్లని కృష్ణుడూ- కృష్ణ,
కృష్ణుడి చక్రం అధర్మపరుల్ని హతమార్చింది...
కృష్ణ-ద్రౌపది-తన కాళికాంశతో... అధర్మపరుల్ని మింగివేసి భూభారం తగ్గించింది...

అవిగో అవే ఉత్తరాన బర్బరీకుడూ, దక్షిణాన ఇరావంతుడూ
ఖండిత శిరస్సులై అనిమేషులై యుద్ధాల్ని చూస్తూనే ఉంటారు...

అక్కడ ట్రోజన్ యుద్ధం ప్రారంభమవుతున్నది...
ఆ హెలెన్ సుందర వదనం వేయి యుద్ధనౌకల్ని సముద్రాన నిలిపింది...
ఎవరు నౌక దిగి ట్రాయ్ నగర తీరాన అడుగు పెడ్తాడొ అతడికి మృత్యువు తప్పదు...
తెలివిగలవాడు ఒడిస్యూస్ హడావుడికి...
ప్రొటేసిలాస్ ముందు దూకాడు... యుద్ధపు తొలి బలి పశువైనాడు...

తమ దుశ్చింతనలను వ్యతిరేకించిన బాప్టిస్టు జాన్ తలను పళ్ళెంలో
తెప్పించారు హెరాద్, హెరొదీస్, సలోమీలు...

అలాగే పాల్ సాధువు ఖండిత శిరమూ...

నార్సు పురాణాల్లోని మిమిర్ పురుష సూక్తమూ...

ఫ్రెంచి విప్లవ కాలంలో ఈటెలకెత్తిన రాజవంశీకుల తలలూ...

కోట గోడలకు వేళ్లాడిన రాజద్రోహుల, సముద్రపు దొంగల తలలూ...

యుద్ధాల్లో పట్టుబడిన సైనికుల శిరచ్ఛేదాలూ...

ఇప్పటికీ కొన్ని దేశాలలో... అమలు జరుగుతున్న న్యాయ దండనలూ...

అప్పుడప్పుడూ మన దేశ సరిహద్దుల్లో
రక్తపు మడుగుల్లో కాన వచ్చే సైనిక వీరుల శిరస్సులూ...

మూడు మిస్సైళ్లతో ఒక్క నిముషంలో యుద్ధాన్ని ముగించగల బర్బరీకుడి
ఖండిత శిరస్సు దుఃఖిస్తున్నది...
చరిత్ర నుంచీ ఏమీ నేర్చుకోని ఈ మనుషుల్ని చూసి...

✧✧✧✧✧

# వైరస మంగళశ్లోకం

ద్యౌః శాంతిరంతరిక్షగ్ం శాంతిః

పృథివీ శాంతి రాపః శాంతి రోషధయః శాంతిః,

వనస్పతయ శ్శాంతి ర్విస్వేదేవాః

శాంతి ర్బ్రహ్మ శాంతిః సర్వగ్ం శాంతిః

వైరస నిర్మూలనా శాంతిః శాంతిః శాంతిః

శాంతిరేవ శాంతి స్సామా శాంతి రేధి

**(యజుర్వేదం 36-17)**



## Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S. GENERAL SURGERY
M.Ch. CARDIOTHORACIC SURGERY
Fellow in VASCULAR SURGERY
Post graduate Diplomate in Human Rights
Post graduate Diplomate in Television Production
Cell animation Specialist- Heart Animation Academy
Computer Animation Specialist- Pentafour- Chennai
Web Engineer and Web Designer- Web City- Hyderabad
Fellow of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

### I. Poetry (Telugu)

1. Alchemy
2. Vaana Mabbula Kanthi Khadgam
3. Tea Kappulo Toofan
4. Tangeti Junnu
5. Karakatakam (Cancer)
6. Oka Sarassu – Aneka Hamsalu (Psychiatry)
7. Marana Saasanam
8. Sri Lalitha Sahasranama Stotram
9. Kuyyo – Morro Satakam
10. Bhairava Satakam

### II. Poetry (English)

11. Shades
12. The Twilight Zone
13. My Poem is My Birth Certificate
14. The Pendulum Clock, The Gramophone, The Typewriter and The Pen
15. The Vigilance Whistle!
16. How to Cook a Delicious Poem
17. Windows and Apples
18. The Guerdon of Poesy
19. The Haste Land
20. Bees Need No Invitation When Flowers Bloom...
21. The Poet that launched a thousand poems
22. Walking with My Moon
23. Reflections

## III. Stories, Novels, Essays…(Telugu)

24. Katti Anchupai (Noir Stories)
25. Chupke – Chupke (Woman diseases)
26. Akshararchana
27. Deepa Nirvana Gandham (Death)
28. Swapna Sastram (Dreams-1)
29. Kalalu-Peeda Kalalu (Dreams-2)
30. Satyanveshanalo (Novel)
31. Sankya Sastram (Numerology)
32. Dr. Jayadev Cartoons (Cartoons)
33. Kathalu – kavitalu
34. Genome (Biotechnology Novel)

## IV Stories, Novels, Essays (English)

35. In Search of Truth (Novel)
36. How to be happy (Philosophy)
37. Bouquet of Telugu Songs and Poems

## V Translations (English to Telugu)

38. Iliad (Homer)
39. Odyssey (Homer)
40. Epic Cycle (Homer)
41. Three Greek Tragedies
42. The Poems of Sappho
43. Aeneid (Virgil)
44. Pilgrim’s Progress (John Bunyan)
45. Paradise Lost (John Milton)
46. Paradise Regained (John Milton)
47. Divine Comedy (Dante)
48. Faust (Goethe)
49. World Famous Stories
50. Namdeo Dhasal Poetry
51. William Blake Poetry
52. Emily Dickinson Poetry – Part I
53. Emily Dickinson Poetry – Part II
54. Emily Dickinson Poetry – Part III
55. Emily Dickinson Poetry – Part IV
56. Emily Dickinson Poetry – Part V
57. Russian Poetry
58. Jalapatam (Eighteen English Poets)
59. Dabbu Manishi (Money Poetry)

60. Santi Yuddham (War-Peace)
61. Christu Adbhuta Geethalu
62. The Path of Christ
63. Silappadikaram
64. Manimekhala
65. Sangam Poetry
66. Conference of Birds (Attar)
67. Masnavi - Part 1
68. Masnavi - Part 2
69. Masnavi - Part 3
70. Masnavi - Part 4
71. Masnavi - Part 5
72. Masnavi - Part 6
73. Madhusala (Edward Fitzgerald)
74. Sougandhika (Master Poems in English-1)
75. Toorpu Padamara (Master Poems in English-2)
76. Prema Kurisina Velalo… (Master Poems in English-3)
77. Vallu Mugguru (Master Poems in English-4)
78. Alanati Kothagali (Master Poems in English-5)
79. Manchu Toofan (Master Poems in English-6)
80. Endaa – Vaana (Master Poems in English-7)
81. Pillanagrovi Pipupu (Master Poems in English-8)
82. Naalugu Dikkulu (Master Poems in English-9)
83. Allanta Doorana Aa Paata Vinavacche (Master Poems in English-10)
84. Divya Vastrala Kosam (Master Poems in English-11)
85. Oka Madhusala (Master Poems in English-12)
86. The Axion Esti (Odysseus Elytis)
87. Love & Death (Frederico Garcio Lorca)
88. Ten Thousand Lines (Edwin Cordevilla)
89. Century of Love (Roula Pollard)
90. Pablo Neruda Poetry
91. Mexican Poetry
92. Inanna (Queen of Heaven and Earth)
93. Sataroopa (A.K. Khanna)
94. Aamani (Master Poems in English-13)
95. Kotha Deepalu (Master Poems in English-14)

## VI Translations (From Telugu, Hindi to English)

96. Bhagavatam (Potana)
97. Soundarya Lahari (Sankaracharya)
98. Modern Bhagavadgita

99. Samparayam (Suprasanna)
100. The Tree of Fire (Anumandla Bhoomaiah)
101. The Poems of Kuppam (Seeta Ram)
102. We Need a Language (T.W. Sudhakar)
103. The Broken Grammer (T.W. Sudhakar)
104. The Voice of Telangana (Madiraju Ranga Rao)
105. Fire and Ice (Rama Chandramouli)
106. The Tears of Bliss
107. This is no Streaking (Stories – K.K. Menon)
108. The Pool of Blood (Novel – Ampasayya Naveen)
109. Madhusala (Harivamsa Roy Bacchan)
110. Journey to Manasa Sarovar (English poetry)
111. Smooth Hands- Sosonjan A. Khan- (Bilingual)
112. Dancing Winds- Maria Miraglia (Bilingual)
113. Moments- Alicja Kubreska (Bilingual)
114. Tayouan Pai Pai- Yaw-Chin Fang(Bilingual)
115. The World of Extinct Lamps- Izabela Zubko (Tri lingual)
116. Pearls of Wisdom- Pramila Khadun- (Bilingual)
117. The Wind my lover- Ade C. Manila-(Bilingual)
118. The Mystic Mariner- Madan Gandhi (Bilingual)
119. Ten Color Rainbow - The Poems from Poland (Bilingual)
120. The True Meaning of Life - Rashid Pelpuo
121. The Wind My Lover - Ade C. (Bilingual)
122. Jak Ziemia Po Pierwszym Deszezu - The Poems from Poland (Bilingual)
123. Prima Ballerina Roberta Di Laura
124. The Casket of Vermilion (English Poetry)
125. Barefoot to Arcadia - Aprilia Zank (Bilingual)
126. Lets be one in The One - George Onsy (Bilingual)
127. Riding the Tide - Ashok Bhargava (Bilingual)
128. The Collected poems of Dr. LSR Prasad
129. The Epic of Gilgamesh
130. Krzysztof Kokot - Around the Haiku
131. Renata Cygan - I am a troubadour
132. Sergio Camellini - The Planet of Pink Clouds
133. Kumkum Bharine
134. Oulaya Drissi El Bouzaidi - A Long-winged Breath
135. Agnieszka Jarzebowska - The Fifth Season
136. The Making of Mahatma
137. Juliusz Erazm Bolek - The Secrets of life - A Calendar in verse
138. The Songs of Annamayya
139. Basudeb Chakraborti Poetry

140. Poland Poetry - As Clear as the Sun
141. Bozena Helena Mazur-Nowak's - Blue Longing
142. Izabela Zubko - The Holy Trinity
143. Deepa Chandran Ram - The Inner Quiet
144. Nazi Naaman Poetry
145. Lal Ded 'Vakhs'
146. Eden S. Trinidad - Eden Blooms
147. Dr. Jernail S. Anand - Fighting the Flames
148. Hell Rise in Paradise
149. Three Color Brush (China Poetry)
150. The Making of Mahatma - Poetry (Collector's Edition)
151. An Epic of Kashmir (Poetry)
152. The Legend of Lady Yang Guifei
153. Tjukurpa - Time Continuum (Dream Time - Every When)
154. Trident (Love, War and Peace) Poetry
155. Yuddhopanishad (The Upanishad of War)
156. COVID-19 - Biotechnology Novel
157. 108 Zen Poems (Krishna Prasai)
158. Covid-19 Parodies



# కోవిద్-19

## పేరడీలు - కవితలు

# COVID-19

## Parodies and Free Verse Poems

కలయెూ! వైరస మాయయెూ! యితర సంకల్పార్థమొ! జ్వరమొ!
తలపన్నే రకయున్న వాడినో! యల్ యస్ ఆర్ ప్రసాదు గానో, పర
స్థలమొ! కోవిదుడెంత? యాతని యాతనంబడి యజాండంబు ప్ర
జ్జ్వలమై యుండుట కేమి హేతువో? మహాశ్చర్యంబు శోధించగన్

ఎందరు కవి రాజులేలిరి కవితా మహావిభవంబు తోడ ము
న్నెందరు కవులేలుదురొ యేరికి శాశ్వతమొక్కొ, దీనికై, ని
బంధనలు లేని చందోరహిత కవితా పాటవమున యీ కరోనా
గ్రంధ ముగ్గడించ తలపోసిన యంత మా యమ్మ కరుణించెన్

(మార్చి, ఏప్రిల్, మే, జూన్ 2020 - కరోనా క్వారంటెయిను కాలపు
వందరోజుల కవితావర్షధార)


**Dr. Lanka Siva Rama Prasad**

**డాక్టర్ లంకా శివరామప్రసాద్**